thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 217 కరీంనగర్ మంగళవారం, 14 అక్టోబర్ 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## కేరళలో మెదడు తినే అమీబా కలకలం

తిరువనంతపురం : కేరళ రాష్ట్రాన్ని 'మెదడు తినే అమీబా' (నెగ్లేరియా ఫౌలెరి) కలవరపెడుతోంది. ఈ అరుదైన, అత్యంత ప్రమాదకరమైన అమీబిక్ మెనింగోఎన్సెఫలైటిస్ (మెదడు వాపు) వ్యాధి కారణంగా ఇప్పటివరకు రాష్ట్రంలో 104 కేసులు నమోదవగా, అందులో 23 మంది మరణించినట్లు రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి వీణా జార్జ్ ఆదివారం వెల్లడించారు. కొల్లాం, తిరువనంతపురం జిల్లాల్లో అత్యధిక కేసులు నమోదు కాగా, కోజికోడ్, మలప్పురం జిల్లాల్లో కూడా ఈ కేసుల సంఖ్య పెరుగుతున్నట్లు ఆమె పేర్కొన్నారు. 2023లో కోజికోడ్‌లో నిఫా వైరస్ వ్యాప్తి చెందిన తర్వాత, అన్ని ఎన్సెఫలైటిస్ కేసులను తప్పనిసరిగా నివేదించాలని, వాటి మూలాలను గుర్తించాలని అధికారులను ఆదేశించినట్లు మంత్రి తెలిపారు. ఫలితంగా, 2024 నుంచి ఈ కేసులను అధికారికంగా నమోదు చేశారని, వాటిలో కొన్నింటిని అమీబిక్ ఎన్సెఫలైటిస్ కేసులుగా గుర్తించారని చెప్పారు.

# వసతి గృహాలపై దృష్టి!

## ఇంతకాలం విసుగు చెందిన సమస్యలకు చెక్..

## కీలక నిర్ణయం తీసుకున్న సీఎం రేవంత్..




హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్రంలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సంక్షేమ వసతి గృహాల అభివృద్ధి, నిర్వహణకు సంబంధించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యంగా, విద్యార్థుల సంక్షేమం, వసతుల మెరుగుదల, నిధుల సక్రమ వినియోగంపై ఆయన ప్రభుత్వ యంత్రాంగానికి స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. సంక్షేమ హాస్టళ్లలో నెలకొన్న అత్యవసర పరిస్థితులను చక్కదిద్దేందుకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ. 60 కోట్ల మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. ఈ నిధులను హాస్టళ్లలో డైట్ ఛార్జీలుచెల్లించడం, తాత్కాలిక సిబ్బంది జీతాలు, మోటార్ల మరమ్మతులు, ఇతర అత్యవసర పనులకు వినియోగించేందుకు వెసులుబాటు కల్పించారు. ముఖ్యమంత్రి ఐసీసీసీ వేదికగా సంక్షేమ గృహాలు, విద్యా సంస్థలపై ఒక ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశానికి ముందు సంక్షేమ శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శ్రీ సబ్యసాచి ఘోష్ హాస్టళ్ల ప్రస్తుత పరిస్థితిని వివరిస్తూ ప్రెజెంటేషన్ ఇచ్చారు. అనంతరం ముఖ్యమంత్రి నిధుల చెక్కులను ఆయా శాఖల సీనియర్ అధికారులకు అందించారు. సంక్షేమ హాస్టళ్లపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సీఎం అధికారులను ఆదేశించారు. హాస్టళ్లలో ఉంటున్న విద్యార్థులు, బోధన, బోధనేతర సిబ్బందికి ముఖ గుర్తింపు ద్వారా హాజరు నమోదు చేయాలని నిర్దేశించారు. దీని ద్వారా పూర్తి స్థాయి సమాచారం, జవాబుదారీతనం ఉండేలా చూసుకోవాలన్నారు. హాస్టల్ విద్యార్థుల నాణ్యమైన ఆహారం, ఆరోగ్య సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. విద్యార్థులకు అందజేసే ఆహారం నాణ్యతను తెలుసుకోవడానికి ఒక యాప్‌ను ఉపయోగించాలని సూచించారు. సరైన పోషకాలతో కూడిన ఆహారం అందేలా చర్యలు తీసుకోవాలని.. కాల్షియం, విటమిన్స్ వంటి పోషక విలువలు గురించి డేటా ఉండాలని చెప్పారు. అలాగే.. యూనిఫాంలు, పుస్తకాలు సకాలంలో అందేలా సీనియర్ అధికారులు పర్యవేక్షించాలన్నారు. విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ప్రతి జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ వైద్య కళాశాలలు, ఏరియా ఆసుపత్రులను హాస్టళ్లతో అనుసంధానం చేయాలని ఆదేశించారు. వైద్య శిబిరాలు తరచుగా నిర్వహించాలని, అత్యవసర సమయాల్లో 24 గంటలు ఆన్‌లైన్‌లో వైద్యులు అందుబాటులో ఉండేలా హాట్‌లైన్ ఏర్పాటు చేయాలని సూచించారు. జిల్లా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు తరచుగా హాస్టళ్లను తనిఖీ చేసి, మెరుగైన సేవలు అందేలా పర్యవేక్షించాలన్నారు. హాస్టళ్లలోని వసతులు, నిర్వహణకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని డాష్‌బోర్డ్‌లో ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. హాస్టళ్ల నిర్వహణ, బకాయిల చెల్లింపు కోసం ముఖ్యమంత్రి సుదీర్ఘ ప్రణాళికలు సిద్ధం చేయాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శ్రీ రామకృష్ణారావు , సంక్షేమ శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శ్రీ సబ్యసాచి ఘోష్ ని ఉద్దేశించి.. స్కాలర్‌షిప్‌లు, జీతాలు, నిర్మాణ ఖర్చులతో పాటు నెలవారీ నిర్వహణ, బకాయిల చెల్లింపు కోసం అవసరమైన మొత్తానికి సంబంధించిన కార్యాచరణ ప్రణాళికను రూపొందించి సమర్పించాలని కోరారు. అలాగే.. కేంద్ర ప్రాయోజిత పథకాల నుంచి నిధులను సమీకరించాలని, వాటికి సంబంధించిన రాష్ట్ర ప్రభుత్వ మ్యాచింగ్ గ్రాంట్‌ను వెంటనే విడుదల చేయాలని ఆదేశించారు. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థుల కోసం ఎడ్ టెక్ సాంకేతికతను ఉపయోగించుకోవాలని సూచించారు. హాస్టల్ సేవలను సోషల్ మీడియా ద్వారా ప్రచారం చేయాలని, తప్పుడు ప్రచారాన్ని అడ్డుకోవడానికి యాప్‌లు రూపొందించాలని కూడా సీఎం అధికారులను పురమాయించారు. సమీక్షా సమావేశంలో మంత్రులు శ్రీ పొన్నం ప్రభాకర్ (బీసీ సంక్షేమం), శ్రీ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ (ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సంక్షేమం)తో పాటు ముఖ్యమంత్రి సలహాదారులు, ఉన్నత అధికారులు పాల్గొన్నారు.




## జూబ్లీహిల్స్ ఉపఎన్నిక నోటిఫికేషన్ విడుదల

హైదరాబాద్: జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉపఎన్నిక నోటిఫికేషన్‌ను ఎన్నికల అధికారులు విడుదల చేశారు. షేక్‌పేట తహసీల్దార్ కార్యాలయంలో ఈ నెల 21 వరకు అభ్యర్థుల నుంచి నామినేషన్లు స్వీకరించనున్నారు. 22న నామినేషన్ల పరిశీలన చేపట్టనున్నారు. 24 వరకు ఉపసంహరణకు గడువు ఉంది. నవంబర్ 11న పోలింగ్, 14 కౌంటింగ్ చేయనున్నారు. సెలవు రోజులు మినహా మిగిలిన పనిదినాల్లో నామినేషన్ల స్వీకరణ ఉంటుంది. కార్యాలయంలో నేరుగా లేదా.. డిజిటల్ విధానంలో దాఖలు చేసే అవకాశం కల్పించారు.

**ఇవీ మార్గదర్శకాలు...** 25 ఏళ్లు నిండిన పౌరులు నామినేషన్ వేయొచ్చు. నామినేషన్ పత్రం ఫారం 2బీ, అఫిడవిట్ ఫారం 26 ఇవ్వాలి. జాతీయ, రాష్ట్రంలో గుర్తింపు పొందిన పార్టీల తరపున పోటీ చేసే వారికి జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి చెందిన ఒక పౌరుడు ప్రతిపాదించవచ్చు. ఇతర అభ్యర్థులకు పది మంది అవసరం. అభ్యర్థి స్వయంగా లేదా.. ప్రతిపాదకుల్లో ఒకరు వచ్చి దాఖలు చేయవచ్చు. డిజిటల్ నామినేషన్‌ను https://encore.eci.gov.in ద్వారా దాఖలు చేయొచ్చు. క్యూఆర్ కోడ్‌తో ఉన్న ప్రింటెడ్ హార్డు కాపీని అందజేయాలి,

## అప్రమత్తంగా ఉండండి

### ప్రజలు జాగ్రత్తగా ఉండాలని అధికారుల సూచన..





హైదరాబాద్, అక్టోబర్ 13: తెలంగాణ రాష్ట్రంలోని పలు జిల్లాలలో ఇవాళ, రేపు మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. అక్టోబర్ నెల మొదలై చలి పెరుగుతుందని భావించినా, వర్షాలు మళ్ళీ మొదలవడంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఉత్తర భారతదేశం నుండి ప్రారంభమైన నైరుతీ రుతుపవనాలు తెలంగాణకు చేరుకున్నాయని, 24వ తేదీ నుంచి తగ్గుముఖం పడుతాయని వాతావరణ అధికారులు వివరించారు. రుతుపవనాల దృష్ట్యా ప్రస్తుతం రాష్ట్రంలో అక్కడక్కడా వర్షాలు కురుస్తున్నాయని తెలిపారు. ఈనెల 15వ తేదీ నాటికి రాష్ట్రం నుంచి నైరుతి రుతుపవనాలు పూర్తిస్థాయిలో నిష్క్రమిస్తాయని ఐఎండీ అంచనా వేసింది. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 17జిల్లాలలో వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ అధికారులు సూచించారు. ముఖ్యంగా హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజ్ గిరి, భద్రాద్రి కొత్తగూడెం, నల్గొండ, ఖమ్మం, సూర్యాపేట, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్, హన్మకొండ, వరంగల్, జనగామ, నాగర్ కర్నూలు, జోగులాంబ గద్వాల, వనపర్తి జిల్లాలలో ఎడతెరిపిలేని వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొన్నారు. ప్రస్తుతం హైదరాబాద్ లో పగలంతా వాతావరణం పొడిగా ఉంటుందని, రాత్రి ఉరుములు మెరుపులతో కూడిన వర్షాలు పడుతాయని వాతావరణ కేంద్రం పేర్కొంది. యాదాద్రి భువనగిరి జిల్లాలోని రాత్రి నుండి ఈరోజు తెల్లవారుజాము వరకు భారీ వర్షాలు కురిశాయి. వలిగొండలో అత్యధికంగా 190.8 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదయింది. యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరులో 131 మిల్లీమీటర్లు, మోతుకూరు మండలంలో దట్టప్పగూడలో 120.5 మిల్లీ మీటర్లు, మహబూబాబాద్ మండలం అయ్యగారి పల్లెలో 117.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది. లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి.

భారీ వర్షాల దృష్ట్యా ప్రయాణికుల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. భారీ వర్షాల దృష్ట్యా ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని వాతావరణ అధికారులు సూచిస్తున్నారు. భారీ వర్షాలు కురిసే ప్రాంతాల్లో అవసరమైతే తప్ప బయటికి రావొద్దని తెలుపుతున్నారు.

# మల్లోజుల పై సికాస్ అశోక్ ఫైర్

**-విద్రోహశక్తులతో జతకట్టి విషపూరిత వ్యాఖ్యలు -అమ్మ మీద వేసిన ఒట్టు ఏమైంది.? -అన్న కిషన్జీ త్యాగాలకు,మీ నిర్ణయాలకు పొంతన లేదు.**


సింగరేణి కార్మిక సమాఖ్య
(సి.కా.స)
తేది: 11.10.2025
మునుగు వీరులారా ఇంకెన్నాళ్ళు... మీ మెన్షివిక్ కుట్రలు...

చురకలు చీఫ్ రిపోర్టర్ హైదరాబాద్:మల్లోజుల వేణుగోపాల్ రావు దిగజారి పోయాడు,అతడు విప్లవ యోధుడు కాదు,ద్రోహి అనే మాట సోనుకు సరిపోతున్నదని సికాస సెక్రటరీ అశోక్ ఘాటుగా స్పందించాడు.విద్రోహశక్తులతో జతకలిసి విప్లవోద్యమ చరిత్రపైన అవగాహన లేని విధంగా మాట్లాడుతున్నారని అశోక్ మండిపడ్డారు. మావోయిస్ట్ పార్టీ నుండి బయటకు వచ్చిన మల్లోజుల వేణుగోపాల్ చుట్టూ లేఖలు రావడం సంచలనంగా మారింది.మొన్న సికాస సెక్రటరీ అశోక్ పేరిట ఓ లేఖను పంపించారు అందులో సోనుకు సంబంధించిన సాయుధ విరమణకు తాము సిద్ధంగా ఉన్నామని ఆయన తెలిపారు. ఈ రోజు అదే అశోక్ పేరిట ఉన్న లేఖలో సోనూ విధానాన్ని వ్యతిరేకిస్తూ అశోక్ పోరాటఘట్టాలను గుర్తు చేశారు పార్టీ వ్యతిరేకులతో కలిసి ఉద్యమం పై విషం చిమ్మినట్టు ఆరోపించారు తల్లికి సోను ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని అశోక్ సూచించారు సికాస నేత అశోక్ పంపిన లేఖను చురకలు పాఠకుల ముందు ఉంచూతున్నాం. పోరాటం విరమించబోం, పోరుజెండాను మరింత ఎత్తిపడతాం - **సికాస ప్రకటన**

**ముసుగు వీరులారా ఇంకెన్నాళ్ళు... మీ మెన్షివిక్ కుట్రలు**

ప్రియమైన విప్లవ శ్రేణులకు, ప్రజాస్వామ్యవాదులకు, ప్రజలారా ఈ సమాజంలో వర్గాలు అంతం కావాలని, కుల వివక్ష, ఆధిపత్యం, దోపిడీ లేని సమాజం కోసం భారతదేశంలో కొన్ని వందల సంవత్సరాలుగా ప్రజలు పోరాటాలు కొనసాగుతున్నారు. ఈ పోరాటాలను అనేక రూపాలలో కొనసాగించారు, నిరసనలు తెలిపారు. మూతికి గుడ్డలు కట్టుకొని కావచ్చు, నల్ల జెండాలతో కావచ్చు, గ్రామ బహిష్కరణలు కావచ్చు, దోపిడీదారులకు పనులు బందు చేయడం కావచ్చు, కార్మికులు ఉత్పత్తిని బంద్ చేయడం కావచ్చు, చట్టబద్ధమైన అనేక రకాల ప్రయత్నాలు చేస్తున్నారు. చిట్టచివరకు మాత్రమే ప్రజలు ప్రజాకంటకులకు తీవ్రమైన శిక్షలు వేస్తారు. ఇది చారిత్రిక సత్యం.సింగరేణిలో నిరసనలు, బంద్ లు అనేక పోరాట రూపాలతో సింగరేణి ప్రారంభించిన తొలినాళ్ళ నుండి కొనసాగుతున్నాయి. బాంచన్ దొర కాల్మొక్త దొర ఇక చెల్లదంటూ ప్రారంభమైన జగిత్యాల జైత్రయాత్ర కాలం నుండి సింగరేణిలో ఉద్యమాలకు సైరన్ మోగించారు. సికాస ప్రారంభమైన 1982 నుండి కార్మికోద్యమం భారతదేశంలో అన్ని బొగ్గుగనుల ఉద్యమాలకు ఆదర్శమైనది. త్రాగునీరు, విద్య, వైద్య, నివాస సౌకర్యాల కోసం సాగించిన నిరసనల వలన చాలా ఫలితాలు కార్మికులు సాధించగలిగారు. రాజ్యం అమలు చేసిన అనేక రకాల నిర్బంధాలను భరిస్తూ అలుపెరుగని పోరాటం చేసినారు. ఆర్థిక పోరాటాలను రాజకీయ పోరాటంగా మలిచినారు. పర్యావరణ పరిరక్షణ కోసం ఎన్నో ప్రయత్నాలు చేశారు. సికాస నిర్వహించిన పోరాటాలకు అండగా నిలిచిన సుమారు 36 మంది రక్తతర్పణ చేసినారు. లిపురిటినొప్పులు లేనిదే తల్లి బిడ్డకు జన్మనివ్వదు' అనేది ఎంత వాస్తవమో పోరాటాలు, త్యాగాలు లేనిదే హక్కులు సాధించలేమనేది సింగరేణి కార్మికుల జీవితాల్లో నిలిచింది. "మంత్రాలకు చింతకాయలు రాలవు" అనేది జగమెరిగిన సత్యం. కాని మనువాదం ఒంటబట్టిన వాళ్ళు పైసూక్తిని ఒప్పుకోరు. సింగరేణి కార్మికుల పోరాటాల చరిత్ర వేణుగోపాల్ కు తెలియనిదికాదు, ఇప్పుడు ఆ వాస్తవాలను వక్రబుద్ధితో వక్రీకరిస్తూ చరిత్రను తలకిందులుగా చూపడానికి ప్రయత్నిస్తున్నాడు. మార్క్స్ సిద్ధాంతం నుండి కర్మసిద్ధాంతంలోకి జారుకుంటున్నాడు. గత సంవత్సర కాలంగా ఆయనలో మొదలైన తిరోగమన ఆలోచనలను ఆచరణలో పెట్టడానికి మెల్లమెల్లగా ఒక గుంపును పోగు చేసుకుంటున్నాడు. జినుగు నరసింహారెడ్డి లాంటి ఒకరిద్దరిని ఏజెంట్లుగా పెట్టుకొని తేనె పూసిన కత్తిలాగా పని సాగించాడు. అమరుల త్యాగాలను హేళన చేస్తూ, "మనువాదుల ముహూర్తాలకు" సహాయాన్ని అందిస్తూ భారత విప్లవ పురోగమనాన్ని అడ్డుకోవడానికి పూనుకున్నాడు. సిద్ధాంత చర్చలను, వ్యూహ-ఎత్తుగడల విషయాలను కేంద్రీకృత ప్రజాస్వామ్య పద్ధతిలో పరిష్కరించుకునే పద్ధతికి తిలోదకాలిచ్చి దోపిడీదారుల ఏజెంట్లు అయిన పాలకుల భాషనెత్తుకున్నాడు. మావోయిస్ట్ పార్టీలో, విప్లవ శ్రేణుల్లో, ప్రజాస్వామ్యవాదుల్లో, చివరికి ప్రజల్లో గందరగోళం సృష్టించడానికి పథకం ప్రకారం ఈ పని చేస్తున్నాడు. అనన్య త్యాగాలు చేసే విప్లవకారులు కాలమాన అవసరాలకు తగ్గట్టుగా వ్యూహం-ఎత్తుగడలను మార్చుకోవడానికి ఎప్పుడూ వెనుకాడరు. కాలమాన పరిస్థితి పేరుతో మనువాదులు చెప్పే కర్మసిద్ధాంతం విప్లవ పురోగమనానికి పనికిరాదు అని మాత్రమే సికాస భావిస్తున్నది. శ్రమదోపిడీ లేని సమాజ లక్ష్యంగా చట్టబద్ధ, ప్రజాస్వామ్యయుత పోరాటాలను సికాస కొనసాగిస్తుంది. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం మెజారిటీ కార్మికుల అభిప్రాయాలతో అన్ని పోరాట రూపాల్లో ముందుకు సాగుతుంది. "ఓటమి విజయానికి తల్లిలాంటిది". ఉద్యమాల్లో, పోరాటాల్లో స్థల మార్పిడి ఉంటుంది కాని "అస్త్ర సన్యాసం" ఉండదు. ఇవన్ని వేణుగోపాల్ కు తెలియనివి కావు, భోదించనివి కావు, పేజీల కొద్ది రాయనివి కావు. పచ్చకామర్ల రోగిలాగా ఇప్పుడు పూర్తి విరుద్ధంగా మాట్లాడుతున్నాడు%Š% గుంపుకడుతున్నాడు%Š% ఆయన చెప్పున్న ఈ సిద్ధాంతం చెల్లుబాటు కాదనేది తెలిసి కూడా గందరగోళం సృష్టిస్తున్నాడు. సికాస తరుపున మేము చికాగో అమరుల రక్తంతో మొదలైన ఎర్రజెండా పోరాట వారసత్వాన్ని కొనసాగిస్తూ కార్మికుల హక్కుల సాధనలో ముందుకు సాగుతామని మరోసారి తెలియజేస్తున్నాము. అమరుల త్యాగాలపైన ఏ మాత్రమైనా గౌరవం ఉంటే తప్పుడు ఆలోచనలు, విధానాలు మానుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నాము. భారత విప్లవోద్యమ పురోగమనానికి ఆటంకంగా మారి, ద్రోహం తలపెడుతున్న నీవు కనీసం అమ్మ మధురమ్మకు ప్రతిజ్ఞాపూర్వకంగా ప్రకటించుకున్న నీ వీలునామా మరచి నీవు అమ్మకు కూడా ద్రోహం చేస్తున్నావు. అశోక్‌కార్యదర్శి సింగరేణి కార్మిక సమాఖ్య (సి.కా.స)



# సంక్షేమ హాస్టళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలి: సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్: సంక్షేమ హాస్టళ్లపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని అధికారులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. హాస్టళ్లలో బోధన, బోధనేతర సిబ్బందికి ముఖ గుర్తింపు హాజరు విధానం అమలు చేయాలన్నారు. పూర్తి డేటాతో సంక్షేమ హాస్టళ్ల వ్యవస్థలో జవాబుదారీతనం కనిపించాలని స్పష్టం చేశారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, సంక్షేమశాఖలపై కమాండ్ కంట్రోల్ కార్యాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్షించారు. విద్యార్థులకు అందించే భోజనం నాణ్యతను సాంకేతిక పరిజ్ఞానంతో తనిఖీ చేయాలన్నారు. విద్యార్థులకు సరైన పోషకాలతో కూడిన పౌష్టికాహారం అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. హాస్టళ్లలో విద్యార్థులకు అందించే దుస్తులు, పుస్తకాలు, వారికి చేరుతున్నాయో లేదో ధ్రువీకరించాలని చెప్పారు. ప్రతి హాస్టల్‌లో మౌలిక సదుపాయాలపై పూర్తి స్థాయి డేటాను సాంకేతిక పరిజ్ఞానంతో ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేయాలని అధికారులను సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని సమీక్షించేందుకు ప్రత్యేక విధానం అనుసరించాలని, హాస్టళ్లను సమీపంలోని వైద్య కళాశాలలు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లకు అనుసంధానం చేయాలని సీఎం సూచించారు. అధికారులు తరచూ హాస్టళ్లను సందర్శించి ఆరోగ్య తనిఖీలు చేయాలని దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలో సంక్షేమ హాస్టళ్లకు సంబంధించి ప్రతినెలా గ్రీన్ ఛానెల్‌లో నిధులు అందేలా కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని అధికారులను సీఎం ఆదేశించారు.




హైదరాబాద్ : జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఉపఎన్నిక సందడి మొదలైంది. సోమవారం నామినేషన్లకు తొలిరోజు కావడంతో ఔత్సాహిక అభ్యర్థులు నామినేషన్లు వేశారు. తొలిరోజు నామినేషన్ల ప్రక్రియ పూర్తయ్యింది. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు మొదటి రోజు 10 నామినేషన్లు దాఖలయ్యాయి. నామినేషన్ వేసిన వారిలో ఇద్దరు రిజిస్టర్ పార్టీల అభ్యర్థులు ఉండగా.. 8 స్వతంత్ర అభ్యర్థులు నామినేషన్ వేశారు. తెలంగాణా పునర్నిర్మాణ సమితి తరఫున పూస శ్రీనివాస్ నామినేషన్ దాఖలు చేయగా.. నవతరం పార్టీ నుంచి అర్వపల్లి శ్రీనివాస రావు నామినేషన్ వేశారు. స్వతంత్ర అభ్యర్థులుగా సిలివేరు శ్రీకాంత్, పెసరకాయల పరీక్షిత్ రెడ్డి, చలిక చంద్ర శేఖర్, సపవత్ సుమన్, వేముల విక్రమ్ రెడ్డి, ఇబ్రహీం ఖాన్ తో పాటు మరో ఇద్దరు అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేశారు. షెడ్యూల్ ప్రకారం 2025, అక్టోబర్ 13వ తేదీన నోటిఫికేషన్ రిలీజ్ చేశారు రిటర్నింగ్ అధికారి. షేక్ పేట్ ఎమ్మార్వో ఆఫీసులో నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ కూడా ప్రారంభం అయ్యింది. అక్టోబర్ 21వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ ఉంటుంది. 22వ తేదీన దాఖలైన నామినేషన్ పరిశీలన ఉంటుంది. 24వ తేదీ వరకు నామినేషన్ విత్ డ్రా.. ఉపసంహరణకు గడువు ఉంది. జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నిక కోసం నామినేషన్ల స్వీకరణ ప్రారంభం అయిన రోజునే.. సోమవారం ఫస్ట్ నామినేషన్ దాఖలు అయ్యింది. సిలివేరు శ్రీకాంత్ అనే వ్యక్తి రెండు సెట్ల నామినేషన్ పత్రాల దాఖలు చేశారు. ఇండిపెండెంట్ అభ్యర్థిగా బరిలోకి దిగుతున్నాడు. స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేశారు సిలివేరు శ్రీకాంత్. జూబ్లీహిల్స్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి నవీన్ యాదవ్. బీఆర్ఎస్ పార్టీ నుంచి మాగంటి సునీత ఫైనల్ అయ్యారు. బీజేపీ అభ్యర్థి ఎవరు అనేది ఇంకా ఫైనల్ కాలేదు. సిట్టింగ్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మరణంతో ఉప ఎన్నిక జరుగుతుంది. బీఆర్ఎస్ పార్టీ నుంచి గోపీనాథ్ భార్య సునీత బరిలోకి దిగుతున్నారు.




ములుగు: మేడారం అభివృద్ధి పనులను మంత్రులు సీతక్క, పొంగులేటి శ్రీనివాస రెడ్డి పరిశీలించారు. మేడారం గద్దెల ప్రాంగణ పునర్నిర్మాణ పనులపై అధికారులతో సమీక్షించారు. నిర్దేశించిన గడువులోగా పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడారు.

"మేడారం అభివృద్ధికి రూ.212 కోట్ల నిధులతో మాస్టర్ ప్లాన్ రూపొందించాం. నిధులు ఎక్కువైనా ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నాం. మేడారంలో భక్తులకు అన్ని రకాల సదుపాయాలు ఉండాలి. అభివృద్ధి పనులపై అందరి సూచనలు తీసుకుంటాం. కేవలం ప్రాంగణం అభివృద్ధి కోసమే రూ.101 కోట్లు కేటాయించాం. ఎంత ఖర్చయినా సరే.. మేడారం ప్రాంగణాన్ని అద్భుతంగా తీర్చిదిద్దుతాం" అని తెలిపారు. ఇక ఇటీవల తనపై వచ్చిన విమర్శలపై కూడా మంత్రి పొంగులేటి స్పందించారు. "నేను ఏంటో అందరికీ తెలుసు. రూ.70 కోట్ల కాంట్రాక్టు కోసం తాపత్రయపడే అవసరం లేదు. నాపై సహచర మంత్రులు ఫిర్యాదు చేశారంటే నమ్మబుద్ధి కావడం లేదు. నా మీద ఫిర్యాదు చేయడానికి అసలు ఏం ఉంది. సీతక్క, సురేఖ ఇద్దరూ సమ్మక్క-సారక్కలాగ పనిచేస్తున్నారు" అని పొంగులేటి అన్నారు. తన శాఖలో, వరంగల్ జిల్లా రాజకీయాల్లో రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పెత్తనం చేస్తున్నారని, ఆయన జోక్యం మితిమీరుతోందని దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ, ఆమె భర్త కొండా మురళి శనివారం కాంగ్రెస్ అధిష్ఠానానికి ఫిర్యాదు చేశారని మంత్రి పీఆర్ఓ మీడియాకు ఒక ప్రకటనలో తెలిపిన విషయం తెలిసిందే.

## మంత్రుల మధ్య వివాదాలు చాలా చిన్న అంశం: మహేశ్ కుమార్ గౌడ్



ఢిల్లీ: మంత్రుల మధ్య వివాదాలు చాలా చిన్న అంశమని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. ఇది తమ కుటుంబంలోని సమస్యని, తామే పరిష్కరించుకుంటామని స్పష్టం చేశారు. సమాచారలోపం వల్లే మంత్రుల మధ్య వివాదాలు తలెత్తాయన్నారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను ఢిల్లీలో ఆయన పరామర్శించారు. ఇటీవల ఖర్గేకు వైద్యులు పేస్‌మేకర్ అమర్చిన సంగతి తెలిసిందే. ఖర్గేతో భేటీ అనంతరం మహేశ్‌కుమార్ గౌడ్ మీడియాతో మాట్లాడుతూ.. బీసీ రిజర్వేషన్లు, స్థానిక సంస్థల ఎన్నికలపై హైకోర్టు స్టే సహా ఇటీవల రాష్ట్రంలో చోటు చేసుకున్న పరిణామాలను ఆయనకు వివరించినట్లు తెలిపారు. త్వరలోనే హైకోర్టు తీర్పును సుప్రీం కోర్టులో సవాల్ చేయనున్నట్లు వివరించారు.




## కాంగ్రెస్‌కు ఓటేస్తే.. హైడ్రా బుల్డోజర్ రావడం ఖాయం: కేటీఆర్

హైదరాబాద్, అక్టోబర్ 13: బీఆర్ఎస్ జూబ్లీహిల్స్ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మాట్లాడుతూ... జూబ్లీహిల్స్ బై ఎలక్షన్ కారు, బుల్డోజర్‌కు మధ్య జరుగుతున్న ఎన్నికని అన్నారు. ఎన్నికలో కాంగ్రెస్‌కు ఓటు వేస్తే హైడ్రా బుల్డోజర్ ఇంటికి రావటం ఖాయమంటూ వ్యాఖ్యలు చేశారు. మోసపోతే.. ప్రజలు ఘోస పడతారన్నారు. మాగంటి గోపినాథ్ కుటుంబం అనాధ కాదని.. వారికి అండరం అండగా ఉంటామని స్పష్టం చేశారు. జూబ్లీహిల్స్‌లో ధర్మం బీఆర్ఎస్ వైపు ఉందన్నారు. తెలుగు భాషలో ఎన్ని తిట్లు ఉన్నాయో.. రేవంత్ రెడ్డిని ప్రజలు అన్ని తిట్లు తిడుతున్నారంటూ వ్యాఖ్యలు చేశారు. ఒక్కొక్కరికి కాంగ్రెస్ ఎంత బాకీ పడిందో గుర్తించి.. ప్రతి వ్యక్తిని కలిసి బాకీ కార్డు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్‌ను హైదరాబాదీలు నమ్మలేదని.. హైదరాబాద్ ఎన్నికల్లో అందుకే ఒక్క సీటూ ఇవ్వలేదని తెలిపారు. ఇళ్లు కూలగొట్టడమేనా ఇందిరమ్మ రాజ్యం అంటే అని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి మాదిరి గలీజ్ భాష మాట్లాడే ముఖ్యమంత్రి దేశంలోనే లేరని మాజీ మంత్రి కేటీఆర్ వ్యాఖ్యలు చేశారు.

**సునీతకు అండగా ఉంటాం: హరీష్ రావు...** 'సోదరి మాగంటి సునీతకు కేటీఆర్, నేను.. కుడి ఎడమల మాదిరిగా ఉంటాం' అని హామీ ఇచ్చారు మాజీ మంత్రి హరీష్ రావు. బీఆర్ఎస్ జూబ్లీహిల్స్ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జూబ్లీహిల్స్ బై ఎలక్షన్ రాష్ట్రానికి సంబంధించిన ఎన్నికన్నారు. తెలంగాణ ప్రజలు జూబ్లీహిల్స్ ప్రజల వైపు చూస్తున్నారని అన్నారు. జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ ఓడినంత మాత్రానా.. రేవంత్ రెడ్డి పదవి పోదన్నారు. వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలు చేస్తానని మాట తప్పారని విమర్శించారు. రేవంత్ రెడ్డికి జూబ్లీహిల్స్‌లో చురుకు తగలాలన్నారు. బీఆర్ఎస్ గెలుపు ఖాయమైందని.. మెజారిటీ కోసమే ఎన్నికని చెప్పారు. హైడ్రా ఆగాలంటే.. బీఆర్ఎస్‌ను గెలిపించాలని కోరారు. రేవంత్ .. తెలంగాణను అత్యంత అవినీతిమయంగా మర్చారని ఆరోపించారు. తెలంగాణను కేసీఆర్ దేశానికి ఆదర్శంగా తయారని చెప్పుకొచ్చారు. ముఖ్యమంత్రి ఏవిధంగా ఉండకూడదు అంటే.. రేవంత్ రెడ్డి మాదిరి ఉండకూడదంటూ హరీష్ రావు వ్యాఖ్యలు చేశారు.

**మాగంటి సునీత భావోద్వేగం...** కాగా.. బీఆర్ఎస్ జూబ్లీహిల్స్ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశంలో ఆ పార్టీ అభ్యర్థి మాగంటి సునీత భావోద్వేగానికి గురయ్యారు. భర్త దివంగత మాజీ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్‌ను తలుచుకుని కన్నీటిపర్యంతమయ్యారు. గోపీనాథ్ ఆశాయాలు ముందుకు తీసుకెళ్తానని మాగంటి సునీత స్పష్టం చేశారు. అలాగే గోపీనాథ్ కుమార్తె అక్షర మాట్లాడుతూ.. 'మా తండ్రి గోపీనాథ్ ఆశయాలను ముందుకు తీసుకెళతాం. జూబ్లీహిల్స్ నియోజకవర్గ ప్రజలకు అండగా ఉంటాం' అని పేర్కొన్నారు.

## జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ గుర్తుపై మజ్లిస్ అభ్యర్థి పోటీ: రామచందర్‌రావు



హైదరాబాద్: జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పోటీ చేస్తోందా?మజ్లిస్ పోటీ చేస్తోందా? అని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు ప్రశ్నించారు. కాంగ్రెస్ గుర్తుపై మజ్లిస్ అభ్యర్థి పోటీ చేస్తున్నారని ఆయన వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ గతంలో మజ్లిస్ నుంచి పోటీ చేశారన్నారు. కాంగ్రెస్ అభ్యర్థిగా ప్రకటించిన తర్వాత మజ్లిస్ అధినేతను ఆయన కలిశారని ఆరోపించారు. జూబ్లీహిల్స్ ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని కోరారు. భాజపా రాష్ట్ర కార్యాలయంలో రామచందర్‌రావు మీడియాతో మాట్లాడారు. " కాంగ్రెస్, భారత రాష్ట్ర సమితి పాలనను జూబ్లీహిల్స్ ప్రజలు చూశారు. ఈ రెండు పార్టీలు నగరాన్ని అధ్వానంగా తయారు చేశాయి. విశ్వనగరం చేస్తామన్న భారత రాష్ట్ర సమితి.. విషాద నగరంగా మార్చింది. జూబ్లీహిల్స్ ప్రజలు భాజపాను ఆదరించాలి. నియోజకవర్గంలోని మేధావులు, సినీ ప్రముఖులు మా పార్టీకి ఓటు వేస్తారని ఆశిస్తున్నాం. ఇవాళ రాత్రి లేదా రేపు అభ్యర్థిని ప్రకటించే అవకాశం ఉంది" అని ఆయన తెలిపారు.

## జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్‌ను ఓడిస్తేనే ఆరు గ్యారంటీలు అమలవుతాయి: హరీశ్‌రావు



హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తెలంగాణను అత్యంత అవినీతి రాష్ట్రంగా మార్చేశారని మాజీ మంత్రి, భారత రాష్ట్ర సమితి నేత హరీశ్‌రావు విమర్శించారు.

ఏ పని జరగాలన్నా కాంగ్రెస్ నేతలు కమీషన్లు అడుగుతున్నారని ఆరోపించారు. రహమత్‌నగర్‌లో పార్టీ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడారు. "జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్‌ను ఓడిస్తేనే ఆరు గ్యారంటీలు అమలవుతాయి. మా హయాంలో పేదల కోసం బస్తీ దవాఖానాలు ఏర్పాటు చేశాం. అక్కడ పనిచేసే వైద్యులు, సిబ్బందికి జీతాలు ఇవ్వడం లేదు. ఔషధాలు కూడా ఉండటం లేదు. హైడ్రా పేరుతో పేదల ఇళ్లే కూలుస్తున్నారు.. పెద్దలవి కూల్చడం లేదు" అని హరీశ్‌రావు ఆరోపించారు.

## కాంగ్రెస్ ప్రభుత్వం బీజేపీ ట్రాప్‌లో పడింది..




హైదరాబాద్: కేంద్ర ప్రభుత్వంపై సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు విమర్శలు గుప్పించారు. విద్యుత్ చట్ట సవరణ ప్రతిపానను కేంద్ర ప్రభుత్వం ఈ నెల 9న చేసిందని తెలిపారు. దీనిపై నెల రోజుల పాటు ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టనుందని పేర్కొన్నారు. గతం కంటే దుర్మార్గమైన అంశాలు ఇందులో ఉన్నాయని ఆరోపించారు. వినియోగదారుల, విద్యుత్ పంపిణీ సంస్థల ప్రమేయం లేకుండా కేంద్రం చట్టం చేయబోతుందని చెప్పారు. బొగ్గు గనులను కార్పోరేట్ పరం చేసే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రైవేటు కార్పోరేట్ సంస్థలకు, విద్యుత్ ఉత్పత్తి సంస్థల లాభాల కోసం కేంద్రం ఇలా చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకోచ్చిన ఈ విధానం ద్వారా అదానీ కంపెనీలకు అధిక లాభం కలగనుందని బీవీ రాఘవులు ఆరోపించారు. విద్యుత్ పంపిణీ సంస్థలను ప్రైవేటీకరించే కుట్ర చేస్తున్నారని మండిపడ్డారు.

దీని ద్వారా రైతాంగానికి, ఉచిత గృహ విద్యుత్ పొందుతున్న వారందరికీ తీవ్ర నష్టం జరుగుతుందని తెలిపారు. విద్యుత్ రంగాన్ని ప్రైవేటు పరం చేయడం.. అదానీ కంపెనీలకు మేలు చేసేందుకు చేసిందే అని విమర్శించారు. జూలై 25న సీఎం రేవంత్ రెడ్డి ఒక ప్రకటన చేశారని గుర్తుచేశారు. మూడవ విద్యుత్ పంపిణీ సంస్థ ఏర్పాటు చేస్తామని అన్నారని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా బీజేపీ ట్రాప్‌లో పడిందని బీవీ రాఘవులు తెలిపారు. విద్యుత్ కూడా ఒక మౌలిక సదుపాయమని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని ప్రజలు వ్యతిరేకించాల్సిన అవసరం ఉందని చెప్పారు. భారత్‌పై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కక్షసాధింపు చర్యలకు పాల్పడితే.. ఎందుకు మోదీ నిశ్శబ్దంగా ఉన్నారని ప్రశ్నించారు. దేశంలో వ్యవసాయ రంగాన్ని రక్షించకపోతే ఇబ్బందులు ఎదుర్కోక తప్పదని సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు హెచ్చరించారు.




దేశీయ విపణిలో పసిడి ధరలు ఇప్పట్లో తగ్గే పరిస్థితి కన్పించట్లేదు. అంతర్జాతీయ పరిణామాలు, గిరాకీ ఇతరత్రా కారణాలతో బంగారం ధర అంతకంతకూ పెరుగుతూ కొత్త రికార్డులు సృష్టిస్తోంది. ధనత్రయోదశి డిమాండ్‌తో ఈ వారాంతంలో పుత్తడి ధర దేశవ్యాప్తంగా రూ.1.30 లక్షలు దాటే అవకాశముందని బులియన్ వర్గాలు వెల్లడిస్తున్నాయి. ఇప్పటికే ప్రొద్దుటూరులో 24 క్యారెట్ల నాణ్యమైన 10 గ్రాముల బంగారం ధర రూ.1,30,200 పలుకుతోంది. ఇక, హైదరాబాద్‌లో పుత్తడి ధర రూ.1,27,700కు చేరుకుంది. అటు కిలో వెండి ధర రూ.1.77లక్షలు దాటేసింది. గోల్డ్ ఈటీఎఫ్‌లు, కేంద్ర బ్యాంకుల కొనుగోళ్లతో పుత్తడి రికార్డు స్థాయిలో పరుగులు పెడుతోందని ఎస్ఎంసీ గ్లోబల్ సెక్యూరిటీస్ కమోడిటీ రీసెర్చ్ హెడ్ వందనా భారతి తెలిపారు.

ఈ ధనత్రయోదశి నాటికి 10 గ్రాముల పసిడి ధర రూ.1,30,000 పైన ఉండొచ్చని అభిప్రాయ పడ్డారు. ఇక, 2026 ఆరంభం నాటికి రూ.1.50లక్షలకు చేరొచ్చని అంచనా వేశారు. ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్‌లో ఔన్సు బంగారం ధర 4,071.50 డాలర్లుగా ఉంది. ఈ వారాంతానికి ఔన్సు ధర 4,150-4,250 డాలర్లు చేరుకునే అవకాశముందని ఆమె తెలిపారు. ఇక, దేశీయంగా ఫ్యూచర్స్ ట్రేడింగ్‌లోనూ బంగారం ధర రికార్డు స్థాయిలో రూ.1,23,977 వద్ద సరికొత్త గరిష్ఠాన్ని తాకింది. వెండి ధర కూడా రూ.లక్షన్నర దాటి పరిగెడుతోంది. అమెరికా షట్‌డౌన్ ఎత్తివేతపై అనిశ్చితి, యూఎస్-చైనా వాణిజ్య ఉద్రిక్తతల వంటి పరిణామాలతో బంగారంలో పెట్టుబడులకు మదుపర్లు మొగ్గు చూపుతున్నారు. ఈ క్రమంలోనే గోల్డ్ ఈటీఎఫ్‌లకు గిరాకీ విపరీతంగా ఉంటోంది. సెప్టెంబరులో గోల్డ్ ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్ల (గోల్డ్ ఈటీఎఫ్)లో నిధుల ప్రవాహం పెరిగింది. ఆగస్టులో వీటిలోకి రూ.2,190 కోట్ల పెట్టుబడులు రాగా, సెప్టెంబరులో ఈ మొత్తం నాలుగింతలై రూ.8,363 కోట్లకు చేరింది. మరోవైపు, రానున్న దీపావళి పర్వదినంతో పాటు పెళ్లిళ్ల సీజన్ నేపథ్యంలో దేశీయ మార్కెట్‌లో పసిడికి మరింత డిమాండ్ ఉంటుందని బులియన్ వర్గాలు అంచనా వేశాయి.

చురకలు






అమరావతి, అక్టోబర్ 13: అమరావతిలో సీఆర్డీయే కార్యాలయాన్ని సీఎం చంద్రబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. రాష్ట్ర విభజన తర్వాత ఏపీకి రాజధాని లేకుండా రాష్ట్రం ఏర్పడిందన్నారు. రాజధాని ఎక్కడ పెట్టాలో నిర్ణయించడానికి నాడు కేంద్రంలోని యూపీఏ ప్రభుత్వం కమిటీ వేసిందని తెలిపారు. రాజధాని ఎక్కడ పెట్టాలనే అంశాన్ని కూడా చెప్పకుండా విభజన చేశారని.. రాజధాని కోసం జాగా కూడా లేని పరిస్థితుల్లో రాష్ట్ర విభజన చేశారని అన్నారు. రాజధాని విషయంలో నాటి యూపీఏ ప్రభుత్వం లేనిపోని పంచాయితీ పెట్టిందని విమర్శించారు. రాష్ట్రం మధ్యలో రాజధాని పెడితే అందరికీ బాగుంటుందని ఇక్కడ ఏర్పాటు చేశామని చెప్పారు. బెస్ట్ రాజధాని నిర్మిస్తున్నామని... గ్రీన్ ఫీల్డ్ రాజధాని నిర్మిస్తున్నామని వెల్లడించారు. రాజధాని నిర్మాణానికి భూమి కావాలని.. ప్రణాళికలకు అనుగుణంగా రాజధాని నిర్మించగలరా అని అనుమానపడ్డారని అన్నారు. సైబరాబాద్ నిర్మించిన అనుభవంతో అమరావతి నిర్మాణం ప్రారంభించామని.. భూమి కోసం ఎదురు చూస్తున్న సమయంలో అమరావతి రైతులు తనకు దారి చూపారని సీఎం వెల్లడించారు. రైతులు ఐదు సంవత్సరాలు ఇబ్బందులు పడ్డారని.. రాజధాని వేశ్యల ప్రాంతమని మాట్లాడారని.. ఎడారి, స్మశానం అన్నారని మండిపడ్డారు. ఇంత మంచి ప్రాంతం ఎక్కడా ఉండదన్నారు. 30, 40 లక్షల ఎకరాలు సాగు చేసే నది కృష్ణా నది అని.. ప్రపంచంలో ఎక్కడా లేని సిటీ అమరావతి అని తెలిపారు. ఇక్కడ గ్రీనరీ అద్భుతంగా వస్తుందని.. ఇక్కడ బ్లూ , గ్రీన్ సిటీగా అమరావతి ఉంటుందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. 'గతంలో జరిగిన తప్పుకు మీరు, నేను, రాష్ట్ర ప్రజలు ఎంత అనుభవించారో చూశారు. ఇకపై ఎన్డీఏ ప్రభుత్వం శాశ్వతంగా ఉండాలి. అమరావతి కన్నా విశాఖ ముందుకు వెళుతోంది. అమరావతికి శంకుస్థాపన సమయంలో పవిత్ర ప్రాంతాల నుంచి మట్టి నీరు తెచ్చారు. పార్లమెంట్ మట్టి, యమునా నది నీటిని ప్రధాని తెచ్చారు. అందుకే అమరావతి నిలిచింది. రైతులను నేను మరిచిపోను.. మరిచిపోతే త్యాగాన్ని మరిచిపోయినట్టే' అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.




విశాఖ: పౌర సరఫరాల శాఖలో సంస్కరణలు తీసుకొస్తున్నామని.. మార్పు మొదలవుతోందని మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. విశాఖలో పీడీఎస్ బియ్యాన్ని గుర్తించే ర్యాపిడ్ కిట్స్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. గతేడాది కాకినాడ పోర్టులో బియ్యం అక్రమ రవాణాపై చర్యలు చేపట్టినట్లు తెలిపారు. కాకినాడ నుంచి రవాణా అయ్యే ప్రతి సరకును పరిశీలించి జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు చెప్పారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 5,65,000 క్వింటాళ్లు స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. విశాఖ నుంచి పీడీఎస్ బియ్యం ఎగుమతులు జరగకుండా చర్యలు చేపట్టినట్లు చెప్పారు. నగరంలో 33 మంది సిబ్బందితో 3 చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామన్నారు. "ఇతర రాష్ట్రాల నుంచి తరలివస్తున్న బియ్యాన్ని కూడా పూర్తిగా పరిశీలిస్తున్నాం. నిఘా విభాగం అధికారులు అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటాం. ఏపీలో 700 మొబైల్ కిట్స్ సిద్ధం చేశాం. అక్రమంగా ఎగుమతి చేసే పీడీఎస్ బియ్యాన్ని గుర్తించేందుకు ఇవి ఉపయోగపడతాయి. చెక్‌పోస్టుల వద్ద తనిఖీలు ముమ్మరం చేశాం. ఈ ఏడాది నుంచి ప్రజలకు నాణ్యమైన బియ్యం అందిస్తాం. ఇప్పటికే స్మార్ట్ రైస్ కార్డులు, క్యూఆర్ కోడ్ జారీ చేశాం. దుకాణాలకు ఎంత బియ్యం తరలించాం.. పంపిణీ ఎంత అవుతుందనే వివరాలు సేకరిస్తున్నాం" అని నాదెండ్ల మనోహర్ వివరించారు.

## తితిదేకు రూ.75 లక్షల విరాళం అందజేసిన హైదరాబాద్ ఎన్జీవో



తిరుమల: హైదరాబాద్‌కు చెందిన ఏడీవో ఫౌండేషన్ అనే ఎన్జీవో సంస్థ సోమవారం తితిదే ఎస్వీ ప్రాణదాన ట్రస్టుకు రూ.75 లక్షలు విరాళంగా అందించింది. ఈ మేరకు ఆ సంస్థ ప్రతినిధులు తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడికి విరాళం డీడీని అందజేశారు. వారిని ఛైర్మన్ అభినందించారు.




శ్రీ సత్యసాయి జిల్లా హిందూపురం నియోజకవర్గం పర్యటనలో భాగంగా ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ హిందూపురం పట్టణం, కిరికెర పంచాయతీ పరిధిలో పలు అభివృద్ధి పనులు, ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. బసవనపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోఅదనపు గదులు, బి.టి.రోడ్డును ప్రారంభించారు. హిందూపురం పట్టణంలో కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో అదనపు గదుల నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు చదువులో రాణించాలని సూచించారు. విద్యారంగం అభివృద్ధి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక కార్యక్రమాలు ప్రవేశపెట్టిందని తెలిపారు.




అమరావతి, అక్టోబరు 13 : అసత్య ప్రచారం చేస్తున్న సాక్షి మీడియాకి నోటీసులు పంపించింది ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం . కల్తీ మద్యంతో మరణాలు అంటూ అసత్య వార్తలని వండి వార్చింది జగన్ మీడియా సంస్థ సాక్షి. ఈ మేరకు ఆధారాలు చూపాలంటూ సెక్షన్ 179 (1) ప్రకారం నోటీసులు జారీ చేశారు ఏపీ పోలీసులు. సాక్షి యాజమాన్యంతో పాటు సాక్షి పత్రిక చీఫ్ ఎడిటర్ ధనుంజయ రెడ్డి, సాక్షి నెల్లూరు జిల్లా బ్యూరో చీఫ్ చిలకా మస్తాన్ రెడ్డికి నోటీసులు జారీ చేశారు. నకిలీ మద్యానికి నలుగురు బలి అంటూ సాక్షి పత్రికలో 8.10.2025న ప్రచురించిన వార్తకు సంబంధించిన ఆధారాలు తమకు 12.10.2025న కలిగిరి పోలీస్ స్టేషన్‌కి వచ్చి సమర్పించాలని సాక్షి యాజమాన్యానికి నోటీసుల్లో స్పష్టం చేశారు పోలీసులు. ఆధారాలు చూపించకపోతే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని సాక్షికి నోటీసులు జారీ చేశారు పోలీసులు.

ఈ నేపథ్యంలో నోటీసులు తీసుకోవడానికి ముందుకు రాలేదు సాక్షి యాజమాన్యం. ఫోన్ స్విచ్ఛాఫ్ చేసి నోటీసులు తీసుకోకుండా పరార్ అయ్యినట్లు తెలుస్తోంది. రాసిన తప్పుడు వార్తలకు సంబంధించి వివరణ ఇవ్వకపోతే ఎక్కడున్నా చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని ఏపీ పోలీసులు హెచ్చరించారు.




## మద్యం కుంభకోణంలో కీలక మలుపు

అమరావతి: మద్యం కుంభకోణం కేసులో ఈ రోజు ఏసీబీ కోర్టు కీలక నిర్ణయాలు తీసుకుంది. ఈ కేసులో ప్రధాన నిందితులైన పలువురికి ఈ నెల 16వ తేదీ వరకు రిమాండ్‌ను విజయవాడ ఏసీబీ కోర్టు పొడిగించింది.

**న్యూయార్క్ వెళ్లాలన్నమిథున్ రెడ్డి...** ఇదిలా ఉంటే, ఈ కేసులో నిందితుడిగా ఉన్న రాజంపేట వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డి, ఈ నెల 20వ తేదీ నుంచి న్యూయార్క్ వెళ్లేందుకు అనుమతి ఇవ్వాలంటూ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ అభ్యర్థనపై స్పందించిన కోర్టు, సిట్ అధికారులు కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. దీనిపై తదుపరి విచారణను కోర్టు రేపటికి వాయిదా వేసింది.

**వెన్నునొప్పితో చెవిరెడ్డి...** మరో నిందితుడు చెవిరెడ్డి భాస్కర రెడ్డి కోర్టులో తన ఆరోగ్య పరిస్థితిపై పలు విన్నపాలు చేశారు. తాను తీవ్ర వెన్నునొప్పితో బాధపడుతున్నానని తెలిపారు. నిన్న, మొన్న ఆసుపత్రిలో చూపించుకున్నానని కోర్టుకు వివరించారు. వైద్యులు ఫిజియోథెరపీ చేయించాలని సూచించారని చెప్పారు.

ప్రభుత్వ గుర్తింపు పొందిన మంతెన ఆశ్రమంలో చికిత్స చేయించుకునేందుకు అనుమతి ఇవ్వాలని కోరారు. అయితే, తాను పోలీస్ కస్టడీలోనే చికిత్స చేయించుకుంటానని కోర్టుకు స్పష్టం చేశారు. నొప్పి భరించలేకపోతున్నానని కోర్టులో పేర్కొన్నారు. ఈ అభ్యర్థనపై కోర్టు స్పందిస్తూ తదుపరి విచారణలో పరిశీలిస్తామని తెలిపింది.




## నాపై కుట్రలు చేశారు...వినుత కోట ఎమోషనల్

తిరుపతి, అక్టోబరు 13 : శ్రీ కాళహస్తి జనసేన మాజీ ఇన్‌చార్జి వినుత కోట ఇవాళ(సోమవారం) ఓ వీడియో విడుదల చేశారు. తన మనసు నిండా పుట్టెడు బాధతో ఈ వీడియో విడుదల చేస్తున్నానని ఆవేదన వ్యక్తం చేశారు. తాను చేయని డ్రైవర్ రాయుడు హత్యకు జైలుకెళ్లినా బాధలేదు గానీ, తాను చంపానని జరుగుతున్న ప్రచారం ఎక్కువగా బాధించిందని తెలిపారు. తాను లక్షల రూపాయల జీతాలు వదులుకుని రాజకీయాల్లోకి వచ్చింది సేవ చేయటానికి స్పష్టం చేశారు.తాను రాజకీయాల్లోకి వచ్చింది హత్యలు చేయటానికి కాదని.. ఆ మనస్తత్వం తమది కాదని క్లారిటీ ఇచ్చారు. ఈ కేసులో తమకు ప్రమేయం లేదని కోర్టులో రుజువు చేసుకుని బయటకు వస్తామని చెప్పుకొచ్చారు. క్లీన్ చిట్‌తో తాముబయటకు వస్తామని స్పష్టం చేశారు. ఈ కేసు కోర్టులో ఉన్నందున ఇంతకు మించి మాట్లాడటం లేదని తెలిపారు. ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ని కలవటానికి ప్రయత్నించానని గుర్తుచేశారు. తాము ప్రస్తుతం చెన్నైలో ఉన్నామని చెప్పుకొచ్చారు. తనపైన జరిగిన కుట్రలకు సంబంధించిన పూర్తి ఆధారాలతో వీడియోలతో సహా ప్రజల ముందుకు వస్తానని వినుత కోట పేర్కొన్నారు.

## వైసీపీ అబద్ధాలను నమ్ముకొని మనుగడ సాగిస్తోంది..





కర్నూల్: ప్రధాన మంత్రి మోదీ పర్యటన కోసం రాయలసీమ ప్రజలు ఎదురు చూస్తున్నారని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. జీఎస్టీలో మార్పులు చేయడం వల్ల పేద మధ్య తరగతి కుటుంబానికి ఏడాదికి 20 నుంచి 40 వేలు ఆదా అవుతుందని తెలిపారు. రాష్ట్రంలో మొత్తం మీద దాదాపుగా 8 వేల కోట్ల రూపాయల వరకు ఆదా అవుతుందని చెప్పుకొచ్చారు. దేశ చరిత్రలో ఎప్పుడు ధరలు పెరగడం చూశాం. జీఎస్టీ సంస్కరణ వల్ల ధరలు తగ్గడం కూటమి ప్రభుత్వంలోనే చూస్తున్నామని ఆయన పేర్కొన్నారు. జీఎస్టీలో మార్పుల వల్ల మందులు, దుస్తులు, ఎలక్ట్రానిక్ వస్తువులు, వాహనాల ధరలు భారీగా తగ్గాయని ఆయన స్పష్టం చేశారు.

**అపర భగీరథుడు ముఖ్యమంత్రి చంద్రబాబు..** రాయలసీమకు హంద్రీనీవా ప్రాజెక్టు గుండెకాయ అని మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. ప్రాజెక్టును గత వైసీపీ ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని ఆరోపించారు. అతి తక్కువ సమయంలో హంద్రీనీవా ప్రాజెక్ట్ కాలువను విస్తరణ పనులు చేపట్టి, చివరి ఆయకట్టుకు నీరు అందించిన అపర భగీరథుడు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అని మంత్రి నిమ్మల కొనియాడారు.

**ఇది మా చిత్తశుద్ధి..** అనంతరం.. వైసీపీపై మంత్రి నిమ్మల రామానాయుడు విమర్శలు చేశారు. వైసీపీ అబద్ధాలను నమ్ముకొని మనుగడ సాగిస్తోందని ఆరోపించారు. నాసిరకం మద్యానికి ఆద్యుడు మాజీ సీఎం జగనే అని విమర్శించారు. మొలకలచెరువులో నకిలీ మద్యం స్కామ్ బయట పెట్టిందే కూటమి ప్రభుత్వమని గుర్తు చేశారు. ఇందులో సొంత పార్టీ నాయకుల ప్రమేయం ఉందని వారిని పార్టీ నుంచి సస్పెండ్ చేయడం జరిగిందని స్పష్టం చేశారు. ఇది తమ చిత్తశుద్ధి అని ధీమా వ్యక్తం చేశారు. సిట్ విచారణలో అన్ని విషయాలు త్వరలోనే బయటపడతాయని ఆయన చెప్పుకొచ్చారు.

**మహిళల తాళి బొట్లను తాకట్టు పెట్టిన ఘనుడు జగన్..** మద్యంపై అప్పులు తెచ్చి మహిళల తాళిబొట్లను తాకట్టు పెట్టిన ఘనుడు జగన్ అని మంత్రి నిమ్మల మండిపడ్డారు. గతంలో వెస్ట్ గోదావరి జిల్లాలో 27మంది నాసిరకం మద్యం తాగి చనిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంలో ఎన్నో పరిశ్రమలు వేరే రాష్ట్రాలకు తరలిపోయాయని చెప్పారు. జగన్ పాలనలో పరిశ్రమల యాజమాన్యాలు ఎంతో అలజడికి గురయ్యారని పేర్కొన్నారు. పరిశ్రమలు తీసుకొచ్చి యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించడమే సీఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేష్ లక్ష్యమని మంత్రి నిమ్మల రామానాయుడు ఉద్ఘాటించారు.

## క్రీడలకు అధిక ప్రాధాన్యత: మంత్రి అనిత



అమరావతి, అక్టోబర్ 13: అఖిల భారత పోలీస్ పవర్ లిఫ్టింగ్ క్లస్టర్ పోటీలను రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత, డీజీపీ హరీష్ కుమార్ గుప్తా ఈరోజు (సోమవారం) ప్రారంభించారు. ఈ సందర్భంగా హోంమంత్రి అనిత మాట్లాడుతూ.. ఐదు రోజుల పాటు రెండు ప్రాంతాల్లో ఈ పోటీలు నిర్వహిస్తామన్నారు. పోలీసుల క్రీడా స్ఫూర్తిని నింపేందుకు గత ఏడాది ఈ పోటీలు ప్రారంభించామని చెప్పారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు అయిన తర్వాత మొదటి సారిగా పోటీలు జరగటం శుభ పరిణామమన్నారు. పవర్ లిఫ్టింగ్‌తో పాటు, యోగా పోటీలను నిర్వహించటం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. యోగాలో రాష్ట్రం గిన్నిస్ బుక్ సాధించిన సంగతి తెలిసిందే అని అన్నారు. రాజధానిలో స్పోర్ట్స్ సిటీ ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. క్రీడలకు కూటమి ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తుందన్నారు. అన్ని రాష్ట్రాల నుంచి 1011 మంది క్రీడాకారులు పోటీల్లో పాల్గొననున్నారని మంత్రి అనిత పేర్కొన్నారు.

## త్వరలోనే నూతన గోదాములకు శ్రీకారం: ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు

విజయవాడ, అక్టోబర్ 13: గత సంవత్సరం ఖరీఫ్ సీజన్‌లో 16 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించడం జరిగిందని ఏపీ ఎఫ్.సి.ఐ అధ్యక్షులు, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు తెలిపారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. ఈ ఖరీఫ్ సీజన్‌లో 30 లక్షల ధాన్యం సేకరించాలని టార్గెట్ పెట్టుకున్నామన్నారు. రబీలో కూడా గత సంవత్సరం 10 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ జరిగిందని... ఈ సంవత్సరం కూడా ధాన్యం సేకరణ పెంచేందుకు చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. రాష్ట్రంలో శ్రీకాకుళం, విజయనగరం, పల్నాడు జిల్లాలో ఎఫ్‌సీఐ అధ్వర్యంలో నూతన గోదాముల నిర్మాణానికి శ్రీకారం చుట్టబోతున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో ఇతర ప్రాంతాల్లో కూడా గోదాముల నిర్మించేందుకు ఎఫ్. సి. ఐ ముందుకు వచ్చిందని... ప్రభుత్వం తరుపున స్థలాలను అందిస్తామని అన్నారు. ప్రస్తుతం ఉన్న ఎఫ్‌సీఐ గోదాముల్లో సోలార్ విద్యుత్ ఉత్పత్తి చేయాలని భావిస్తోందన్నారు. గోదాముల ద్వారా 45 మెగా వాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తి అవుతుందని చెప్పుకొచ్చారు. ఎఫ్‌సీఐ మెంబర్లు 15 నుంచి 20 రోజుల లోపల గోదాముల పరిశీలనకు వెళ్తారని అన్నారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా రైతుల వద్ద నుంచి ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు పేర్కొన్నారు.

చురకలు

## సంపాదకీయం

### దరిద్రానికి బ్రాండ్ అంబాసిడర్ ఆ దేశం

దరిద్రమంతా కట్టకట్టుకుని ఆ దేశంలోనే కొలువుందిట. అది అంతకంతకు పెరిగిపోతూ దరిద్రానికి కేరాఫ్ అడ్రస్ గా మారిందంట. ఇంతకీ ఆ దరిద్రాన్ని నిండా కౌగిలించుకున్న దేశం ఏమిటి అంటే భారత్ దాయాది పాకిస్థాన్ అని అంటున్నారు. ఈ విషయం ఎవరో చెప్పింది కాదు, ప్రపంచ బ్యాంక్ తన నివేదికలో పేర్కొంది.

**పేదరికం తిష్ట :** పాకిస్థాన్ లో పేదరికం పూర్తిగా తిష్ట వేసింది అని ప్రపంచ బ్యాంక్ ఆందోళన వ్యక్తం చేసింది. పాకిస్తాన్ పేదరికం అతి భయంకరంగా పెరిగిపోతోంది అని పేర్కొంది. కేవలం ఎనిమిదేళ్ళ కాలంలో గరిష్ట స్థాయికి ఇది చేరింది అని గుర్తు చేసింది. ఒక వైపు చూస్తే పాక్ ఐఎంఎఫ్ నుంచి భారీగా రుణాలు తీసుకుంటున్నా ఆ దేశంలో పేదరికం ఎక్కడా తగ్గడం లేదని ఎత్తి చూపింది.

**రక్షణ రంగం పైనే :** పాకిస్థాన్ తెచ్చిన రుణాలను దేశ అభివృద్ధికి ఖర్చు చేయడం లేదని అత్యధిక శాతం రక్షణ రంగం మీదనే వెచ్చిస్తోందని ప్రపంచ బ్యాంక్ కీలక నివేదికలో స్పష్టం చేయడం విశేషం. గ్రామీణాభివృద్ధిని పాకిస్థాన్ పూర్తిగా పక్కన పెట్టేసిందని కూడా పేర్కొంది ఫలితంగా పాకిస్తాన్ లని ఆర్థిక వ్యవస్థ తీవ్ర సంక్షోభంలో కూరుకుని పోయిందని వివరించింది.

**మధ్యతరగతి పోరాటం :** పాకిస్థాన్ లో మధ్యతరగతి వర్గాలు పెద్ద ఎత్తున జీవన పోరాటం చేస్తున్నా పేదరికం వైపే వారు జారిపోతున్నారని వెల్లడించింది. గత ఎనిమిది సంవత్సరాల కాలంలో చూసుకుంటే పాకిస్థాన్ పేదరికం ఎప్పుడూ లేని విధంగా గరిష్ఠ స్థాయికి చేరుకుందని ప్రపంచ బ్యాంక్ నివేదిక అసలైన నిజాలు బయటపెట్టింది. కేవలం రెండేళ్ళ కాలంలో అంటే 2023 నుంచి ఈ రోజుకు ఏకంగా ఏడు శాతం పేదరికంలో భారీ పెరుగుదల కనిపిస్తోంది అంటే పాక్ దారుణమైన స్థితిలో ఉందని అర్థమని చెబుతోంది.

**గ్రామాల నిర్లక్ష్యం :** పాకిస్థాన్ గ్రామాలను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోంది అని ఈ నివేదిక ఎత్తి చూపిస్తోంది. ఇక దేశంలోని మొత్తం జనాభాలో 42.7 శాతంగా మధ్యతరగతి వర్గాలు ఉన్నాయని వారంతా కూడా కనీస ఆర్థిక భద్రత కోసం అల్లాల్లాడుతున్నారు అంటే పాకిస్తాన్ ఏ విధంగా ఇబ్బంది పడుతోంది అన్నది కళ్ళకు కట్టినట్లుగా ఈ నివేదిక చూపించేస్తోంది.

**బలహీనంగా ఆర్థికం :** పాకిస్థాన్ ఈ రోజున ఆర్థికంగా అత్యంత బలహీనంగా ఉందని ఈ నివేదిక తేటతెల్లం చేస్తోంది అంతే కాదు దేశ ఆర్థిక పునాదులే చాలా వీక్ గా ఉన్నాయని చెబుతోంది. ఏ మాత్రం అలక్ష్యం చేసినా మొత్తానికి మొత్తం దేశ జనాభా పేదరికం అంచుల్లోకి జారిపోయే ప్రమాదం ఉందని కూడా హెచ్చరిస్తోంది అయితే పాక్ మాత్రం తెల్లారి లేస్తే భారత్ మీద అసూయతో అక్కసుతో దారుణమైన విమర్శలు చేస్తోంది. ఆర్భాటాలు చేస్తోంది. రక్షణ రంగం మీద పెట్టుబడులు పెడుతూ పేదల పొట్ట మాడుస్తోంది. నిజానికి పాక్ కి భారత్ నుంచి ఏ రకమైన ప్రమాదం లేదు, కానీ పాకే ఉగ్రవాదులను ప్రోత్సహిస్తోంది అన్న ఆరోపణలు ఉన్నాయి ముందు తన దేశాన్ని చక్కదిద్దే పనిలో పాక్ సీరియస్ గా దిగకపోతే రానున్న కాలంలో ప్రజల నుంచే తిరుగుబాటు వస్తుందని అంటున్నారు.


## ప్రమాణాల పాటింపుపై ప్రభుత్వాలు దృషి సారించాలి - అక్టోబర్ 14... ప్రపంచ ప్రమాణాల దినోత్సవం




వస్తువులన్నింటికీ నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా ఉండాలని నిబంధనలు ఉన్నా, సర్వం నాసిరకం అవుతున్న నేటి పరిస్థితులలో ప్రభుత్వాలు ప్రతి వస్తువు నాణ్యతా ప్రమాణాలు పాటించేలా ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం అనివార్యంగా ఉంది. ప్రపంచ లేదా అంతర్జాతీయ ప్రమాణాల దినోత్సవం ప్రతి సంవత్సరం అక్టోబరు 14న నిర్వహించ బడుతుంది. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న అంతర్జాతీయ ప్రమాణ సంస్థలు తమతమ దేశాలలో ప్రమాణాలను నిర్ణయించిన సందర్భంగా ఈ దినోత్సవాన్ని జరుపుకుంటారు. అమెరికన్ సొసైటీ ఆఫ్ మెకానికల్ ఇంజనీర్స్ (ఏఎస్ఎంఈ), ఇంటర్నేషనల్ ఎలక్ట్రోటెక్నికల్ కమిషన్ (ఐఈసీ), ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ ఫర్ స్టాండర్డైజేషన్ (ఐఎస్ఓ), ఇంటర్నేషనల్ టెలి కమ్యూనికేషన్ యూనియన్ (ఐటీయు), ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీర్స్ (ఐఈఈఈ), ఇంటర్నెట్ ఇంజనీరింగ్ టాస్క్ ఫోర్స్ (ఐఈటీఎఫ్) వంటి ప్రమాణాల అభివృద్ధి సంస్థలలో వినియోగ దారులు, నియంత్రకాలు మరియు పరిశ్రమలలో ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు ప్రామాణీకరణ యొక్క ప్రాముఖ్యత గురించి అవగాహన పెంచడం ఈ రోజు యొక్క ఉద్దేశ్యం. వేలాది మంది నిపుణుల కృషిని గుర్తు చేస్తూ జరుపు కుంటారు. 1946, అక్టోబరు 14న లండన్‌లో జరిగిన సమావేశంలో 25 దేశాల ప్రతినిధులు పాల్గొని వినియోగ దారులకు ప్రామాణిక మైన, నాణ్యమైన వస్తు ఉత్పత్తులను అందించేందుకు అంతర్జాతీయ ప్రమాణిక సంస్థను ఏర్పాటు చేసుకోవాలని నిర్ణయించారు. దానికి గుర్తుగా అక్టోబరు 14న ప్రపంచ ప్రమాణాల దినోత్సవం జరుప బడుతుంది. ఒక సంవత్సరం తరువాత అంతర్జా తీయ ప్రమాణిక సంస్థ ఏర్పడినప్పటికీ, 1970 వరకు మొదటి ప్రపంచ ప్రమాణాల దినోత్సవం జరుపు కోలేదు. ప్రస్తుతం ఈ సంస్థలో 125 సభ్య దేశాలు ఉన్నాయి. ప్రామాణీకరణ యొక్క ప్రాముఖ్యత గురించి పరిశ్రమలు, వినియోగ దారులలో అవగాహన పెంచుతారు. ప్రపంచ వ్యాప్తంగా వివిధ దేశాలలోని జాతీయ సంస్థలు వేరువేరు రోజుల్లో ఈ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నాయి. 2014లో యునైటెడ్ స్టేట్స్ 2014, అక్టోబరు 23న ప్రపంచ ప్రమాణాల దినోత్సవాన్ని నిర్వహించింది. కెనడా దేశపు జాతీయ అక్రెడిటేషన్ బాడీ అయిన స్టాండర్డ్స్ కౌన్సిల్ ఆఫ్ కెనడా (ఎస్.సి.సి) అంతర్జాతీయ సంస్థలతో కలిసి ప్రపంచ ప్రమాణాల దినోత్సవాన్ని జరుపుకుంటుంది. 2012లో స్టాండర్డ్స్ కౌన్సిల్ ఆఫ్ కెనడా అక్టోబరు 12 శుక్రవారం రోజున ప్రపంచ ప్రమాణాల దినోత్సవాన్ని జరుపుకుంది. 1947లో భారతదేశంలో బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్స్ చట్టాన్ని ఆమోదించి బ్యూరోను ఒక శాసన బద్దమైనా సంస్థగా మార్చారు. అప్పటి నుంచే ఐ.ఎస్ .ఐ ముద్ర ప్రకటితమైంది. ఈ ముద్ర గల వస్తువులు నాణ్యత కలిగినది. 1947లో భారతీయ ప్రమాణాల సంస్థ మొదటి రెండు విభాగాలను ఏర్పాటు చేసింది. ఒకటి బట్టలకు, రెండవది ఇంజనీరింగ్‌కు సబంధించినది. ఈ సంస్థ నిర్ణయించిన తొలి ప్రమాణం ఏమిటో తెలుసా, మన జాతీయ పతాకం ఎంత పొడవు, వెడల్పు ఉండాలన్నది ఈ సంస్థ నిర్ణయించింది. 1951లో ఆనాటి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ సంస్థ కార్యాలయంలో స్వీకరిం చారు. అంతే కాదు మెట్రిక్ విధానాన్ని దేశంలో 1955లో ప్రవేశ పెట్టారు. తర్వాత తూనికలు, కొలతల పరిమాణాన్ని చట్టాన్ని ఆమోదించింది. కాలక్రమంలో టెలి కమ్యూని కేషన్స్ టీకాలు, నూనె గింజలు, త్రాగునీరు, పాడి పరిశ్రమ వంటివి కూడా ఈ సంస్థ పరిధిలోకి చేర్చారు. ఐఎస్ఐ మార్కు సంస్థ అనుమతి లేనిదే ఎవరూ వాడ కూడదు. అన్ని సాంకేతిక పరీక్షలు, తనిఖీలు నిర్వహించిన దరిమిలా ఒక సంవత్సరానికి ఐఎస్ఐ లైసెన్స్ ఇస్తుంది. ప్రతీ సంవత్సరం రెన్యువల్ చేసుకోవాలి. ప్రమాణాలు నిర్ణయించడానికి ప్రపంచ వ్యాప్తంగా అంతర్జాతీయ ప్రమాణ సంస్థలు ఈ రోజునే ప్రారంభించాయి. కనుక ఈ రోజున వరల్డ్ స్టాండర్స్‌డే గా జరుపు కుంటారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

## దృశ్య మాధ్యమాన్ని సామాజిక అస్త్రంగా మలిచిన వేదగిరి - అక్టోబర్ 14... వేదగిరి రాంబాబు జయంతి



వేదగిరి రాంబాబు గుంటూరు జిల్లా తెనాలి తాలూకా చుండూరులో 1952 అక్టోబరు 14న పూర్ణచంద్రరావు, భార్గవి దంపతులకు జన్మించాడు. అతని తండ్రి ఎక్సైజ్ శాఖలో ఉద్యోగిగా తన విద్యుక్త ధర్మాన్ని సక్రమంగా నిర్వహిస్తున్నందున రాష్ట్రంలో అనేక ప్రాంతాలకు బదిలీ పై వెళ్ళవలసి వచ్చింది. అలా రాంబాబు బాల్యం, చదువు అంతా వివిధ ప్రాంతాలలో కొనసాగింది. రాంబాబు నాటకాలలో గానీ, సినిమా ఛాన్సులకోసం ప్రయత్నించడం కానీ అతని తండ్రికి యిష్టముండేది కాదు. డిగ్రీ చదువుతున్నప్పుడే అతనిలో సాహిత్యం పట్ల క్రమంగా అభిరుచి పెరిగింది. సాహితీ కారునిగా అతనికి యర్రంశెట్టి సాయి రచనలు స్ఫూర్తిదాయకంగా నిలిచాయి. ప్రముఖ రచయితలైన యర్రంశెట్టి సాయి, ఆదివిష్ణు, విహారిలను గురుతుల్యులుగా భావించాడు. 1974 సంవత్సరంలో డిగ్రీ ఫైనలియర్‌లో చదువు తుండగా ఆంధ్రపత్రిక దీపావళి కథల పోటీకి సరదాగా పంపిన తన తొలికథ 'సముద్రం' బహుమతి సాధించి పెట్టింది. ఇక అదే క్రమంలో అప్పటి ప్రముఖ వార పత్రికలైన యువ, జ్యోతి, స్వాతి, ఆంధ్రపత్రికలకు వరసగా కథలు పంపిస్తుండే వాడు. కొంతకాలం ఆలిండియా రేడియోలో అనౌన్సర్‌గా పనిచేశాడు. రాంబాబు కథానికలకు రేడియో ద్వారా మంచి ప్రాచుర్యం లభించింది. ఆయన ఫ్రీలన్స్ జర్నలిష్టుగా వివిధ దినపత్రికలకు అనేక వ్యాసాలను వ్రాసి పంపించే వాడు. కొంతకాలం ఆంధ్రభూమి వారపత్రికలో సీనియర్ జర్నలిస్ట్‌గా చేశాడు. పల్లకి వారపత్రికకు సంపాదకుడిగా పనిచేశాడు. ఎక్కడ ఏ ఉద్యోగం చేసినా తనలోని రచనా వ్యాసంగాన్ని కొనసాగిస్తునే ఉన్నాడు. దూరదర్శన్ అందుబాటు లోకి వచ్చాక దృశ్య మాధ్యమాన్ని సామాజిక అస్త్రంగా మలిచి జనాలలో మార్పు తేవాలని ఆశించాడు. ఆ క్రమంలోనే 'పాపం పసివాడు' సీరియల్‌ను 52 వారాలపాటు నిరంతరాయంగా దూరదర్శన్‌లో రూపొందించాడు. ఎన్నో కష్టనష్టాల కోర్చి దూరదర్శన్ టెలీ సీరియల్‌ను తన సొంత ఖర్చుతోనే భరించి తీర్చిదిద్దాడు. రాంబాబు తీసిన టెలిఫిల్మ్‌కు ఉత్తమ నిర్మాత, దర్శకునిగా ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం తరపున బంగారు నంది అవార్డు దక్కింది. కృష్ణమోహన్ టైటిల్ సాంగ్ కు కూడా నంది అవార్డు వచ్చింది. తర్వాత 'అడవి మనిషి' సీరియల్‌కు రజిత నంది వచ్చింది. దూరదర్శన్‌లో శైలజా సుమన్, రమణీ సన్యాల్ వంటి వారితో కలిసి ఇన్‌హౌస్ సీరియల్ని చేశాడు. దాదాపు రెండు సంవత్సరాల పాటు ఎంతో కష్టపడి జైలు అధికారుల అనుమతి తీసుకుని రాష్ట్రంలోని పలు జైళ్లలో పరిస్థితుల ప్రభావం చేత ఖైదీలుగా శిక్ష అనుభవిస్తున్న ఖైదీల యథార్ధ గాథలను తీసుకుని వాటినే తన కథా వస్తువులుగా చేసుకుని 'జైలుగోడల మధ్య' సీరియల్ ను రూపొందించాడు. అంతకుముందే అది స్వాతి వారపత్రికలో దాదాపు 60–70 వారాల పాటు పాఠకులను అలరించింది. రాంబాబు రాసిన 'జైలుగోడల మధ్య' పుస్తక రూపంలో దాదాపు చాలా భాషల్లో ప్రచురితమైంది. బాలసాహిత్యం లోనూ బాలల కోసం ఆయన చేసిన కృషి అజరామరం. "ఇంద్ర ధనుస్సు" అనే బాలల తొలి వీడియో మేగజైన్‌కు తొలి ఎడిటర్‌గా పనిచేశాడు. తెలుగు కథానికలపై వాటిని చిన్నచూపు చూసే వారిపై ఆయన విమర్శనాస్త్రాలు సంధిస్తూ ఉండేవాడు. ఏనాటికైనా వాటికి కూడా జాతీయస్థాయి గుర్తింపు తేవాలని ఆయన ఉద్దేశం. గ్లోబల్ ఆసుపత్రి మీడియా ఇన్‌ఛార్జిగా పనిచేస్తూ తనవద్దకు సాయం కోసం వస్తే వాళ్లకు ఉదారంగా తనకు సాధ్యమైనంతలో వారికి తక్కువ ఖర్చుతోనే వైద్య సేవలు చేయిస్తూ ఇతోధిక సేవలందిస్తుండే వాడు. వంద కథానికల పూర్తి వివరాలతో 'తెలుగు కథానిక డాట్ కామ్' కూడా ప్రారంభించాడు. 23 జిల్లాల కథానిక తీరుతెన్నులగూర్చి పోటీపెట్టి వ్యాసాల్ని సేకరించాడు. ఈ వ్యాస సంకలనాలను జయంతి సభలో ఆవిష్కరించాడు. అలాగే రచయితల చిరునామాలతో ఒక డైరెక్టరీని తీసుకొచ్చాడు.తప్పక చదవాల్సిన వంద కథానికలు అనే పేరుతో ఒక పుస్తకం వెలువరించారు. మహాకవి గురజాడ అప్పారావు 153వ జయంతి పురస్కరించుకుని సెప్టెంబర్ 21, 2015 న గురజాడ పురస్కారం అందజేసారు. ఆయన సుమారు రెండు వేలకు పైగా గురజాడకు సంబంధించిన కథలు, కథానికలు రచించారు. సముద్రం గ్రంథానికి తెలుగు విశ్వ విద్యాలయం ఉత్తమ కథానిక సంపుటి పురస్కారం, పాపం పసివాళ్ళు ధారావాహికం – రాష్ట్ర ప్రభుత్వ బంగారు నంది, అడవి మనిషి – టెలిఫిల్మ్ – రజత నంది, ఆకాశవాణిలో జింగిల్స్ కు ప్రసార భారతి పురస్కారం, రాష్ట్ర ప్రభుత్వం నుండి గురజాడ స్మారక పురస్కారం, గిడుగు పురస్కారం, కొండేపూడి శ్రీనివాసరావు సాహితీ సత్కారం అందుకున్నారు. 2018ఆగస్టు 28న రాంబాబు ఈ లోకాన్ని వదిలి వెళ్లారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**


## దేశ రక్షణ పరిశోధనలో ఆద్యుడు సూరి భగవంతం - అక్టోబర్ 14...సూరి భగవంతం జయంతి

సూరి భగవంతం (అక్టోబరు 14, 1909 – ఫిబ్రవరి 6, 1989) (వయసు 79) ప్రముఖ శాస్త్రవేత్త. దేశ రక్షణకు సంబంధించిన పరిశోధనల్లో ఆద్యుడు. ఆయన కృష్ణా జిల్లా ఆగిరిపల్లి గ్రామంలో అక్టోబరు 14, 1909 న జన్మించారు. ప్రాథమిక విద్యా భ్యాసం అనంతరం హైదరాబాదు నిజాం కళాశాలలో డిగ్రీ (బి.ఎస్సీ) చదువు పూర్తిచేసి, మద్రాసు యూనివర్సిటీ నుండి బి.ఎస్.సి (భౌతిక శాస్త్రము) డిగ్రీని ప్రథమ శ్రేణిలో ప్రథముడుగా అందు కున్నారు. ఈ సందర్భంగా అనేక పతకాలను అందుకున్న విద్యార్థిగా కలకత్తాలో సర్ సి.వి.రామన్ దగ్గర రీసెర్చ్ స్కాలర్ గా చేరారు. ఆయన తన మేథో సంపత్తితో, శాస్త్రీయ దృక్పథంతో, ఆలోచనా సరళితో, ప్రయోగ శీలతతో సి.వి.రామన్ అభిమానాన్ని చూరగొని ప్రియ శిష్యుడయ్యారు. అక్కడే మద్రాసు విశ్వ విద్యాలయం నుండి ఎం.ఎస్సీ. పట్టాను సంపాదించారు. ఆయన 1932లో ఆంధ్ర విశ్వ విద్యాలయంలో భౌతిక శాస్త్ర విభాగంలో అధ్యాపకుడుగా చేరారు. 1938లో ప్రొఫెసర్ గా పదోన్నతి పొందారు. బోధనా విధానంలో వీరిది చాలా సులభ శైలి. స్పష్టమైన వ్యక్తీకరణ, విశేషమైన ఆలోచన, కచ్చితమైన అనువర్తన, సమగ్రమైన దృష్టి, అద్భుతమైన ప్రతిభలన్నీ కలగలిపి అయన బోధనా విధానాన్ని ఇతర శాఖల అధ్యాపకులు కూడా నేర్చుకునే వారని చెబుతారు. తమ 28 వ యేటనే యింతటి ఉన్నత పదవిని అదిష్టించటం విశేషం. దీనికి కొద్ది కాలం ముందే యూనివర్సిటీ ఆయనకు డి.ఎస్సి డిగ్రీ ప్రదానం చేసింది. ఆయన 1948 వరకు ఈ పదవిలోనే ఉన్నారు. భగవంతం 1941లో కళాశాల ప్రిన్సిపాల్ గా పదవీ బాధ్యతలు స్వీకరించారు. స్వాతంత్ర్యోద్యమ సమయంలో తన పరిపాలనా కౌశలం చూపి కళాశాలను విజయ వంతంగా నడిపారు. 1948–49 మధ్య లండన్ లోని భారత రాయబారి వి.కె. కృష్ణ మీనన్ కార్యాలయంలో వైజ్ఞానిక సలహాదారుగా పని చేశారు. చాలా ఐరోపా దేశాల్లో పర్యటించి వివిధ విజ్ఞాన విషయాల మీద ప్రసంగాలు చేశారు. 1949లో స్వదేశం తిరిగి వచ్చి ఉస్మానియా విశ్వ విద్యాలయంలో భౌతిక శాఖాధిపతిగా పదవీ బాధ్యతలు స్వీకరించారు. పరిశోధన వైపు దృష్టి కేంద్రికరించి 12 మంది డాక్టరేట్ లను తయారు చేశారు. తరువాత 1952లో విశ్వ విద్యాలయ ఉప కులపతిగా పదవిని చేపట్టారు. 1957లో డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (డిఆర్‌డిఓ) సారథిగా బాధ్యతలు స్వీకరించినప్పుడు ప్రొఫెసర్ సూరి భగవంతం బెంగళూరులోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ డైరెక్టర్‌గా ఉన్నారు. అక్కడ పని చేస్తుండగా కృష్ణ మీనన్ ఒత్తిడి మీద 1961లో రక్షణ శాఖ పరిశోధనా సంస్థకు అధిపతిగాను, తనకు వైజ్ఞానిక సలహాదారుగా చేరారు. ఆ సమయంలో ప్రొఫెసర్ భగవంతం రక్షణ అవసరాలను తీర్చడానికి అనువర్తిత పరిశోధన, అభివృద్ధి దిశలో డీఆర్డీఓ ను నైపుణ్యంగా నడిపించారు. సుమారు ఎనిమిది సంవత్సరాలు డిఆర్‌డిఓ హెడ్‌గా పనిచేశారు. అక్టోబర్ 1969 లో తన పదవి నుండి పదవీ విరమణ చేసే సమయానికి, సంస్థ అనేక రంగాల్లో గణనీయమైన పురోగతి సాధించింది. 1962 చైనా–భారత్ యుద్ధం తర్వాత వై. బి. చవాన్ రక్షణ మంత్రిగా ఉన్నప్పుడు ఆయన డిఫెన్స్ రిసెర్చ్ అండ్ డెవలప్ మెంట్ ఆర్గనైజేషన్ (డి.ఆర్.డి.ఒ.) అధిపతిగా చేరి ఎంతో ప్రగతి సాధించారు. భారత దేశమంతా ఇరవైకి పైగా ప్రయోగ శాలలను ప్రారంభించి యుద్ధ రంగానికి అవసరమైన క్షిపణులు, విమానాలు, ట్యాంకులు, రాడార్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు మొదలైన అనేక విషయాలలో విజయం సాధించారు. 1969లో పదవీ విరమణ చేశారు. ఆయన 300 పైగా పరిశోధన వ్యాసాలు ప్రచురించారు. ఇవి కాక గ్రూపు థియరీ, రామన్ ఎఫెక్ట్, క్రిస్టల్ సిమెట్రీ అండ్ ఫిజికల్ ప్రాపర్టీస్ అనే మూడు గ్రంథాలు రచించారు. 1961 జూలైలో కేంద్ర ప్రభుత్వ సర్వీస్ లో ప్రవేశించిన ప్రొఫెసర్ భగవంతం రక్షణ మంత్రికి సైంటిఫిక్ అడ్వయిజర్ గా నియమితు లైనప్పటికీ, డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (డి.ఆర్.డి.ఓ) కు డైరక్టర్ జనరల్ గా కూడా వ్యవహరించారు. భూతలం మీద, సముద్ర జలాల మీద, గాలిలో దేశ పోరాట శక్తులను అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో బలోపేతం చేయటానికి డి.ఆర్.డి.ఓని ఒక సమర్ధవంత మైన పనిముట్టుగా రూపొందిం చారు. శక్తివంతమైన అయుధంగా మలిచారు. ఆర్.డి.ఓను పటిష్ఠ పరచడంలో ఈయన చేసిన కృషి అసమానం. ఆర్గనైజేషన్ బ్రహ్మాండ మైన ఎదుగుదలను సాధించింది. అనేకానేక ల్యాబరేటరిలను, సుశిక్షితులను రూపొందించారు. రక్షణ శాఖ పరిశోధనలలో అనేక మంది శాస్త్రవేత్తలకు ప్రవేశం కల్పించి, వారి మేధస్సుకు పదును పెట్టారు. డి.ఆర్.డి.ఓకు నేతృత్వం వహించిన 9 సంవత్సరాల వ్యవధిలో మిస్సైల్స్, ఎయిర్ క్రాఫ్ట్, ఏరో ఇంజన్స్, కొంబాట్ వెహికల్స్ (ట్యాంకులు మొదలైనవి) ఎలక్ట్రానిక్ వార్ ఫేర్ సిస్టమ్స్, హై ఎక్స్‌ప్లోజివ్స్, అండర్ వాటర్ వెపన్స్ మొదలగు వాటిని అభివృద్ధి చేయటానికి ల్యాబరేటరీలను స్థాపించారు. ఆధునిక యుద్ధ తంత్ర సాంకేతిక నైపుణ్య రంగంలో ఉన్న ఉద్యోగులకు శిక్షణ ఇప్పించారు. వారికి అవసరమైన సౌకర్యాలను కల్పించారు. దేశ రక్షణ శాఖకు అద్వితీయమైన సేవలు అందిస్తూనే మరోపక్క అవాంఛనీయ పోకడలను గమనిస్తూనే ఉన్నారు. ఒకసారి నోబెల్ బహుమతి గ్రహీత, భారత మిత్రుడు ప్రొఫెసర్ పి.ఎం.ఎస్. బ్లాకెట్ ప్రధాని నెహ్రూకు ఒక సలహా యిచ్చారు. దేశ రక్షణ శాఖ అభివృద్ధి చెందడానికి దేశీయ ఉత్పత్తుల రూపకల్పనను మినహాయించి ప్రత్యామ్నాయంగా దిగుమతులు చేసుకోవలసినదని, రాడార్స్, మిస్సైల్స్, యుద్ధ ట్యాంకుల కోసం దిగుమతుల మీద ఆధారపడటం ఉత్తమమని సలహా యిచ్చారు. ఈ సలహాను పూర్తిగా నిర్లక్ష్య పరిచేలా చేసిన ప్రొఫెసర్ భగవంతం మన దేశం సర్వదా కృతజ్ఞతగా ఉండాలి. కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖకు శాస్త్ర సలహాదారునిగా విశేష కృషి చేసి, జాతీయ భావాలకు పరిపుష్టి కల్పించి అఖండ పేరు ప్రఖ్యాతులు సంపాదించారు. భౌతిక శాస్త్ర రంగంలో మూడు ప్రామాణిక గ్రంథాలను, అనేక పరిశోధనా పత్రాలను వెలువ రించారు. రామన్ ఎఫెక్ట్ అంశం మీద వివిధ కోణాలలో అధ్యయనం చేశారు. పునః పరిశోధనలు జరిపారు. "మాలిక్యులర్ లాటిస్ వైబ్రేషన్" అంశం మీద గ్రూప్ థియరిటికల్ అప్లికేషన్స్, వాయువుల గూర్చి రామన్ ఎఫెక్ట్ కు సంబంధించిన పరిశోధనలు మీద సునిశిత కృషి జరిపారు. ఇండియన్ నేషనల్ సైన్స్ అకాడమీ, ఇండియన్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ లలో ఫెలోషిప్ మీద పరిశోధనలు నిర్వహించారు. ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ అసోషియేషన్ వారి భౌతిక శాస్త్ర విభాగానికి అధ్యక్షులుగా (1946) వ్యవహరించారు. "1961 లో క్రిస్టల్ సిమెట్రీ అండ్ ఫిజికల్ ప్రాపర్టీస్" అనే బృహత్తర గ్రంథ రచన చేసి అంతర్జాతీయ ఖ్యాతిని పొందారు. కమిటీ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఫర్ ద డెవలపింగ్ కంట్రీస్ అధ్యక్షులుగా సి.వి.రామన్ పరిశోధించిన రామన్ ఎఫెక్టు అంశం మీద ప్రామాణిక పరిశోధనలు చేసిన అద్వితీయ శాస్త్రవేత్తగా కీర్తి గడించారు. రామన్ ఎఫెక్ట్, క్రిష్టల్ స్ట్రక్చర్ మొదలగు అంశాల మీద అవిశ్రాంత పరిశోధనలు జరిపి గ్రంథ రచనలు చేశారు. ఆయన 300 పైగా పరిశోధనా పత్రాలను వెలువ రించారు. గ్రూప్ థీరీ, రామన్ ఎఫెక్టు అనే రెండు ఉత్తమ గ్రంథాలను కూడా చేశారు. ఇవి ప్రామాణిక గ్రంథాలుగా అంతర్జాతీయ ఖ్యాతిని పొంది, అనేక భాషలలోకి అనువదించటం జరిగింది. జాతీయ అంతర్జాతీయ ప్రతిష్ఠాత్మక సైంటిఫిక్, ప్రొఫెషనల్ సంస్థలు అనేకంలో ఆయన ఎలెక్టెడ్ ఫెలోగా ఉన్నారు. పలు యూనివర్సిటీలు గౌరవ డాక్టరేట్లతో సత్కరించాయి. సి.వి.రామన్ అనుంగు శిష్యునిగా, దేశ రక్షణ శాఖను బలోపేతం చేసిన దేశభక్తునిగా పేరొందిన ప్రొఫెసర్ భగవంతం తన 80 వ యేట 1989, ఫిబ్రవరి 6 వ తేదీన మరణించారు.



**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

## అద్భుత నృత్య కళాకారిణి పద్మశ్రీ శోభానాయుడు - అక్టోబర్ 14... శోభా నాయుడు వర్ధంతి



వెంకట నాయుడు, సరోజినీ దేవి దంపతులకు ప్రముఖ కూచిపూడి నృత్య కళాకారిణి, పద్మశ్రీ అవార్డు గ్రహీత శోభా నాయుడు విశాఖపట్నం జిల్లా అనకాపల్లిలో 1956లో శోభ జన్మించారు. ఊయలలో ఉన్నప్పుడూ నాట్యం చేయడం మొదలు పెట్టిన అద్భుత నృత్యకారిణి శోభానాయుడు. చిన్నతనంలో ఉయ్యాలలో ఉన్నప్పుడే కాళ్లూ, చేతులు లయబద్ధంగా కదిలించే వారట.. అది చూసిన తల్లి సరోజినీ దేవి శోభానాయుడికి నృత్యం నేర్పించాలను కున్నారు. నాలుగో యేటే డ్యాన్స్ క్లాసులో చేర్పించారు శోభానాయుడిని, ఐదో యేట తొలి ప్రదర్శన ఇచ్చారు. ఆ రోజుల్లో కూచిపూడి పేరు ప్రాచుర్యంలో ఉండేది. కూతుర్ని ఎలాగైనా మంచి నృత్యకారిణిని చేయాలని ఆలోచించిన తల్లి సరోజినీ దేవి కూచిపూడిలో శిక్షణ కోసం చెన్నై తీసుకు వెళ్లాలను కున్నారు. ఆడవాళ్లు వంటింట్లో నుండి హాల్ లోకి రావడమే తప్పు అని భావించే కుటుంబంలో పుట్టారామె. అలాంటింది నృత్యం కోసం అనకాపల్లి నుండి చెన్నై వెళ్లడం పెద్ద సాహసమే. అయినా ఆమె ఎదిరించారు. డ్యాన్స్ అంటూ చెన్నై తీసుకు పోతున్నారు. తర్వాత సినిమాల్లో చేరుస్తారా అంటూ ఎన్నో విమర్శలు చేశారు. అయినా తల్లి వెనక్కి తగ్గలేదు. తన కూతురికి ఉన్న టాలెంట్ ను సపోర్ట్ చేయాలను కుంది. పదకొండేళ్లు చెన్నైలో కూతుర్ని పెట్టుకుని డ్యాన్స్ నేర్పిస్తూ అష్టకష్టాలూ పడ్డారు. శోభానాయుడు వెంపటి చిన సత్యం శిష్యురాలు. వెంపటి నృత్య రూపాలలో ఈమె అన్ని ప్రధాన పాత్రలనూ పోషించింది. చిన్నతనం లోనే ఆమె నృత్య నాటకాల్లో పాత్రలు పోషించడం మొదలు పెట్టింది. సత్యభామ, పద్మావతి, చండాలిక పాత్రల్లో ఆమె రాణించింది. స్వచ్ఛమైన నృత్యరీతి, అంకితభావం ఉన్న నాట్య గురువు. నాట్యం వృత్తిగా తీసుకున్న ప్రతిభాశాలి శోభా నాయుడు. ఆంధ్రప్రదేశ్?కు చెందిన శోభానాయుడు తన బహుముఖ ప్రతిభకు నిదర్శనంగా 1982లో నృత్య చూడామణి, 1998లో ఎన్టీయార్ పురస్కారం, 1990లో సంగీత నాటక అకాడమీ అవార్డు, 2001లో పద్మ శ్రీ పురస్కారం, 2011లో తంగిరాల కృష్ణ ప్రసాద్ స్మారక అవార్డులు అందుకున్నారు. హైదరాబాదు లోని కూచిపూడి ఆర్ట్ అకాడమీ ప్రిన్సిపాల్‌గా పనిచేస్తూ ద్వారా పిల్లలకు శిక్షణ నిచ్చింది. శోభానాయుడు శిష్యులు పలువురు రాష్ట్ర, జాతీయ పురస్కారాలను అందుకున్నారు. శోభానాయుడు గత సంవత్సరం 64 సంవత్సరాల వయసులో మృతి చెందారు. దాదాపు నెల రోజుల క్రితం తన ఇంట్లో కాలు జారిపడిన ఆమె తలకు గాయం కాగా, అప్పటి నుంచి హైదరాబాద్ లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ, అక్టోబర్ 13 అర్ధ రాత్రి దాటాక 1:40కి తుదిశ్వాస విడిచారు. కొంతకాలంగా న్యూరోలాజికల్ సమస్యతో చికిత్స పొందారు కూడా. హైదరాబాద్‌లో కూచిపూడి ఆర్ట్స్ అకాడమీని స్థాపించి వేల మందికి కూచిపూడి నాట్యంలో శిక్షణ ఇచ్చి, ఎందరో నాట్య కళాకారులను తయారు చేశారని గుర్తు చేశారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

## డిజిటల్‌మయం.. అవగాహనే ముఖ్యం

నిర్మల్ :కోటపల్లి మండలానికి చెందిన ఓ వ్యక్తి రూ. 500తో డీటీహెచ్ రీఛార్జ్ చేసుకున్నారు. ఎంతసేపు ఎదురుచూసినా పేమెంట్ పెండింగ్ అని వస్తోంది. తీరా ఖాతాలో చూస్తే సొమ్ము చెల్లించినట్లు చూపిస్తోంది. రీఛార్జి మాత్రం పూర్తవలేదు.
చెన్నూరు పట్టణంలోని ఓ వస్త్ర దుకాణంలో ఇటీవల ఇద్దరు వ్యక్తులు వచ్చి రూ.5 వేల దుస్తులు కొనుగోలు చేశారు. చరవాణి ద్వారా చెల్లింపులు చేసి వెళ్లిపోయారు. తీరా దుకాణదారు ఖాతాలో చూసుకుంటే డబ్బు జమకాలేదు. సీసీ కెమెరా ఆధారంగా పోలీసులు ఆరా తీసి, సదరు వ్యక్తులను గుర్తించి వారికి విషయాన్ని చెప్పి తిరిగి డబ్బులు తీసుకోవాల్సి వచ్చింది.
న్యూస్‌టుడే, చెన్నూరు: ప్రస్తుతం మారుమూల పల్లెల్లోనూ డిజిటల్ చెల్లింపులు పెరిగాయి. స్మార్ట్ ఫోన్లు, అంతర్జాల సేవలు చౌకగా అందుబాటులోకి రావడంతో ప్రజలు త్వరగా ఆన్‌లైన్ లావాదేవీలకు అలవాటు పడ్డారు. బ్యాంకులు ప్రత్యేక యాప్‌లు అందుబాటులోకి తీసుకొచ్చాయి. కాకపోతే కొన్ని సాంకేతిక సమస్యలతో చెల్లింపుల్లో చోటుచేసుకుంటున్న పరిణామాలు వినియోగదారులను వ్యాపారులను అయోమయానికి గురిచేస్తున్నాయి.

**అప్రమత్తత అవసరం**



లావాదేవీలు విఫలమైన సమయంలో వచ్చే సందేశాలను పూర్తిగా చదివితే సమస్య అర్థమవుతోంది. పల్లెల్లో చాలా మందికి ఆంగ్ల భాషలో వచ్చే సందేశాలు చదవడం, అర్థం చేసుకోవడం రాదు. సాంకేతిక సమస్యలపై ఫిర్యాదు చేయడానికి ప్రతీ యూపీఐ యాప్‌లో దిగువన సపోర్ట్ అండ్ హెల్ప్ అనే ఆప్షన్ ఉంటుంది. దాన్ని ఎంపిక చేసుకోగానే ఫిర్యాదు స్వీకరిస్తుంది. లావాదేవీల వివరాలు, తలెత్తిన సమస్యను నమోదు చేస్తే మూడు రోజుల్లో నగదు ఖాతాలో జమవుతుంది. యాప్‌లో కస్టమర్ కేర్ నంబర్ల కోసం ఆన్‌లైన్‌లో వెతికితే సైబర్ నేరగాళ్ల వలలో పడే ప్రమాదం ఉంది.

**నగదు పోతే ఫిర్యాదు చేయాలి**

సాధారణంగా యాప్‌ల ద్వారా లావాదేవీలు విఫలమైనప్పుడు ఖాతా నుంచి వెళ్లిపోయిన సొమ్ము తిరిగి రావడానికి 27 నుంచి 72 గంటల సమయం పడుతుంది. అలా జరగని పక్షంలో నేరుగా సంబంధిత బ్యాంకుకు వెళ్లి లిఖితపూర్వక ఫిర్యాదు చేయాలి. వారంలో పరిష్కారం కాకుంటే ఆయా బ్యాంకుల అంబుడ్స్‌మెన్లకు ఫిర్యాదు చేస్తే పరిష్కరిస్తారు.
**కారణాలివి** ఆన్‌లైన్ చెల్లింపులకు అంతరాయం లేని అంతర్జాల సేవలు ఉన్నప్పుడే యాప్‌లు సమర్థంగా పనిచేస్తాయి. మధ్యలో అంతర్జాలం వేగం తగ్గినా, పూర్తిగా ఆగిపోయినా విఫలమవుతుంటాయి. పేమెంట్ యాప్ ఏదైనా కేవలం బ్యాంకులు, ఖాతాదారుల మధ్య వారధిగా పనిచేస్తుంది. చెల్లింపులు జరిగే సమయంలో రెండు బ్యాంకుల సర్వర్లు సరిగా పనిచేస్తేనే పేమెంట్ సాఫీగా పూర్తవుతుంది. సర్వర్, నెట్‌వర్క్‌లో అంతరాయం ఏర్పడితే చెల్లింపులు నిలిచిపోతాయి.

## ఆగేవి తక్కువ.. ప్రయాణికులు ఎక్కువ



గోదావరిఖని : పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన రామగుండం ప్రాంత రైల్వే ప్రయాణికులకు సరిపడా రైళ్లు అందుబాటులో లేవు. ఢిల్లీ ప్రధాన రైలు మార్గంలో కీలకమైన రామగుండం రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుల డిమాండ్‌కు అనుగుణంగా రైళ్ల నిలుపుదల లేకపోవడంతో అసౌకర్యానికి గురవుతున్నారు. సింగరేణి, ఎన్టీపీసీ, ఆర్ఎఫ్‌సీఎల్, సిమెంట్ ఫ్యాక్టరీల్లో పనిచేసే ఉద్యోగులు చాలా మంది వివిధ రాష్ట్రాలకు చెందిన వారున్నారు. దీంతో పాటు వ్యాపారులు కూడా ఇతర రాష్ట్రాలకు చెందిన వారున్నారు. వారికి అనుగుణంగా సూపర్‌ఫాస్టు రైళ్లను నిలపాలని చాలా కాలంగా డిమాండ్ ఉన్నా రైల్వే అధికారులు స్పందించడం లేదు. రామగుండం రైల్వే స్టేషన్ నుంచి రోజుకు 94 రైళ్లు ప్రయాణిస్తుంటాయి. కేవలం 35 రైళ్లు మాత్రమే ఆగుతున్నాయి. ఇందులో కొన్ని వీక్లీకి ఉన్నాయి. రోజు వారీగా నడిచే సూపర్‌ఫాస్టు, ఎక్స్‌ప్రెస్‌లు కొన్నింటికి మాత్రమే హాల్టింగ్ ఉంది.

**ఆదాయం అధికమే**

రామగుండం రైల్వే స్టేషన్ నుంచి రోజు 1500 మంది ప్రయాణికులు వివిధ ప్రాంతాలకు ప్రయాణిస్తున్నారు. రోజు రూ.3 లక్షల వరకు ప్రయాణికుల ద్వారా ఆదాయం వస్తుంది. మరిన్ని రైళ్లను ఆపితే ఆదాయం పెరిగే అవకాశం ఉంది. కొవిడ్ సమయంలో రద్దు చేసిన కొన్ని రైళ్లను ఇటీవల పునరుద్ధరించారు. కాజీపేట–బల్లార్ష మార్గంలో అతిపెద్ద రైల్వేస్టేషన్లలో రామగుండం ఒకటి.

**అందుబాటులోకి రాని సూపర్‌ఫాస్టులు**

రామగుండం రైల్వేస్టేషన్‌లో సూపర్‌ఫాస్టు రైళ్లను నిలపడం ద్వారా ప్రయాణికులకు మరింత సౌకర్యం ఉంటుంది. ప్రస్తుతం నడుస్తున్న బల్లార్ష నుంచి కాజీపేట వరకు ఉన్న రైలును సికింద్రాబాద్ వరకు పొడిగించాలని కోరుతున్నారు. తిరుపతికి వెళ్లే ప్రయాణికులకు ఇక్కడి నుంచి చాలా తక్కువ సౌకర్యం ఉంది. కాగజ్‌నగర్ నుంచి తిరుపతికి ప్రత్యేక రైలు నడపాలని ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు.

డిమాండ్ ఉన్న రైళ్లు
స్వర్ణజయంతి ఎక్స్‌ప్రెస్
గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్ మిలినీయం సూపర్‌ఫాస్టు ఎక్స్‌ప్రెస్
గయా వీక్లీ సూపర్‌ఫాస్టు ఎక్స్‌ప్రెస్
జైపూర్ సూపర్‌ఫాస్టు ఎక్స్‌ప్రెస్
నవజీవన్ సూపర్‌ఫాస్టు ఎక్స్‌ప్రెస్

## పెద్దాసుపత్రుల్లో సేవల సుస్తీ

కోరుట్ల : కోరుట్ల ఆసుపత్రిలో జనరల్ మెడిసిన్, జనరల్ సర్జన్, ఆర్థోపెడిక్, గైనకాలజిస్టు వంటి కీలక పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వైద్యులు, నర్సులు, ఇతర సిబ్బంది కలిసి 40 పోస్టులు భర్తీ చేయాల్సి ఉంది. మెట్‌పల్లి ఆసుపత్రిలో సివిల్ సర్జన్లు మూడు, డిప్యూటీ సివిల్ సర్జన్లు నాలుగు, సివిల్ అసిస్టెంట్ సర్జన్లు ఎనిమిది పోస్టులు ఖాళీగా ఉన్నాయి. నిత్యం 300 వరకు ఓపీ నమోదవుతుండగా 9 మంది వైద్యులు పరీక్షించి మందులు అందజేస్తున్నారు. ఎముకల వైద్య నిపుణుడు లేకపోవడంతో రోడ్డు ప్రమాద క్షతగాత్రులను జగిత్యాల ఆసుపత్రికి పంపిస్తున్నారు.

**పరికరాలు నిరుపయోగం**

కోరుట్లలో రూ.16.80 కోట్లతో 100 పడకల ఆసుపత్రి భవనాన్ని నిర్మించి 2023లో ప్రారంభించారు. ఆసుపత్రి నూతన భవనంలో ఒకటి, రెండో అంతస్థులో ఐసీయూ, ఆపరేషన్ థియేటర్, పిల్లల వార్డు, ఇతర వార్డులు వృథాగా ఉన్నాయి. సీఏఆర్ఎం, ఎక్స్‌రే యంత్రా



లు, ఆక్సిజన్ ప్లాంట్లు మంజూరైనా టెక్నీషియన్లు లేక నిరుపయోగంగా మారాయి. మెట్‌పల్లి సామాజిక ఆసుపత్రిలో చేపట్టిన భవన నిర్మాణం అసంపూర్తిగా ఉంది. ప్రస్తుత భవనం సరిపోక అటు వైద్యులు, ఇటు రోగులు ఇబ్బందులు పడుతున్నారు.
పలు చోట్ల పెచ్చులూడటమే కాకుండా వర్షానికి ఉరుస్తోంది. వైద్యులకు సరిపడా గదులు లేవు. రక్తనిల్వ కేంద్రానికి గది లేక పరికరాలు మూలన పడ్డాయి. ఎక్స్‌రే గది గోడలు తడిగా మారుతున్నాయి.

**వరండాలోనే రోగుల బారులు**

మెట్‌పల్లిలో వరండాలోనే ఓపీకి, రక్త పరీక్షలకు, మందు గోళీలకు రోగులు బారులు తీరుతున్నారు. నిత్యం 300 వరకు ఓపీ నమోదవుతుండగా జ్వరం కేసులు ఎక్కువగా రావడంతో ముప్పై పడకలకు బదులు 80 పడకలు వేసి సేవలందిస్తున్నారు. జగిత్యాల జిల్లా ఆసుపత్రి, మాతా శిశు సంరక్షణ కేంద్రంలో పారిశుద్ధ్యం లోపించింది. సాధారణ ఆసుపత్రిలో రోజూ 400కు పైగా ఓపీ ఉంటోంది. 60 మంది వైద్యులున్నా సిబ్బంది కొరత ఉంది. జిల్లాకేంద్రంలోని మాతా శిశు సంరక్షణ కేంద్రంలో 300కు పైగా ఓపీ ఉండగా 50 మంది వైద్యులు సేవలందిస్తున్నారు. ఆసుపత్రి ఆవరణలో రోడ్డు గుంతలమయగా మారడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు.

## చదువుపై అతివల ఆసక్తి



కరీంనగర్ : 'ఇల్లాలి చదువు.. ఇంటికి వెలుగు' అన్నట్లుగా నిరక్షరాస్యులు చదువుకోవడానికి ఆసక్తి చూపిస్తున్నారు. పట్టణాల్లోని మహిళా సంఘాల సభ్యులందరికీ రాయడం, చదవడం రావాలనే లక్ష్యంతో 'ఉల్లాస్' కింద పేర్లు నమోదు చేశారు. వీరందరికీ ఆయా ప్రాంతాల్లోనే రాత్రి బడి ఏర్పాటు చేసి అక్షరాస్యత పెంచేలా కార్యాచరణ చేపడుతున్నట్లు తెలిసింది. కరీంనగర్ నగర పాలక సంస్థతోపాటు మూడు పురపాలికల్లో మొత్తం 17,778 మంది మహిళలు ఉల్లాస్ పథకం ద్వారా చదువు నేర్చుకోవడానికి సిద్ధంగా ఉన్నారు.

**మెప్మా ఆధ్వర్యంలో పేర్ల నమోదు..**

జిల్లాలోని మెప్మా ఆధ్వర్యంలో పట్టణాలు, నగరాల్లో మహిళా సంఘాల సభ్యులలో చదువు రాని వారిని గుర్తించారు. ఏయే స్థాయిలో చదువుకున్నారో వివరాలు సేకరించారు. వీరి వివరాలను ఉల్లాస్ యాప్‌లో నమోదు చేశారు. దాని ఆధారంగా చదువు చెప్పించడం కోసం ప్రభుత్వం చర్యలు తీసుకునే వీలుంది. జిల్లాలోని గ్రామాలు, పట్టణాల్లో 32,777 మంది మహిళల లక్ష్యం నిర్దేశించగా, 79,182 మంది మహిళలు పేర్లు నమోదు చేసుకున్నారు.

**ఉన్నత చదువులకు టాస్**

స్వశక్తి సంఘాల్లోని మహిళలు చదువును మధ్యలో వదిలేసిన వారు ఉన్నత విద్య చదవడానికి టాస్ పథకం ద్వారా దూరవిద్యలో ప్రవేశాలు తీసుకునేలా ప్రోత్సహిస్తున్నారు. పదోతరగతిలోపు చదివిన వారు పైచదువులు కొనసాగించడం, పదోతరగతి పాసైన వారు ఇంటర్, ఇంటర్ పూర్తి చేసిన వారు డిగ్రీ చేసేలా చర్యలు చేపట్టారు.
జిల్లావ్యాప్తంగా 2,348 మందిని ఈ ఏడాది ఉన్నత చదువులు చదివించాలని నిర్ణయించగా 5,283 మంది మహిళలు ముందుకొచ్చారు.
ఇందులో పదోతరగతిలో 1,935, ఇంటర్ కోసం 3,348 మంది మహిళలు ఉన్నత విద్య కోసం ప్రవేశాలు తీసుకుంటున్నారు.
ఓ వైపు సంఘాల్లోనే ఉంటూ చదువులో రాణించాలనే లక్ష్యంతో ముందుకెళ్తున్నారు. దీనికి ఆర్పీలు, సీవోలు, సంఘాల సభ్యులు సహకరిస్తున్నారు.
రాష్ట్రంలోనే ఉల్లాస్ నమోదులో మొదటి స్థానంలో, టాస్ నమోదులో రెండో స్థానంలో ఉన్నామని మెప్మా పీడీ స్వరూపారాణి చెప్పారు. పట్టణాల్లో అర్హత ఉన్న వారందరిని నమోదు చేశామని, ఉన్నత చదువులకు ఫీజు కట్టించి ప్రవేశాలు చేయించామని వివరించారు.

## ఏ భవనం చూసినా.. ఏముంది గర్వకారణం

భువనగిరి : యాదగిరిగుట్ట మండలంలోని మల్లిగూడెం గ్రామ పంచాయతీ శిథిల భవనంలో కొనసాగడం ప్రమాదాన్ని సూచిస్తోంది. గుండ్లపల్లి ప్రాథమిక ప్రభుత్వ పాఠశాల శిథిలావస్థకు చేరగా ఇటీవల మరమ్మతులు చేయించినా భయాన్నే కలిగిస్తోంది. యాదగిరిగుట్ట ప్రాథమిక పాఠశాల భవనం పక్కన ఉన్న అదనపు గది పూర్తిగా శిథిలమై ఎప్పుడు కూలుతుందో తెలియడం లేదు.
జిల్లాలోని పంచాయతీ కార్యాలయాలు శిథిల భవనాల్లోనే కొనసాగుతున్నాయి. వానలకు పైకప్పుల పెచ్చులు ఊడి ప్రమాదకరంగా మారాయి. కొద్దిపాటి వర్షం వచ్చినా గోడలు, స్లాబ్ తడిసి ముద్దవుతుండటంతో దస్త్రాలు, ఇతర సామగ్రిని భద్రపరిచేందుకు సిబ్బంది నానా తంటాలు పడుతున్నారు. గ్రామ సభలు, ఇతర సమావేశాలు చెట్ల కిందే నిర్వహిస్తున్నారు.
2018లో కొత్తగా ఏర్పడిన వాటికి సొంత భవనాలు లేక ప్రభుత్వ పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలు, సామాజిక భవనాల్లో కొనసాగుతున్నాయి. పాత భవనాల్లో మరుగుదొడ్ల సదుపాయం లేకపోవడంతో ఒకటికి, రెంటికి కార్యదర్శులు, సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తమ పరిస్థితి మరింత దారుణంగా ఉంటోందని మహిళా కార్యదర్శులు వాపోతున్నారు. పంచాయతీ భవన నిర్మాణాలకు ఎన్ఆర్ఈజీఎస్‌లో నిధులు మంజూరైనా.. పలుచోట్ల నిర్మించేందుకు ఎవరూ ముందుకు రాకపోవడంతో పనులు ప్రారంభం కాలేదు. మరికొన్ని చోట్ల శంకుస్థాపనల వరకే పరిమితమయ్యాయి.
జిల్లాలో పూర్వం 421 జీపీలు ఉండేవి. సాయినగర్ రంగారెడ్డి జిల్లాలో విలీనమైంది. 420 పంచాయతీలుండగా 30 శిథిలావస్థకు చేరుకున్నాయి. కొత్తగా ఏర్పడిన ఏడు పంచాయతీలకు సొంత భవనాలు లేవు. అవికూడా ఇతర చోట్ల కొనసాగుతున్నాయి. మిగిలినవన్నీ సొంత భవనాల్లోనే నిర్వహిస్తున్నారు. వాటిలో కూడా కొన్ని శిథిలావస్థకు చేరుకున్నాయి. ప్రస్తుతం 37 జీపీల భవన నిర్మాణాలు కొనసాగు




తున్నట్లు డీఆర్‌డీవో టి.నాగిరెడ్డితో చెప్పారు.
ఆత్మకూరు మండలంలో కొరటికల్, రేపాక, పుల్లాయిగూడెం, పోతిరెడ్డి పల్లి, రాయిపల్లి, సర్వేపల్లి గ్రామ పంచాయతీ భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. ఎన్ఆర్ఈజీఎస్ కింద కొత్త భవనాలు నిర్మించేందుకు అనుమతులు వచ్చినా నిర్మాణాలు చేపట్టేందుకు ఎవరూ ముందుకు రావడంలేదు. సారగండ్లగూడెలో ప్రాథమిక పాఠశాల భవనంలో కొనసాగుతోంది.


జిల్లాలో గ్రామపంచాయతీలు : 427
పక్కా భవనాల్లో కొనసాగుతున్నవి: 390
శిథిల భవనాలు : 30
అద్దె, ఇతర భవనాల్లో ఉన్నవి : 37
నిర్మాణాల్లో ఉన్నవి : 37

## భూ రక్షణ.. సంపద సృష్టి..

నిర్మల్ : ప్రస్తుత రోజుల్లో భూముల ధరలు రోజు రోజుకు పెరిగిపోతున్నాయి. కొందరు ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తున్నారు. అలాంటి సర్కారు భూముల రక్షణకు జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ అధికారులు ప్రత్యేక కార్యాచరణ రూపొందించారు. నీటిపారుదలకు సంబంధించిన వాటిని సంరక్షించాలని నిర్ణయించి శాఖ అధికారులను సంప్రదించారు. ఇందుకోసం కడెం, సోన్ మండలాల్లో ఉన్న వాటిని శాఖకు కేటాయించారు. రెండేళ్ల క్రితం ఆ చోట్లలో మొక్కలు నాటగా ప్రస్తుతం ఏపుగా పెరిగి పచ్చదనంతో అలరారుతోంది.

**ఆదాయ వనరుగా..**

కడెం మండల కేంద్రంలో అయిదు ఎకరాలు, సోన్ మండలం సాకెరలో



రెండు ఎకరాల భూమిని నీటిపారుదల శాఖ అధికారులు డీఆర్డీవోకు కేటాయించారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో రెండేళ్ల క్రితం ఉసిరి, జామ, సీతాఫలం, మునగ, వెదురు, మామిడి, నిమ్మ, టేకు, అరటి తదితర మొక్కలు నాటారు. రెండు చోట్ల కలిపి మొత్తం 5వేల మొక్కలు ఏర్పాటు చేశారు. ఇందుకు ఇప్పటి వరకు రూ. 25 లక్షల వరకు వ్యయం చేశారు. వీటి నిర్వహణ బాధ్యతలను గ్రామ పంచాయతీ కార్యదర్శులతోపాటు, ఒక వాచ్‌మెన్, ఇతరత్రా పనులను ఉపాధి కూలీలతో చేయిస్తున్నారు. రెండేళ్లలోనే ప్రస్తుతం జామకాయలు చెట్లకు విరివిగా కాశాయి. పంచాయతీరాజ్, నీటిపారుదల శాఖల ఇంజినీరింగ్ అధికారుల సౌజన్యంతో కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్నారు. నాటిన మొక్కలను కంటికి రెప్పలా కాపాడటంతో 99 శాతం బతికాయి. వాటిని విక్రయించగా వచ్చే ఆదాయాన్ని పంచాయతీలకు సమకూర్చేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. ఈ విషయమై డీఆర్డీవో విజయలక్ష్మిని 'న్యూస్‌టుడే' సంప్రదించగా.. విలువైన భూముల రక్షణతోపాటు పంచాయతీలకు ఆర్థిక తోడ్పాటునందించాలన్న ప్రధాన ఉద్దేశంతో 'సంపద వనాలు' పేరిట వీటిని ఏర్పాటు చేశామని చెప్పారు.

## నమ్మినోళ్లే.. ముంచేటోళ్లు..!



కొత్తగూడెం : ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో చోటుచేసుకుంటున్న దొంగతనాలు, దోపిడీలు, మోసాలతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. వీటిని అరికట్టడానికి క్షేత్రస్థాయిలో పోలీసు యంత్రాంగం తగిన చర్యలు తీసుకుంటున్నప్పటికీ.. కేటుగాళ్లు పగలూరాత్రీ అనే తేడా లేకుండా దొంగతనాలు, దోపిడీలతో రెచ్చిపోతున్నారు.

**పగలు రెక్కీ.. రాత్రి దోపిడీ**

ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో చోటుచేసుకుంటున్న దొంగతనాలు, దోపిడీలతో ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా పోతోంది. పగలు రెక్కీ నిర్వహించి రాత్రుల్లో దోపిడీలకు పాల్పడుతున్నారు. ఉభయ జిల్లాల్లో 2023లో 338 దోపిడీలు జరగ్గా అందులో 288 రాత్రిపూట చోటుచేసుకోవటం గమనార్హం. దోపిడీలతో పాటు దొంగతనాలు సైతం ఉభయ జిల్లాల ప్రజలను బెంబేలెత్తిస్తున్నాయి.
నమ్మితే కొందరు నిండా ముంచుతున్నారు. అధికారుల సంతకాల ఫోర్జరీలు, నకిలీ బంగారం తాకట్టుపెట్టి రుణాలు పొందటం, ఒకే భూమిని అనేక మందికి విక్రయించటం, బ్యాంకు, ఏటీఎం, క్రెడిట్‌కార్డు, చీటింగ్ కేసులు తదితరాల రూపంలో కేటుగాళ్లు నమ్మిన వారిని తప్పుదోవ పట్టించి జేబులు నింపుకొన్నారు. ఉభయ జిల్లాల్లో చిట్టీపాటల పేరిట అమాయక ప్రజల నుంచి రూ.కోట్లు వసూలుచేసి ఐపీలు పెట్టిన సందర్భాలున్నాయి.
**ఫోర్జరీలు, మోసాలే అధికం..** 2023లో ఖమ్మం జిల్లాలో ఫోర్జరీలు, మోసాలకు సంబంధించిన నేరాలు 483, భద్రాద్రి జిల్లాలో 276 నమోదయ్యాయి. వీటిలో చీటింగ్ కేసులు ఖమ్మం.. 194, భద్రాద్రి.. 113 ఉన్నాయి. జాతీయ నేర గణాంక సంస్థ (ఎన్‌సీఆర్‌బీ) తాజాగా వెల్లడించిన గణాంకాల ప్రకారం 2023లో ఉభయ జిల్లాల్లో 591 దొంగతనాలు, 338 దోపిడీలు, 759 మోసాలు నమోదు కావటం కలవరపరుస్తోంది .2023లో మొత్తమ్మీద 591 దొంగతనాలు జరగ్గా.. ఖమ్మం జిల్లాలో 335, భద్రాద్రిలో 256 నమోదయ్యాయి. వివిధ రకాల వాహనాలు 227 చోరీకి గురయ్యాయి. ఖమ్మం జిల్లాలో 133, భద్రాద్రి జిల్లాలో 94 ఉన్నాయి.

## రోయింగ్‌లో మెరిశారు

హుస్నాబాద్ : ఉమ్మడి మెదక్ జిల్లాకు చెందిన ఇద్దరు విద్యార్థులు రోయింగ్‌లో రాణిస్తున్నారు. చదువుతో పాటు తమకు ఇష్టమైన క్రీడలో పతకాల పంట పండిస్తున్నారు. రాష్ట్ర, జాతీయ స్థాయిలో పాల్గొని సత్తా చాటుతున్నారు. ఈ క్రమంలోనే ఈ నెల 13 నుంచి కేరళలో జరిగే జాతీయ స్థాయి పోటీలకు మరోసారి ఎంపికయ్యారు.
హుస్నాబాద్ పట్టణ పరిధిలోని ఆరెపల్లికి చెందిన కాశబోయిన మురళి, లలిత దంపతుల కుమారుడు అభిజిత్ యాదవ్ హైదరాబాద్ హకీంపేటలోని క్రీడా పాఠశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నారు. చిన్నప్పటి నుంచి ఆటలపై మక్కువ చూపడంతో తల్లిదండ్రులు గుర్తించి ప్రోత్సహించారు. ఈ క్రమంలోనే క్రీడా పాఠశాలలో ప్రవేశాలకు నిర్వహించిన ఎంపిక పోటీలకు తీసుకువెళ్లగా చక్కని ప్రతిభ చూపి ఎంపికయ్యారు. అక్కడ 4వ తరగతిలో చేరాక రోయింగ్‌పై ఉన్న ఆసక్తిని గుర్తించిన శిక్షకులు సూతం ప్రోత్సహించారు. నైపుణ్యాలు, మెలకువలు నేర్పించారు.

ప్రతిభ చూపి పతకాలు సాధించారు

అభిజిత్ గతంలో హైదరాబాద్, పుణె, పంజాబ్, కేరళ, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని అనేక పతకాలు సాధించారు. సిద్దిపేట పట్టణానికి చెందిన విద్యార్థి జశ్వంత్, నాగర్‌కర్నూల్ జిల్లాకు చెందిన వివేక్, మహబూబ్‌నగర్‌కు చెందిన రాంచరణ్‌తో కలిసి డబుల్స్, క్వాడ్రపుల్ విభాగాల్లో బంగారు, వెండి పతకాలు అందుకున్నారు. తాజాగా ఈ నెల 13 నుంచి 16 వరకు కేరళలోని అలెప్పీలో జరిగే ఇంటర్ కాయ్ నేషనల్ రోయింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలకు ఎంపికయ్యారు. ఇందులో వివేక్‌తో కలిసి డబుల్స్, వివేక్, రాంచరణ్, నాగరాజుతో కలిసి క్వాడ్రపుల్ విభాగాల్లో తెలంగాణ రాష్ట్రం తరపున పాల్గొననున్నారు.
కొల్చారం వాసి రాంచరణ్ మెదక్ జిల్లా కొల్చారం మండలం కొంగోడు గ్రామానికి చెందిన గూడూరి రాంచరణ్ హకీంపేటలోని స్పోర్ట్సు స్కూల్‌లో 10వ తరగతి చదువుతూ రోయింగ్‌లో రాణిస్తున్నారు. గత మే నెలలో హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచారు. ఉత్తరప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్‌లో జరిగిన పోటీల్లో క్వాడ్రపుల్ విభాగంలో రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహించారు. తాజాగా కేరళలో జరిగే పోటీలకు ఎంపికయ్యా రు. అభిజిత్, నాగరాజు, వివేక్‌తో కల్సి క్వాడ్రపుల్ విభాగంలో పాల్గొననున్నారు.

# డ్రోన్లు.. రోబోలే జీవితం

హైదరాబాద్: 'డ్రోన్లు.. రోబోలంటే చిన్నప్పటి నుంచి ప్రాణం.. చదువుకునే రోజుల్లో సినిమాల్లో చూసి ప్రేరణ పొందా.. ఇంటర్మీడియేట్‌లో వాటిని తయారు చేయడం నేర్చుకున్నా. బిట్స్ హైదరాబాద్‌లో మెకానికల్ ఇంజినీరింగ్ ప్రథమ సంవత్సరంలో చేరిన వెంటనే డ్రోన్లపై మరింత ఆసక్తి పెంచుకున్నా. అంతర్జాలంలో తయారీ పరిజ్ఞానాన్ని తెలుసుకున్నాం. స్నేహితుడు శౌర్యతో కలిసి పరిశోధనలు చేశా. ఆరునెలల క్రితం ఒకటి తయారు చేశాం. భారత సైన్యానికి 8 డ్రోన్లు సమకూర్చాం. భవిష్యత్తులో మరింత నాణ్యమైనవి రూపొందించనున్నాం' అని 19 ఏళ్ల ఇంజినీరింగ్ విద్యార్థి జయంత్ ఖత్రి అన్నారు. రాజస్థాన్ అజ్మేర్‌కు చెందిన న్యాయవాదులు కిషన్‌గోపాల్ ఖత్రి, సంధ్య దంపతుల కుమారుడు జయంత్. అంతరిక్ష పరిశోధన సంస్థలకు రూ.3 కోట్ల విలువైన డ్రోన్లను సరఫరా చేసే ఒప్పందం కుదుర్చుకున్న సందర్భంగాతో మాట్లాడారు.

స్నేహితుడు శౌర్య సహకారం.. ఆపరేషన్ సిందూర్ సమయంలో భారత సైన్యం పాకిస్థాన్ డ్రోన్లను ధ్వంసం చేసిన సమయంలో మాకు మరో ఆలోచన ఇచ్చింది. రాత్రింబవళ్లు శ్రమించి గంటకు 300 కి.మీ. వేగంతో ప్రయాణం చేసే డ్రోన్‌ను రూపొందించాం. ఇది 4 కిలోల బరువున్న పేలోడ్‌ను తీసుకెళ్లగలదు. సైన్యాధికారులు మా



డ్రోన్లను జమ్మూ, చాందిమందిర్, పనాగఢ్, అరుణాచల్ ప్రదేశ్ యూనిట్లకు పంపించారు. జమ్మూ కశ్మీర్ కమాండెంట్ మమ్మల్ని అభినందిస్తూ లేఖ రాశారు.

**సెన్సర్ ద్వారా కదలికలకు శ్రీకారం**

రోబోలను అందరూ తయారు చేస్తున్నారు. రోబోటిక్స్ పరిజ్ఞానం చాలా పెరిగింది. వాటిల్లోని చిప్‌లలో పరిజ్ఞానాన్ని పెంచడం ద్వారా మరింత సమర్థంగా ఉపయోగించుకోవచ్చు. ప్రోగ్రాం డిజైన్ చేస్తే పనిచేసేలా కాకుండా సెన్సర్‌తో పనిచేయించాలనే ఆలోచన వచ్చింది. అలా పరిశోధన ప్రారంభించా. ఈఎంజీ పరిజ్ఞానంతో రోబో చేతికి కదలికలను నేర్పించా. నా కుడి చేయి ఎలా కదులుతుందో రోబో చేయి కూడా కదులుతుంది. నృత్య ముద్రలు చేస్తే.. అది కూడా చేతిని, వేళ్లను తిప్పుతోంది. ఈ డిజైన్‌కు పేటెంట్ కోసం దరఖాస్తు చేసుకున్నా.

# చల్లారిపోయాక చల్లేసిపో'తారు'

హైదరాబాద్ రాయదుర్గం విప్రో సర్కిల్‌లో గుంత పూడ్చాలంటే 24 కి.మీ దూరంలో ఉన్న మియాపూర్ దీప్తిశ్రీనగర్‌లో తయారైన తారు మిశ్రమాన్ని తరలిస్తారు. కుషాయిగూడలో రహదారి మరమ్మతులకు 25 కి.మీ దూరంలో ఉన్న చుడీబజార్‌లో తయారైన తారును తీసుకెళ్లాలి. ఈ దుస్థితి వల్లే రహదారి మరమ్మతులు మూణ్నాళ్ల ముచ్చటగా మారుతున్నాయి. 10 వేల కిలోమీటర్ల రోడ్లున్న రాజధానిలో కేవలం 2 తారు తయారీ కేంద్రాలు మాత్రమే ఉన్నాయి. అక్కడి నుంచి తారును గమ్యానికి తరలించేలోపు మిశ్రమం చల్లారిపోతోంది. దాన్ని అలాగే ముద్దలుగా గుంతల్లో వేసి వెళ్లిపోవడంతో రోడ్లు మళ్లీ దెబ్బతింటున్నాయి.

**మూడు వారాలు మూసేశారు**

భారీ నిర్మాణ ప్రాజెక్టుల వద్ద రెండు, మూడు రెడీమిక్స్ తయారీ కేంద్రాలుంటాయి. మరి కోటి జనాభాకు సేవలందించే జీహెచ్‌ఎంసీ మాత్రం 2 బీటీ మిశ్రమం కేంద్రాలనే నిర్వహిస్తోంది. వానల్లో తారు వేయడమేంటని ఇటీవల కమిషనర్ కర్ణన్ ఆగ్రహం వ్యక్తం చేయడంతో 3 వారాలపాటు ఆ కేంద్రాలను మూసేశారు. ఈ నెల 6న మళ్లీ



తెరిచారు.

**ఇవీ కారణాలు..** ఈసారి వానలు అధికంగా పడ్డాయి. జలమండలి, టెలికాం సంస్థలూ ఇష్టానుసారం రోడ్లను తవ్వాయి. మ్యాన్‌హోళ్ల మరమ్మతు పనుల్లో 10 శాతం కూడా నాణ్యత లేదు. దీంతో అవీ మాటిమాటికి కుంగుతున్నాయి. బాక్స్‌డ్రెయిన్ పనుల్లో 50 శాతంమరమ్మతులకు వచ్చాయి. మ్యాన్‌హోళ్ల మూతలు పగిలిపోయాయి. రోడ్లపై రోజుల తరబడి నీరు నిలిచి గుంతలు ఏర్పడుతున్నాయి. నెలకోసారి ట్రాఫిక్, జలమండలి, జీహెచ్‌ఎంసీ, విద్యుత్తు, టెలికాం శాఖల సమన్వయ సమావేశం జరగాలి. రోడ్ల సమస్యలపై చర్చించి చర్యలు తీసుకోవాలి. రెండేళ్లుగా సమావేశాలు జరగట్లేదు.

**ప్రమాణాల ప్రకారం..**

గ్రేటర్ విస్తీర్ణం.. 650 చ.కి.మీ
జనాభా.. 1.2 కోట్లకుపైగా
రోడ్ల పొడవు.. 10 వేల కి.మీ
తారు మిశ్రమ తయారీ కేంద్రాలు.. చుడీబజార్, దీప్తిశ్రీనగర్
నాసిరకం తారుతో రోడ్లపై ఏర్పడ్డ గుంతలు: 30 వేలు
రోడ్డు వేసే సమయంలో ఉండాల్సిన ఉష్ణోగ్రత.. 120-130 డిగ్రీలు
తయారు చేసేటప్పుడు ఉష్ణోగ్రత: 150-190 డిగ్రీలు
ప్రస్తుతం గుంతల్లో వేసేటప్పటి పరిస్థితి: 0-50 డిగ్రీలు

# తోకలేని పిట్ట.. మారింది ఇట్టా..



హైదరాబాద్: 'తోక లేని పిట్ట తొంభై ఆమడలు వెళ్లింది' అనేది పొడుపు కథ. ఇప్పుడు ఆ పొడుపు కథ స్వరూపం మారింది. తోకలేని పిట్ట.. భిన్న రంగాల్లోకి అడుగు పెట్టింది. కేవలం ఉత్తరాలకే పరిమితం కాకుండా బ్యాంకింగ్, బీమా, పార్శిల్, ఈ-కామర్స్, ఆధార్, పొదుపు ఖాతాల వంటి ఎన్నో సేవలను అందిస్తోంది. అక్టోబర్ 10న జాతీయ తపాలా దినోత్సవం సందర్భంగా కథనం..

**ఇంటి వద్దకే సేవలు**

2018లో ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంకు (ఐపీపీబీ) రంగప్రవేశంతో బ్యాంకు ఖాతా లేనివారికీ ఆ సౌకర్యం అందిస్తోంది. ఇంటి వద్దకే పోస్ట్‌మాన్ వచ్చి సేవలుందిస్తున్నారు. ఆధార్‌తో బయోమెట్రిక్ తీసుకుని డబ్బులు ఇస్తున్నారు. డిజిటల్ చెల్లింపులు, సూక్ష్మ రుణ సేవలు ఇంటికే వస్తున్నాయి. దేవాలయాల ప్రసాదాలు, తలంబ్రాలు కూడా తెచ్చి ఇస్తున్నారు. డాక్ ఘర్ నిర్యంత్ కేంద్రాలు (డీఎన్‌కే) తెలంగాణలో 37 ఉన్నాయి. వీటితో దుస్తులు, కలంకారీ వస్త్రాలు, తేయాకు, కొండపల్లి, ఏటికొప్పాక బొమ్మలు, ఆయుర్వేద మందులను అమెరికా, బ్రిటన్, భూటాన్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ దేశాలకు ఎగుమతి చేస్తున్నారు. ఇలా మొత్తం 219 దేశాలకు మన తపాలా సేవలు అందుతున్నాయి.

**90 శాతం గ్రామాల్లోనే..**

దేశంలో 1854లో లార్డ్ డల్హౌసీ తపాలా సేవలను ప్రారంభించారు. 2025 మార్చి నాటికి దేశ వ్యాప్తంగా 1,64,999 శాఖలను ఏర్పాటు చేశారు. వాటిలో సుమారు 90.54 శాతం (1,49,385) గ్రామాల్లోనే ఉండగా మిగిలిన 9.46 శాతం (15,614) పట్టణాల్లో ఉన్నాయి. తెలంగాణలో సుమారు 6,305 శాఖలున్నాయి. స్వాతంత్ర్యానికి ముందే నగరంలో 6వ ఫతే జంగ్ మహబూబ్ అలీ ఖాన్ అసఫ్ జా పాలనలో స్టాంపుల యుగం ప్రారంభమైంది. బ్రిటిష్ హయాంలో 1869లో తిరుమలగిరిలో హెడ్ పోస్టాఫీసు ఏర్పాటైంది.

# పంట కల్లాలు.. తీరనున్న కష్టాలు



హైదరాబాద్: దోమ మండల పరిధిలోని పాలేపల్లికి చెందిన రైతు కిష్టప్ప ధాన్యం ఆరబెట్టడానికి స్థలం లేక పంట కోత సమయంలో ఇక్కట్లు పడుతున్నాడు. రూ.2 వేలకు ఒకటి చొప్పున 5 టార్పాలిన్లకు రూ.10వేలు వెచ్చించి పొలంలోనే ఆరబెడుతున్నాడు. అవి నాణ్యంగా లేక ఏడాదికే చిరిగిపోతుండడంతో మళ్లీ కొనాల్సి వస్తోందని వాపోతున్నాడు. బొంరాస్‌పేట మండలం ఏర్పుమళ్లకు చెందిన రైతులు నర్సిములు, వెంకటయ్య స్థలం లేక అయిదెకరాల్లో పండిన ధాన్యాన్ని గ్రామంలోని సీసీ, నాందార్‌పూర్ తారు రోడ్లపై ఆరబెడుతున్నారు. పంటలు ఆరబెట్టేందుకు ఇబ్బందులు పడుతున్న రైతులకు కేంద్రం ఊరట కలిగించింది. జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో పంట కల్లాలను నిర్మించడానికి అనుమతించింది. వడ్లు, కందులు, పెసర, మొక్కజొన్న, జొన్న వంటి పంటలను పండిస్తున్న రైతులు వాటిని కోసిన తరవాత ఆరబెట్టడం, తూర్పారబట్టడం పెద్ద సమస్యగా మారింది. ఎండలో ఆరబెడితేనే తేమ శాతం తగ్గుతుంది. ఆ తరవాతే అమ్మకానికి తీసుకెళతారు. జిల్లాలో ఏటా వానాకాలంలో 5,51,559 ఎకరాలు, యాసంగిలో 1.43 లక్షల ఎకరాల్లో పంటలు సాగవుతుంటాయి.

**రోడ్లపైనే ఆరబోత..**

పంట కోసిన తరవాత ఇళ్ల ముందు, పొలాల్లో కల్లాలు నిర్మించుకున్న వారు ఆరబోస్తుండగా.. సౌకర్యం లేని చాలామంది అన్నదాతలు రహదారులపైనే పోస్తున్నారు. రోడ్డుకు ఒకవైపు పోసి రోజంతా ఎండిన తరవాత సాయంత్రం ఒకచోట కుప్పగా చేసి తడవకుండా పైన ప్లాస్టిక్ కవర్లు, టార్పాలిన్లు కప్పి ఇంటికొస్తారు. ఇలా రెండు, మూడ్రోజులు వడ్లు ఎండాక కొనుగోలు కేంద్రాలకు తరలిస్తుంటారు. రోడ్లపై ధాన్యం పోయడంతో ప్రమాదాలు చోటుచేసుకున్న సంఘటనలు జిల్లాలో చాలానే ఉన్నాయి. పోలీసులు అన్నదాతలకు అవగాహన కల్పిస్తున్నా గత్యంతరం లేక రోడ్లపైనే ఆరబెట్టి నూర్పిళ్లు చేస్తున్నారు.

**గతంలో నిర్మించినా..**

పంట ఉత్పత్తుల ఆరబోతకు గతంలో ఉపాధిహామీలో కల్లాలు నిర్మించారు. కొలతల ఆధారంగా ఒక్కోదానికి రూ.21- 70 వేల వరకు ఖర్చయింది. పొలాల విస్తీర్ణం ఎక్కువగా ఉన్నవారు వాటిని నిర్మించుకొని వాడుకుంటున్నారు. 2022లో వీటికి కేంద్రం అనుమతి ఇవ్వకపోవడంతో అప్పట్నుంచి నిర్మించడం లేదు. సగం కట్టుకున్న వారికి డబ్బులూ పెండింగ్‌లోనే ఉన్నాయి. మళ్లీ కల్లాల నిర్మాణానికి కేంద్రం అనుమతివ్వడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఆసక్తి ఉన్న అన్నదాతలు ముందుకొచ్చే అవకాశముంది. ప్రస్తుతం స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు దృష్టి సారించనున్నారు. ఈ విషయమై డీఆర్‌డీఓ శ్రీనివాస్‌ను సంప్రదించగా.. ఎన్నికల తరవాత నిర్ణయం తీసుకొంటామన్నారు. బొంరాస్‌పేట, దోమ

# న్యాయస్థానం చెప్పినా పట్టించుకోరా?



హైదరాబాద్: శంషాబాద్ విమానాశ్రయం సమీపంలోని కొత్వాల్‌గూడలో అక్రమార్కుల చెరలో ఉన్న 52 ఎకరాల భూములు ప్రభుత్వానివేనంటూ రంగారెడ్డి జిల్లా కోర్టు గతేడాది డిసెంబరులో తీర్పు వెలువరించింది. రూ.2 వేల కోట్ల విలువైన ఆ భూములను వెంటనే స్వాధీనం చేసుకోకుండా రెవెన్యూ అధికారులు తాత్సారం చేస్తున్నారు. ఈ తీర్పును సవాలు చేస్తూ కబ్జాదారులు హైకోర్టును ఆశ్రయిస్తే... కౌంటర్ దాఖలు చేయకుండా మీనమేషాలు లెక్కిస్తున్నారు. అక్రమార్కులు స్థానిక ప్రజాప్రతినిధులతో రెవెన్యూ అధికారులపై ఒత్తిళ్లు తీసుకొస్తున్నారన్న ఆరోపణలున్నాయి. మరోవైపు ఆ భూముల్లో కొందరు ఇళ్లు నిర్మించుకుంటున్నారు. దర్జాగా రహదారులు వేసుకున్నారు. ఫంక్షన్‌హాళ్లలో కార్యక్రమాలు నిర్వహిస్తూ రూ.లక్షలు ఆర్జిస్తున్నారు.

**ఏం చేశారంటే..** హిమాయత్‌సాగర్ చెరువుకట్ట నిర్మించేందుకు 1921లో నిజాం నవాబు పనులు ప్రారంభించారు. ఓ రైతు తన భూమి నీళ్లలోకి పోయిందంటూ విన్నవించగా.. ఆయనకు మరోచోట భూమి ఇచ్చారు. ప్రస్తుతం ఆయన వారసులు అక్కడ సాగుచేసుకుంటున్నారు. మరోవైపు శంషాబాద్ విమానాశ్రయం వద్ద భూముల ధరలకు రెక్కలు రావడంతో వాటిపై ప్రైవేటు వ్యక్తులు కన్నేశారు. కొత్వాల్‌గూడలో సర్వే నంబర్ 54లోని 52 ఎకరాల భూమిని రైతు వారసుల నుంచి కొనుగోలు చేశామంటూ 2009లో జూనియర్ సివిల్ జడ్జి కోర్టును ఆశ్రయించారు. న్యాయస్థానం 2016లో ఆ భూములు ప్రైవేటు వ్యక్తులవేనంటూ తీర్పు ఇచ్చింది. దీన్ని సవాలు చేస్తూ రెవెన్యూ అధికారులు రంగారెడ్డి జిల్లా కోర్టును ఆశ్రయించారు. ః రెవెన్యూ రికార్డులు, ధ్రువపత్రాలను పరిశీలించిన న్యాయస్థానం కొత్వాల్‌గూడ సర్వే నంబరు 54లో 270 ఎకరాల భూమి ఉండగా.. అందులో 50 ఎకరాలు పర్యాటకశాఖకు, 47 ఎకరాలు బాహ్యవలయ రహదారికి కేటాయించగా.. మిగిలిన భూములన్నీ ప్రభుత్వానివేనని స్పష్టం చేసింది.

**కౌంటర్ దాఖలు చేస్తున్నాం - రవీందర్‌దత్, తహసీల్దార్, శంషాబాద్**

కొత్వాల్‌గూడ భూములను స్వాధీనం చేసుకునేందుకు త్వరలో కౌంటర్ దాఖలు చేస్తున్నాం. ఇప్పటికే ప్రభుత్వ న్యాయవాదులతో చర్చించాం. కొన్ని భవనాలు, నిర్మాణాలు హిమాయత్ సాగర్ ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్నాయని తెలిసింది. రెండు రోజుల్లో తొలగించనున్నాం.

# మామూళ్ల కిక్కు మజానే వేరు!

సంగారెడ్డి : సంగారెడ్డి జిల్లాలో ఆ సారు తీరు సపరేటు. ఇప్పటికే తీసుకుంటున్న రూ.10 వేలతో ప్రమేయం లేకుండా ఒక్కో దుకాణానికి నెలకు రూ.వెయ్యి చొప్పున అదనంగా ఇవ్వాల్సిందే అంటూ హుకుం జారీ చేశారు. ఇటీవలి కాలంలో ఈయన పనితీరుపై తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తాయి. నేతల మద్దతుతో తనదైన శైలిలో వసూళ్ల దందాను కొనసాగిస్తున్నారని ఆయన పరిధిలోని ఠాణాల్లో విధులు నిర్వహించే సిబ్బంది చెవులు కొరుక్కుంటున్నారు. మరో అధికారి మాత్రం కప్పంలో ఏ మాత్రం తేడా వచ్చినా విధులు నిర్వహించే సిబ్బందిపై దూషణలకు దిగుతారనే ఆరోపణలున్నాయి. ఉమ్మడి జిల్లాలోని మద్యం దుకాణాల్లో పోలీసుల మామూళ్ల దందా శృతి మించుతోంది. గ్రామీణ, పట్టణం అనే తేడా లేకుండా అన్ని చోట్ల వసూళ్లపర్వం యథేచ్ఛగా సాగుతోంది. కొద్దిరోజుల క్రితం వరకు దుకాణానికి నెలకు రూ.10 వేల చొప్పున వసూలు చేశారు. లీజు గడువు సమీపించిన నేపథ్యంలో కొందరు మద్యం దుకాణాదారులు సైతం వారి దందాలో అక్రమాలకు తెరలేపారు. దీనినే ఆసరాగా మార్చుకుంటున్న కొందరు పోలీసు అధికారులు ఒక్కో దుకాణానికి అదనంగా కప్పం కట్టాల్సిందేనంటూ అనధికారిక ఆదేశాలు జారీచేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వచ్చిన మొత్తాన్ని కింది స్థాయి కానిస్టేబుళ్ల నుంచి పైస్థాయిలో కొందరు పోలీసు అధికారుల వరకు వాటాలేసుకుంటున్నట్లు ఆరోపణలున్నాయి. దీంతో దుకాణ నిర్వాహకులు సైతం నిబంధనలు గాలికొదిలేశారు. **కప్పం కట్టాల్సిందే..** సంగారెడ్డి జిల్లా కేంద్రంతో పాటు సమీప పట్టణాలు, నియోజకవర్గం పరిధిలో 59 దుకాణాలున్నాయి.

# అంతన్నారు.. అటకెక్కించారు

హైదరాబాద్: పైవంతెనలు, అండర్‌పాస్‌ల నిర్మాణం, రోడ్డు విస్తరణ పనుల కోసం ప్రత్యేకంగా రూ.7 వేల కోట్లతో చేపట్టిన హెచ్-సిటీ(హైదరాబాద్ ఇన్నోవేషన్ అండ్ ట్రాన్స్‌ఫర్మేటివ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్) ప్రాజెక్టు అటకెక్కింది. ముఖ్యమంత్రి ఆయా పనులకు శంకుస్థాపన చేసి దాదాపు రెండేళ్లు కావస్తున్నా ఒక్క పనీ ప్రారంభం కాలేదు. జీహెచ్‌ఎంసీ ఇంజినీరింగ్, ప్రణాళిక విభాగాల మధ్య సమన్వయం లేకపోవడం, ఉన్నతాధికారుల నిర్లక్ష్యంతో కీలకమైన ప్రాజెక్టులో కదలిక లేదు. అనేకసార్లు సీఎం ఈ విషయమై అసంతృప్తి వ్యక్తం చేసినా పురోగతి లేకపోవడం విమర్శలకు తావిస్తోంది.

అధికారుల అసంబద్ధ నిర్ణయాలతో.. రూ.45 కోట్లతో చందానగర్-అమీన్‌పూర్ మధ్య చేపట్టిన రోడ్డు విస్తరణ పనులకు మంత్రి శ్రీధర్‌బాబు రెండున్నర నెలల క్రితం శంకుస్థాపన చేశారు. ఇంజినీరింగ్ అధికారుల అసంబద్ధ నిర్ణయాలతో పనులు ముందుకు సాగడం లేదు.

**భూసేకరణలో జాప్యం..**




కేబీఆర్ పార్కు చుట్టూ ఆరు కూడళ్లలో రూ.1,090 కోట్లతో చేపట్టనున్న స్టీలు బ్రిడ్జీలు, అండర్‌పాస్‌లు నిర్మించనున్నారు. పార్కు చుట్టూ 307 నిర్మాణాలను తొలగిస్తే తప్ప పనులను ప్రారంభించలేమని ఇంజినీర్లు చెబుతున్నారు. భూసేకరణకు యజమానులను ఒప్పించే ప్రక్రియ సఫలం కావట్లేదు.

హైటెక్‌సిటీలో రూ.749 కోట్లతో పైవంతెనలు, అండర్‌పాస్‌ల నిర్మాణం, రోడ్డు విస్తరణ పనులు చేపట్టాల్సి ఉంది. ఇక్కడా భూసేకరణ కారణంగానే పనులు నిలిచాయి.

నాటి వేగమేది ?

ఎస్సార్డీపీ కింద చేపట్టిన పనులకు భూసేకరణ వాయువేగంతో జరిగింది. నాటి ఉన్నతాధికారుల చొరవతో యజమానులు భూసేకరణకు అంగీకరించారు. ప్రస్తుతం తాము ఎన్నిసార్లు అడిగినా యజమానులు అంగీకరించట్లేదని అధికారులు చెబుతున్నారు.

# ఓటరు నమోదుకు మిగిలింది రెండ్రోజులే

హైదరాబాద్: ఓటు హక్కు పొందేందుకు మిగిలింది రెండ్రోజులే. సాయంత్రం వరకు అందిన దరఖాస్తులనే అధికారులు పరిశీలిస్తారు. వాటిలో వివరాలు సవ్యంగా ఉన్న అర్జీలను ఆమోదించి నవంబరు 11న జరగనున్న జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో ఓటు వేసేందుకు అవకాశం కల్పిస్తారు. 18 ఏళ్లు నిండిన యువత ఓటరు గుర్తింపునకు దరఖాస్తు చేసుకోవాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్, జిల్లా ఎన్నికల అధికారి(డీఈఓ) ఆర్వీ కర్ణన్ పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ఎన్నికల




సంఘాల వెబ్‌సైట్లలో దరఖాస్తు చేసుకోవడం ఉత్తమమని అధికారులు సూచిస్తున్నారు. ఓటరు నమోదుకు ఫారం-6లో వివరాలు నింపాలి.

**పోలింగ్ శాతం అంతంతే..**

2018, 2023 అసెంబ్లీ ఎన్నికల్లో వరుసగా 48.89, 47.88 శాతం మంది ఓటేశారు. పార్లమెంటు ఎన్నికల్లోనూ అదే పరిస్థితి. ఈసారి పోలింగ్ శాతం పెరుగుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఓటరు చైతన్య కార్యక్రమాలు, పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలను మెరుగుపరచడం వంటి చర్యలతో ఓటర్లను చైతన్యవంతం చేస్తామని జీహెచ్‌ఎంసీ ధీమా వ్యక్తం చేస్తోంది.

2023 సాధారణ అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే పెరిగిన ఓట్లు.. 13,717
అందులో మహిళా ఓటర్లు.. 8,685
పురుషులు 5,032

# నిరభ్యంతరం.. సులభతరం

హైదరాబాద్: అగ్నిమాపక నిరభ్యంతర పత్రా(ఫైర్ ఎన్‌వోసీ)ల జారీని మరింత సులభతరం చేస్తూ డ్రాయింగ్‌ల పరిశీలన ప్రక్రియ వేగంగా జరిగేలా అగ్నిమాపకశాఖ 'ఆటో స్క్రూటినీ ఇంజిన్'ను ప్రవేశపెట్టింది. క్యాడ్ డ్రాయింగ్ కోసం ప్రత్యేకంగా ప్రివల్ టూల్‌ను అందుబాటులో ఉంచింది. వాణిజ్య, వ్యాపార అవసరాల కోసం 15 మీటర్ల కంటే, నివాస గృహాలుగా 18 మీటర్ల కంటే ఎత్తులో నిర్మించే భవనాలకు ప్రొవిజినల్ ఎన్వోసీ తప్పనిసరి. భవన నిర్మాణ ప్రారంభానికి ముందే దీన్ని పొందాల్సి ఉంటుంది.

తాజా సాంకేతిక పరిజ్ఞానంతో.. కొత్తగా ప్రవేశపెట్టిన సాఫ్ట్‌వేర్‌లో ఈ వివరాలన్నీ ముందే పొందుపరిచి ఉంటాయి. దరఖాస్తు సమయంలో దరఖాస్తుదారుడు భవనం వివరాలు పొందుపరచడంతో పాటు దాని భద్రతా ప్రమాణాల ప్లాన్‌ను ఆటోక్యాడ్ రూపంలో ఉంచుతారు. దీనిని క్షుణ్ణంగా పరిశీలించే సాఫ్ట్‌వేర్ అవసరమైన మార్పులు, చేర్పులు సూచిస్తుంది. ఈ మేరకు ప్లాన్‌ను మారుస్తూ మరో ఆటోక్యాడ్‌ను అప్‌లోడ్ చేయాలి. స్క్రూటినీ ప్రక్రియ అనంతరం రెండు నుంచి మూడు పేజీల నివేదిక వస్తుంది. అధికారుల పరిశీలన తర్వాత ఎన్వోసీ జారీ అవుతుంది. మరిన్ని వివరాలకు %https://fire.telangana.gov.in/Home.aspx% వెబ్‌సైట్‌ను సందర్శించొచ్చు.

గతంలో ఇలా.. భవన నిర్మాణం ప్రారంభించే ముందే ప్రొవిజినల్ ఎన్వోసీ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటున్నారు. సంబంధిత అధికారులు ఆ ఫైల్‌ను, అందులోని ప్రతిపాదిత భద్రత ప్రమాణాలను పరిశీలిస్తారు. అవసరమైతే మార్పులు, చేర్పులు సూచించి వాటిని జోడించాకే జారీ చేస్తారు. భవనం భద్రత ప్రమాణాల నమూనా, వాటికి తగ్గట్టు ఉంటేనే ప్రొవిజినల్ ఎన్వోసీ జారీ అవుతుంది.

# కేసులు తగ్గిన అక్రమాలు ఆగలే!

జగిత్యాల: రేషన్ దుకాణాల్లో దొడ్డు బియ్యం స్థానంలో సన్న బియ్యం పంపిణీ మొదలైంది. ఈ క్రమంలో పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో నమోదయ్యే కేసుల సంఖ్య మూడో వంతుకు తగ్గినప్పటికీ బియ్యం అక్రమ రవాణా మాత్రం ఆగడం లేదు. జిల్లాలో ఈ ఏడాది నమోదైన కేసులకు సంబంధించి తాజా గణాంకాలు ఇందుకు అద్దం పడుతున్నాయి.

**దొరికింది 945 క్వింటాళ్లు**

జిల్లాలో గతేడాది జనవరి నుంచి డిసెంబరు వరకు పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో 6ఏ కేసులు 109 నమోదయ్యాయి.
ఇందులో 33 కేసులు ఎల్పీజీ సిలిండర్ల అక్రమ వినియోగానికి సంబంధించినవి. మిగిలిన 76 కేసులు పీడీఎస్ బియ్యానికి సంబంధించినవి. 6ఏ కింద వీటిని నమోదు చేసి 1,257 క్వింటాళు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఏడాది ఇప్పటివరకు బియ్యం అక్రమ రవాణాకు సంబంధించి 23 కేసులు మాత్రమే నమోదైనా 1,133.04 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు.
ఈ కేసుల్లో 188 క్వింటాళ్లు మాత్రమే దొడ్డు బియ్యానివి. ఏప్రిల్ నుంచి ఇప్పటివరకు నమోదైన కేసుల్లో 945 క్వింటాళ్ల సన్న బియ్యం దొరికాయి. ఇందులో ఓ రైస్ మిల్లులో దొరికిన సన్నబియ్యం 870



క్వింటాళ్లు కాగా, మరికొన్ని కేసుల్లో పౌరసరఫరాల అధికారులు మరో 75 క్వింటాళ్లు పట్టుకున్నారు.

**అనర్హులైన లబ్ధిదారులతోనే!**

ప్రభుత్వం అయిదు నెలల కిందట సన్న బియ్యం పంపిణీకి శ్రీకారం చుట్టింది. పంపిణీలో పారదర్శకత కోసం ప్రతినెలా పీవోఎస్ విధానంలో లబ్ధిదారులకు అందిస్తోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్ని చర్యలు తీసుకుంటున్నా బియ్యం అక్రమ రవాణా కొనసాగుతుండటంపై యంత్రాంగం దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. పేద, మధ్యతరగతి వర్గాలతో పాటు ధనికులకు కార్డులు జారీ చేయడం వల్లే బియ్యం పక్కదారి పడుతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవల బియ్యం అక్రమంగా తరలిస్తున్న ఓ ఆటోను పట్టుకున్న ఘటనలో ఇంటింటికీ తిరిగి బియ్యం సేకరిస్తున్నానని డ్రైవర్ చెప్పడం ఈ వాదనకు బలం చేకూరుస్తోంది.

**నిఘా పెంచాం**

ప్రభుత్వం పంపిణీ చేస్తున్న సన్న బియ్యానికి ఆదరణ కనిపిస్తోంది. గతేడాదితో పోలిస్తే 6ఏ కేసులు గణనీయంగా తగ్గాయి. రైస్ మిల్లులో పెద్ద మొత్తంలో స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని మినహాయిస్తే, ఈ ఏడాది పట్టుబడిన బియ్యం 75 క్వింటాళ్లే. అక్రమ రవాణాకు అవకాశం లేకుండా అన్ని విధాలుగా నిఘా పెంచాం. ఈ విషయంలో ఎవరైనా నిర్భయంగా సమాచారం ఇస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటాం.
జితేందర్‌రెడ్డి, జిల్లా పౌరసరఫరాల అధికారి

# రేషన్ దందా.. అక్రమార్కుల పంథా


భగత్‌నగర్: దొడ్డు బియ్యం చాలా మంది తినడం లేదని, సన్నబియ్యం అయితే ఎక్కువ మంది లబ్ధిదారులకు ప్రయోజనకరంగా ఉంటుందని రాష్ట్ర ప్రభుత్వం దీన్ని పంపిణీ చేస్తోంది. దీంతోపాటు బియ్యం అక్రమ రవాణాకు అడ్డుకట్ట పడుతుందని భావించారు. అయినా అక్కడక్కడా అక్రమ రవాణా జరుగుతోంది.

**ఇంటింటికీ తిరిగి..**

రేషన్ బియ్యం చిరు వ్యాపారుల నుంచి దళారులకు అక్కడి నుంచి రైస్‌మిల్లులకు గొలుసుకట్టు విధానంలో చేరుతోంది. చిరు వ్యాపారులే స్వయంగా ఇంటింటికీ తిరిగి రూ.19 నుంచి రూ.20 వరకు వెచ్చించి రేషన్ బియ్యం కొనుగోలు చేస్తున్నారు. మధ్య దళారులకు రూ.22 నుంచి రూ.23కు విక్రయిస్తున్నారు. వీరు ఆయా రైస్ మిల్లులకు తరలిస్తున్నారు. ఇలా జిల్లాలో రోజుకు 15 మెట్రిక్ టన్నుల రేషన్ బియ్యం అక్రమ రవాణా జరుగుతోంది. ప్రత్యేకంగా అడ్డాలు ఏర్పాటు చేసుకొని మరీ దళారులు వ్యాపారం చేస్తున్నారు.

**ప్రభుత్వ ధాన్యంతోనే..**

రాష్ట్ర ప్రభుత్వం రూ.కోట్లు వెచ్చించి ధాన్యాన్ని కొనుగోలు చేసి మర ఆడించి నిరుపేదల ఆకలి తీర్చడానికి పంపిణీ చేస్తోంది. మర ఆడించడానికి ఇచ్చిన ధాన్యాన్ని వ్యాపారులు పక్కదారి పట్టిస్తుండగా



ఆ బియ్యం స్థానంలో రేషన్ బియ్యాన్ని అక్రమంగా కొని ప్రభుత్వానికి కస్టం మిల్లింగ్ బియ్యంలా అందిస్తున్నారు. రీసైక్లింగ్ చేస్తూ పలువురు రైస్‌మిల్లుల యజమానులు పైసా పెట్టుబడి లేకుండా ప్రభుత్వ ధాన్యంతో దందా చేస్తూ రూ.కోట్లు సంపాదిస్తున్నారు. ఈ చర్యలను నిరోధించాల్సిన అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారు.

**అక్కడ ఆదర్శం**

రాజన్న సిరిసిల్ల జిల్లాలో రేషన్ బియ్యం దందాను అడ్డుకోవడానికి అధికారులు ఇంటింటికీ తిరిగి బియ్యం కొనుగోలు చేసే వ్యాపారులను కట్టడి చేశారు. బియ్యం కొనుగోలు చేసిన ద్విచక్రవాహనదారులపై కేసులు నమోదు చేసి సీజ్ చేశారు. వ్యాపారం కట్టడి కావడంతో రేషన్ బియ్యం సరఫరా చేసేవారు లేక అక్కడ దందాకు తెరపడింది. అయితే జిల్లాలో బాహాటంగా జరుగుతున్న దందాను నిరోధించడానికి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ప్రతి నెలా మిల్లుల్లోని ధాన్యం నిల్వల లెక్కలు తనిఖీలు చేస్తే మిల్లర్లు రేషన్ బియ్యం కొనుగోలు చేయడానికి వెనకడుగు వేసే అవకాశం ఉంటుంది.

# నిబంధనలు తొండి.. అక్రమాలు దండి



తాండూరు : వాణిజ్య పట్టణంగా పేరున్న తాండూరు శివారులో అక్రమ లేఅవుట్లు వెలిశాయి. వెంచర్లలో స్థలాలను ప్లాట్లుగా మార్చి గుంటల లెక్కన విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. 15 ఏళ్ల కిందట పట్టణ శివారులో ఎకరం భూమి రూ.5- 10 లక్షల వరకు ఉండేది. కొందరు వ్యక్తిగతంగా, మరికొందరు బృందాలుగా ఏర్పడి కొన్నారు. అప్పట్లో చౌకగా కొన్నవి ప్రస్తుతం రూ.కోట్లలో పలుకుతున్నాయి. ఎలాంటి అనుమతులు లేకుండానే అలాంటి భూముల్లో వెంచర్లు వేసి ప్లాట్లు అమ్ముకుంటున్నారు.

**వ్యాపార కేంద్రం కావడంతో..**

ప్లాట్లుగా మార్చి విక్రయిస్తున్న స్థలాలు రెవెన్యూ దస్త్రాల్లో మాత్రం వ్యవసాయ భూములుగానే దర్శనమిస్తున్నాయి. వాస్తవ పరిస్థితిని పరిశీలిస్తే అక్కడ భూములకు బదులు ఇళ్లు కనిపిస్తున్నాయి. కొన్ని ప్లాట్ల చుట్టూ కంచె వేసుకున్నారు. మరికొందరు రాతి, సిమెంటు కడీలు పాతారు. తాండూరు పట్టణం ఉపాధి కేంద్రం కావడంతో సిమెంటు పరిశ్రమలు, నాపరాళ్లు, సుద్ద గనులు, రవాణా రంగం, పాలిష్ యూనిట్లలో పనిచేస్తూ జీవిస్తున్న చాలా మంది భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని ప్లాట్లు కొంటున్నారు. పట్టణానికి పొరుగున ఉన్న మండలాలకు చెందిన చాలా మంది తీసుకున్నారు.

**ఇవీ నిబంధనలు..**

వ్యవసాయ భూమిలో ప్లాట్లు వేయాలంటే నాలా అనుమతి తీసుకోవాలి. డీటీసీపీ లేఅవుట్‌గా మార్చాలి. 20 నుంచి 60 అడుగుల వెడల్పుతో అంతర్గత రహదారులు, వీధిదీపాల ఏర్పాటుకు స్తంభాలు, మురుగు ప్రవాహ కాలువలు నిర్మించాలి. తాగునీటి సరఫరాకు ఉపరితల ట్యాంకు, ఉద్యానవనం, పాఠశాల అందుబాటులో ఉండాలి. అన్నింటికి కలిపి 10 శాతం స్థలాన్ని పురపాలికకు అప్పగించాలి. ఇవన్నీ కావాలంటే లేఅవుట్ విస్తీర్ణాన్నిబట్టి భారీగానే ఖర్చవుతుంది. దీంతో ఇవేవీ లేకుండా స్థిరాస్తి వ్యాపారులు నేరుగా వ్యవసాయ భూములను ప్లాట్లుగా మార్చి గజాల లెక్కన విక్రయించి గుంటల్లో రిజిస్ట్రేషన్ చేసి ఆర్థికంగా లబ్ధి పొందుతున్నారు. ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు.

**200 ఎకరాలకుపైనే..**

కోకట్, అంతారం, సాయిపూరు, మల్‌రెడ్డిపల్లి, ఇందిరానగర్, రసూల్‌పూర్, బషీర్‌మియాతండా, బామ్లానాయక్ తండా, చెంగేష్‌పూరు, పాత తాండూరు, గౌతాపూరు, ఖాంజాపూరు, కందనెల్లి గ్రామాల శివారులో 200 ఎకరాలకుపైనే అక్రమ లేఅవుట్లలో ప్లాట్లు విక్రయించారు. ప్రస్తుతం అవన్నీ వ్యవసాయ భూములుగానే దస్త్రాల్లో దర్శనమిస్తున్నాయి.

**తాఖీదులు జారీ చేస్తాం- సుధాకర్, కోకట్ పంచాయతీ కార్యదర్శి**

పంచాయతీ పరిధిలో 2020 తరవాత అక్రమ లేఅవుట్లు ఏర్పాటు చేసిన వారికి తాఖీదులిస్తాం. ఇప్పటికే ఓ వెంచర్‌కు సంబంధించిన యజమానికి అందించాం. 2020కి ముందు ఏర్పాటు చేసిన ప్లాట్లకు ఎల్ఆర్ఎస్ రుసుం చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు.

# యోధుల త్యాగఫలం.. ఏదీ ప్రతిఫలం



పెద్దపల్లి: పెద్దపల్లికి చెందిన సమరయోధుడు మల్లోజుల వెంకటయ్యకు రాష్ట్ర ప్రభుత్వం అంతర్గాం సమీపంలో 5 ఎకరాల వ్యవసాయ భూమిని పంపిణీ చేసింది. అయితే అది కాస్త ఎల్లంపల్లి ప్రాజెక్టులో ముంపునకు గురైంది. దీంతో పరిహారం లేదా మరోచోట భూమి ఇవ్వకపోవడంతో వెంకటయ్య భార్య మధురమ్మ చనిపోయేంత వరకు కార్యాలయాల చుట్టూ తిరిగారు.
సమరయోధులకు భూమి పంపిణీ చేయగా అందులో అధికశాతం సాగుకు యోగ్యమైనవి కావు. గుట్టలు, చెట్లతో నిండగా మరికొన్నింటిలో చెక్‌డ్యాంలు సైతం ఉన్నాయి. వీటిని సాగు చేయలేకపోతున్నారు.
జాతీయ పండగలు వచ్చిన ప్రతిసారి సమరయోధులను స్మరించుకోవడం, వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించడం వరకే సరిపోతుంది. వారి సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు, నాయకులు ఇసుమంతైనా స్పందించిన దాఖలాలు కనిపించడంలేదు.
పెద్దపల్లిలో భూసంబంధ సమస్య పరిష్కారానికి వచ్చిన ఓ సమరయోధుడి భార్య సమస్య నేటికీ పరిష్కారం కాలేదు. ఇదే పరిస్థితి ఉమ్మడి జిల్లా అంతటా నెలకొంది.

**దరఖాస్తులపై పట్టింపేది?** జీవో 185 ప్రకారం సమరయోధుల కుటుంబాలకు ప్రభుత్వం 5 ఎకరాల మాగాణి లేదా 10 ఎకరాల మెట్ట భూమి, ఇళ్ల స్థలాలు ఇవ్వాల్సి ఉంటుంది. తోటపల్లి గాంధీగా గుర్తింపు పొందిన బోయినపల్లి వెంకటరమణారావు ఆధ్వర్యంలో రేకుర్తి సమీపంలో 300 మందికి ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు ప్రయత్నాలు జరగగా.. కొంతమందికే ప్లాట్లు లభించాయి. ఉమ్మడి జిల్లాలో మరెక్కడా ఇలాంటి ప్రయత్నాలు జరగలేదు. ఇళ్ల స్థలాలకు అభ్యర్థించిన దరఖాస్తులు కూడా మోక్షానికి నోచుకోలేదు.

**వారసుల్లో ఆందోళన**

సమరయోధుల కుటుంబాలకు ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలతో వారి వారసులు ప్రయోజనం అందుకోలేకపోతున్నారు. ఇచ్చిన భూమిని అమ్ముకునేందుకు ఎన్వోసీ ఇవ్వడంలేదు. వీరితోపాటు మాజీ సైనికులకు ఇచ్చిన భూములు ధరణిలో నిషేధిత జాబితాలో చేర్చడంతో.. కష్టకాలంలో వాటిని అమ్ముకునే అవకాశం లేకుండా పోయింది. వేదికపై చెప్పే మాటలకు క్షేత్రస్థాయిలో జరిగే పనులకు పొంతన కుదరడంలేదు.

**నిషేధిత జాబితా నుంచి తొలగించాలి**

సమరయోధుల కుటుంబాలకు ప్రభుత్వం ఇచ్చిన భూములు ధరణిలో నిషేధిత జాబితాలోకి వెళ్లడంతో లావాదేవీలు నిలిచిపోయాయి. ప్రభుత్వం సమస్యను పరిష్కరించి వారసుల కుటుంబాలకు ఊరట కల్పించాలి. ఇళ్ల స్థలాలిచ్చి ఆదుకోవాలి. వెంకటేశం, వారసుల సంఘం పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు

# కలిపేసుకున్నారు.. కట్టేస్తున్నారు



హైదరాబాద్ : శంషాబాద్ విమానాశ్రయం పరిసర ప్రాంతాల్లో ప్రభుత్వ భూములుంటే అక్రమార్కులకు పండగే. ఖాళీ స్థలాలు, రహదారులను ఆక్రమిస్తున్నారు. కొన్ని నెలల నుంచి తొండుపల్లి ఔటర్ ఎగ్జిట్ టోల్‌ప్లాజాకు సమీపంలో సర్వీసు రోడ్డును కబ్జా చేసి భవనాలు నిర్మిస్తున్నారు. పట్టాభూములను కొనుగోలు చేసి.. వాటి పక్కన ఉన్న సర్వీస్ రోడ్డు సరిహద్దులను కలిపేసుకున్నారు. లోపలికి వెళ్లేందుకు, బయటకు వచ్చేందుకు సరిహద్దుల్లో మెట్లు నిర్మించారు. శంషాబాద్ మున్సిపల్ అధికారులు అనుమతులు ఇవ్వకున్నా చకచకా కట్టేస్తున్నారు.

**ఉదయం.. సాయంత్రం..**

తొండుపల్లి టోల్‌ప్లాజా ఎగ్జిట్ 16 వద్ద సర్వీస్ రహదారి సరిహద్దుల్లో భవనాలుండడం, అక్కడికి వచ్చే వారి బండ్లను సర్వీస్ రోడ్డుపై ఉంచడంతో ఏపీ, కర్ణాటక, తమిళనాడు, కేరళ నుంచి ఓఆర్ఆర్ మీదుగా హైదరాబాద్‌కు వెళ్లే వాహనాలు ఒక్కసారిగా నిలిచిపోతున్నాయి. వాహనదారులు నరకయాతన పడుతున్నారు. ఒక్కోసారి కిలోమీటర్ వరకు వాహనాలు ఆగిపోతున్నాయి. వ్యాపారులు బయేట కౌంటర్లు ఏర్పాటు చేయడం, వారి వాహనాలను కూడా బయటే పార్కింగ్ చేస్తున్నారు. వెళ్లేందుకు వీలు లేకపోవడంతో ఒక్కోసారి డ్రైవర్లు భారీ వాహనాలను పక్కనపెట్టి దారి చేసుకొని వెళ్తున్నారు. టోల్‌ప్లాజా వద్ద సిబ్బంది ఉన్నా ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు.

**విస్తరణ ప్రతిపాదన పక్కన పడేశారు**

తొండుపల్లి టోల్‌ప్లాజా వద్ద రద్దీ పెరుగుతోంది. దీంతో విస్తరణకు హెచ్ఎండీఏ అధికారులు చేసిన ప్రతిపాదనలకు మోక్షం కలగడంలేదు. సర్వీస్ రోడ్డు సరిహద్దుల్లో అక్రమ నిర్మాణాలతో ప్రస్తుతం విస్తరణ సాధ్యం కాదు. వాటిని శంషాబాద్ మున్సిపల్, హెచ్ఎండీఏ అధికారులు పట్టించుకోవడం లేదు. టోల్‌ప్లాజా సమీపంలో ఓ వ్యక్తి సెల్లార్‌తో కూడిన భారీ భవన నిర్మాణం చేపడుతున్నా మున్సిపాలిటీ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు.

# ఇరుకు గదులు.. ఇక్కట్ల నడుమ చదువులు

పెద్దపల్లి :విద్యార్థులు వరండాలో ఉన్న ఈ చిత్రం ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల బొప్పాపూర్‌లో శివకేశవస్వామి ఆలయం వద్ద ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలోనిది. ఒకటి నుంచి ఐదో తరగతి వరకు 166 మంది విద్యార్థులు, మరో 24 మంది పూర్వప్రాథమిక పిల్లలు విద్యనభ్యసిస్తున్నారు. పాఠశాల భవనం శిథిలావస్థకు చేరుకుంది. ఇందులోనే రెండు అంగన్‌వాడీ కేంద్రాల్లో పైపెచ్చులు ఊడిపోయి, ఉరుస్తున్నాయి. మిగిలిన మూడు గదుల్లో తరగతులను నడుపుతుండగా మరో గదిని స్టాఫ్‌రూంగా వినియోగిస్తూనే అందులోనే పాఠాలు బోధిస్తున్నారు. మిగతా తరగతులను వరండాల్లో కొనసాగిస్తున్నారు. తరగతి గదుల కొరతతో విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు.
రాచర్ల బొప్పాపూర్‌లో శివకేశవస్వామి ఆలయం వద్ద ఉన్న పాఠశాల భవనం పురాతనంగా మారడంతో రెండు పడక గదుల ఇళ్ల సముదాయం వద్ద నిర్మించిన నూతన పాఠశాల భవనం ఇదీ. రూ.28 లక్షల సీడీపీ, రూ.7.80 లక్షల 'మన ఊరు- మనబడి' నిధులను వెచ్చించారు. గ్రౌండ్‌ఫ్లోర్, మొదటి అంతస్తుల్లో నాలుగు తరగతి గదులున్నాయి. ఈ భవనం వెనుకాలే రూ.24 లక్షలతో రెండు అంగన్‌వాడీ కేంద్రాలు, రూ.3.40 లక్షల ఈజీఎస్ నిధులతో వంటగది, బాలురు, బాలికలకు వేర్వేరుగా రూ.12.40 లక్షలతో శౌచాలయాలు,



రూ.9.50 లక్షల ఈజీఎస్ నిధులతో ప్రహరీలను నిర్మించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో రూ.4 లక్షల విలువైన కరెంటు, రంగులు వేసే పనులు మిగిలిపోయాయి. ఇలా అన్ని హంగులతో భవన నిర్మాణం పూర్తయి సుమారు నాలుగేళ్లు దాటుతున్నా వినియోగంలోకి తేవడం లేదు. జిల్లాలో 503 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. వాటిలో దాదాపు 40 వేల మంది విద్యార్థులు చదువుతున్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ కింద 283 బడులను ఎంపిక చేశారు. గ్రామీణ, పట్టణ పాఠశాలల్లో విద్యుత్తు, తాగునీరు, భవనాల మరమ్మతులు, శౌచాలయాల మరమ్మతులు, లేనిచోట కొత్తగా నిర్మాణాలు తదితర కనీస వసతుల కల్పనకు రూ.11 కోట్లు వెచ్చించారు. అంతకుముందు 'మన ఊరు- మన బడి'లో భాగంగా 172 పాఠశాలల్లో ఆయా వసతులు కల్పించారు. జిల్లాలో పీఎంశ్రీ పథకం కింద ఎంపికైన 16 పాఠశాలల్లో సైన్స్‌ల్యాబ్, గ్రంథాలయాలు, కంప్యూటర్ ల్యాబ్ తదితర వాటిని ఏర్పాటు చేశారు. 128 సర్కారు బడుల్లో కనీసం 189 అదనపు తరగతి గదులు అత్యవసరమని విద్యాశాఖ అధికారులు గుర్తించారు. అదనపు తరగతి గదుల నిర్మాణాలకు నిధులు లేక అనేక పాఠశాలలు నీరసించిపోయాయి. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించే విద్యార్థులు ఇరుకు గదులు, వరండాలు, చెట్ల కింద తమ చదువులను నెట్టుకొస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రభుత్వం స్పందించి, పాఠశాలల్లో నెలకొన్న అదనపు తరగతి గదుల సమస్యను పరిష్కరించాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.
ప్రభుత్వానికి నివేదికలు: వినోద్, జిల్లా విద్యాశాఖ అధికారి
జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలను నిత్యం సందర్శిస్తున్నాం. ఆయా పాఠశాలల్లో అవసరమైన మౌలిక వసతులు, అదనపు తరగతి గదుల కొరతను గుర్తిస్తున్నాం. ఈ మేరకు ప్రభుత్వానికి ఎప్పటికప్పుడు నివేదికలు సమర్పిస్తున్నాం. సర్కారు బడుల్లో చదివే విద్యార్థులు ఎలాంటి అసౌకర్యానికి గురికాకుండా చూడడమే మా లక్ష్యం. నిధులు మంజూరు కాగానే అదనపు తరగతి గదుల నిర్మాణాల పనులు చేపడుతాం.

# తెల్ల కాగితాలకు.. పట్టారూపు

పెద్దపల్లి : తెల్ల కాగితాలపై రాసుకున్న భూ కొనుగోలు ఒప్పంద పత్రాలు(సాదాబైనామా) దరఖాస్తులను అధికారులు పరిశీలిస్తున్నారు. 2020 అక్టోబరు 12 నుంచి నవంబర్ 11 వరకు స్వీకరించిన దరఖాస్తుల పరిశీలన కొనసాగుతోంది. ఆ సమయంలో ఆన్‌లైన్‌లో స్వీకరించిన దరఖాస్తులకు మోక్షం లభించనుంది. ఒప్పంద పత్రాల ఆధారంగా క్షేత్రస్థాయిలో అధికారులు పర్యటిస్తున్నారు. 2024 జూన్ 2 కంటే ముందు జరిగిన భూముల లావాదేవీలకు మాత్రమే నిబంధనలు వర్తించనున్నాయి. ఇటీవల భూభారతిలో దరఖాస్తు చేయకున్నా.. గతంలో ఆన్‌లైన్‌లో ఉన్నవాటిని పరిష్కరించనున్నారు.

**35,560 దరఖాస్తులకు కదలిక**

జిల్లా వ్యాప్తంగా 35,560 దరఖాస్తులురాగా.. ఆన్‌లైన్ ఆధారంగా కొనుగోళ్ల వివరాల పత్రాలపై పరిశీలిస్తున్నారు. కాస్తులో ఉన్నాయా?



శిఖం, పరంపోగు భూములా అనే కోణంలో ఆరా తీస్తున్నారు. కోర్టు కేసులు, ఇతర అంశాలపై ముడిపడి ఉందోననే విషయాలపై అధికారులు విచారిస్తున్నారు.

**కొందరి అక్రమ ఎత్తుగడ**

సాదాబైనామాలో భూముల క్రమబద్ధీకరణ చేస్తామని ప్రభుత్వం జీవో జారీ చేయడంతో కొందరు అక్రమ ఎత్తుగడ వేస్తున్నారు. ప్రభుత్వ భూములతోపాటు ఇనాం, వక్ఫ్, అటవీ, శిఖం భూములకు పత్రాలు రాసుకుంటున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన భూదస్త్రాల శుద్ధీకరణలో అప్పటి రెవెన్యూ అధికారులు తమ బంధువులు, కుటుంబసభ్యుల పేరిట ఆన్‌లైన్ చేశారనే విమర్శలు తలెత్తుతున్నాయి. కొత్త చట్టం ప్రకారం ఆర్డీవో ఆధ్వర్యంలో రెవెన్యూ బృందం క్షేత్ర పరిశీలన చేసిన తర్వాత వివాదాలు లేని భూములకు క్రమబద్ధీకరణ చేయనున్నారు. జిల్లాలో ఇప్పటికే చాలాచోట్ల దరఖాస్తుల పరిశీలన తుది దశకు చేరింది. పలు దరఖాస్తులు వివాదాల్లో ఉన్నట్లు విచారణలో తేలుతోంది.

# దోమలతో సమరం.. రోగాల భయం

కావలి : జిల్లాలోని వసతి గృహాలు చెత్తాచెదారంతో దుర్గంధం వెదజల్లుతున్నాయి. దోమలు రాజ్యమేలుతున్నాయి. కొన్నిచోట్ల చుట్టూ మురుగునీరు చేరింది. కొన్నింటిలో మరుగుదొడ్లు వినియోగించేందుకు పనికి రాకుండా ఉన్నాయి. ఈపరిస్థితుల్లో వీటిలో ఉండే బాలలు అస్వస్థతకు గురయ్యే అవకాశం ఉంది. పార్వతీపురం మన్యం జిల్లాలోని కురుపాంలో ఉన్న గిరిజన బాలికల గురుకులంలో అధ్వాన పరిస్థితులతో 100 మందికిపైగా అస్వస్థతకు గురయ్యారు. ఈనేపథ్యంలో జిల్లాలోని వసతిగృహాలపై పరిశీలనాత్మక కథనం.

**మంత్రి చెప్పినా..**

బోగోలు మండలంలోని కప్పరాళ్లతిప్పలో గురుకుల బాలికల పాఠశాల ప్రాంగణంలో భారీ నీటి నిల్వ గుంతతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. గతంలో పాముకాటుతో అస్వస్థతకు గురైన బాలికను పరామర్శించేందుకు మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి వచ్చారు. గుంత పూడ్పిస్తామని చెప్పారు. ఏడాది దాటినా ఈపని చేయలేదు. తాజాగా వచ్చిన ప్రిన్సిపల్ నర్సమ్మ కంచె వేయించారు. నీటి నిల్వతో అంటువ్యాధులకు గురయ్యే ప్రమాదం ఉందని బాలికలు భయపడుతున్నారు. ఇక్కడ 457 మంది విద్యార్థినులు చదువుకుంటున్నారు.

**అపరిశుభ్రమే!**

వింజమూరు బీస్మీ బాలుర వసతిగృహంలో మరుగుదొడ్ల బేసిన్లు దెబ్బతిన్నాయి. గార పట్టి అపరిశుభ్రంగా ఉన్నాయి. పరిసరాలు మరీ దారుణంగా ఉన్నాయి. భవనం శ్లాబ్ పెచ్చులూడింది. ఎస్సీ బాలుర వసతిగృహంలో మరుగుదొడ్ల వద్ద దుర్వాసన వస్తోంది. పరిసరాల్లో వ్యర్థాలతో దుర్గంధం వెదజల్లుతోంది. మరుగుదొడ్డికి తలుపు లేదు. హాస్టల్ ముందు బురద ఉంది. దోమలు ముసురుతున్నాయని విద్యార్థులు వాపోతున్నారు.

**శిథిలం భయం.. భయం**

జలదంకిలో దశాబ్దాల క్రితం నిర్మించిన బీసీ బాలుర వసతి గృహ భవనం శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా ఉంది. ఇందులో 40 మంది విద్యార్థులు ఉన్నారు. గదుల్లో శ్లాబ్ పెచ్చులూడి పడుతుండడంతో పక్కనున్న గదుల్లో పెట్టెలు పెట్టుకొని భయాందోళనల మధ్య



నిద్రిస్తున్నారు. స్నానాల గదులు, మరుగుదొడ్ల తలుపులు విరిగిపోయాయి. చుట్టూ చెట్లు పెరిగాయి. విషపురుగులు వస్తున్నాయని విద్యార్థులు భయపడుతున్నారు.

**పారిశుద్ధ్యం అధ్వానం**

కావలిలోని సాంఘిక సంక్షేమ బాలుర వసతిగృహం-1, 2లో పారిశుద్ధ్యం అధ్వానంగా ఉంది. దోమలతో విద్యార్థులు సమరం చేస్తున్నారు. ఈ రెండింటిలో 49 మంది ఉన్నారు. గతంలో కిటికీలకు మెష్‌లు అమర్చగా అవన్నీ ధ్వంసమయ్యాయి. పక్కనే ఉన్న గిరిజన బాలుర గురుకులంలోనూ ఇదే పరిస్థితి. నిత్యం వచ్చే చెత్తాచెదారాన్ని పారిశుద్ధ్య సిబ్బంది తీసుకెళ్లడం లేదు. దీంతో కుప్పగా పోసి కాల్చేసున్నారు.

**గడ్డితో అవస్థలు**

సీతారామపురంలోని వసతిగృహ ఆవరణ అంతా మట్టి నేల కావడంతో గడ్డి విపరీతంగా పెరిగి దోమలతో విద్యార్థులు నిత్యం అవస్థలు పడుతున్నారు. రాత్రిళ్లు నిద్రపోలేకున్నారు. జ్వరపీడితులయ్యే అవకాశాలున్నాయి. ఎస్సీ వసతిగృహంలోనూ ఇదే పరిస్థితి. ఫ్లోరింగ్ ఏర్పాటు చేస్తే సమస్య తీరుతుందని విద్యార్థులు కోరుతున్నారు.

# కాలువ పూర్తి.. పరిహారం మరిచి!

కొండాపురం : సోమశిల జలాలను రాళ్లపాడుకు తరలించేందుకు ఉత్తర కాలువను విస్తరించాలని నిర్ణయించారు. ఆ మేరకు పదేళ్ల కిందటే చింతలదేవి, ఉప్పులూరు గ్రామాల పరిధిలో రైతుల నుంచి భూములు సేకరించారు. ఇంత వరకు బాగానే ఉన్నా.. ఇప్పటికీ పరిహారం అందక పోవడంతో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

**జాబితా తయారీలోనే...**


కాలువ నిర్మాణంలో ఎంత మంది రైతుల భూములు పోతున్నాయనే వివరాలతో రూపొందించిన జాబితాపైనే నాడు వివాదం ఏర్పడింది. గ్రామంలో లేని, భూములు లేని వారి పేర్లు అందులో వచ్చాయి. దాంతో పట్టా భూమి ఎంత? అసైన్డ్ ఎంత ఉందనే వివరాలు ఇవ్వాలని అధికారులను రైతులు కోరారు. ఆ క్రమంలో మళ్లీ జాబితా తయారు చేసి.. ఉన్నతాధికారులకు అందజేశారు. రైతులు ఎకరాకు రూ. 1.20 లక్షలు, బావులు, చెట్లు తదితరాల వాటికి అదనంగా పరిహారం అందించాలని కోరారు. ఆ పీటముడితో జాప్యం జరిగింది. చివరకు ఎకరాకు రూ. 80వేల చొప్పున నిర్ణయించి.. సుమారు రూ. కోటి కోర్టుకు అందజేసింది.

**170 మంది.. 150 ఎకరాలు..**

2008లో భూములు తీసుకోగా.. నాటి నుంచి కోర్టులో ఉన్న అవార్డు నగదు కోసం రైతులు ఎదురు చూస్తున్నారు. సుమారు 170 మంది 150 ఎకరాలను కోల్పోయారు. మోపాడు కాలువ కింద పండే.. జీవనాధారంగా ఉన్న భూములు కోల్పోయి.. మరోవైపు పరిహారం అందక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అందేలా చూడాలని కోరుతున్నారు.

దీనిపై కొండాపురం తహసీల్దారు సురేష్‌బాబు మాట్లాడుతూ.. రైతుల సమస్య మా దృష్టికి రాలేదు. వివరాలు తెలిపితే.. పరిశీలించి.. ప్రభుత్వానికి నివేదిక పంపుతాం. న్యాయం జరిగేలా చూస్తామన్నారు.

# నదిని మింగిన మొసళ్లు



నంద్యాల : నంద్యాల పట్టణాన్ని ఆనుకుని ప్రవహిస్తున్న కుందూ నది కబ్జా కోరల్లో చిక్కుకుంది. నంద్యాలలోని వీవీ నగర్ వెనుక భాగం నుంచి ప్రారంభమయ్యే కుందూ నది 8 కి.మీల పొడవునా పట్టణం మీదుగానే సాగుతుంది. ఈ నది మార్గంలోని పీవీ నగర్ నుంచి మున్సిపల్ కార్యాలయం వెనుక వరకు 220.39 ఎకరాలు, కర్నూలు బైపాస్ మార్గంలో 110.26 ఎకరాలు, ఉడుమాల్పురం, కాంతినగర్ ప్రాంతాల్లో మరో 109 ఎకరాలకుపైగా పట్టా భూమి ఉంది. కుందూ నదికి, పట్టా భూములకు మధ్యనున్న కుందూ పోరంబోకు క్రమంగా ఆక్రమణలకు గురైంది. పలువురు వ్యక్తులు దీనిని తమ పట్టా భూముల్లో కలిపేసుకున్నారు. మరికొంతమంది నది శిఖం భూమిని ఆక్రమించి చదును చేసి ప్లాట్లు వేశారు.పోరంబోకు భూముల్లో పంటలు కుందూ నది ఆనుకుని 500 ఎకరాలకుపైగా పోరంబోకు భూమి ఉంది. దీనిపై కన్నేసిన అక్రమార్కులు అందినకాడికి ఆక్రమించారు.

మూలసాగరం పరిధిలోని 271, 279-ఏ సర్వే నంబర్లలోని భూమి కబ్జా కోరల్లో చిక్కుకుంది. ఈ భూమికి సంబంధించి నీటి పారుదల శాఖ వద్ద సరైన దస్త్రాలు లేవు.

సర్వే నంబర్ల వారీగా రెవెన్యూ శాఖలో వివరాలు కనిపిస్తున్నప్పటికీ.. పోరంబోకు భూమి ఏమేరకు ఆక్రమణకు గురైందన్న విషయం లేదు. రెండు శాఖల మధ్య సమన్వయ లోపం.. అక్రమార్కులకు వరంగా మారింది.

గతంలో పనిచేసిన కొందరు వీఆర్వోల సాయంతో పలువురు వ్యక్తులు సర్వే నంబరు 291, 271, 279, 504లోని పోరంబోకును ఆక్రమించుకున్నారు. కొన్నింటికి అక్రమంగా పట్టాలు పుట్టించారు.

**100 ఎకరాలకుపైగా స్వాహా**

జిల్లా కేంద్రంలో కుందూ పరివాహక ప్రాంతంలోని పట్టా భూమి 700 ఎకరాలకుపైగా ఉంది.. పోరంబోకు భూమి 183 ఎకరాలుగా ఉంది. ప్రస్తుతం పోరంబోకు భూమి దాదాపు ఆక్రమణలకు గురైంది. కర్నూలు బైపాస్ మార్గంలో ఆక్రమించి మునగ తోట సాగు చేస్తున్నారు. ప్రథమ నంది వెనుక వైపు కొంత భూమిలో మామిడి, సపోట తోటలు సాగవుతున్నాయి.

సర్వే నంబరు 383, 161లో కొంత భూమిని ఆక్రమించి ఇతరులకు విక్రయించారు. సర్వే నంబరు 504, 505లో ఆక్రమణలకు గురైన భూమికి సంబంధించి గత పదేళ్లుగా పెద్దఎత్తున క్రయవిక్రయాలు జరుగుతున్నాయి.

**హద్దులు చెరిపి ఆక్రమణ**

కర్నూలు బైపాస్ రహదారిలోని జగనన్న లేఅవుట్‌లో ప్లాట్లు కేటాయించిన ప్రాంతంలోని కొంత భూమిని పలువురు ఆక్రమించి వరి సాగు చేస్తున్నారు. ఎస్సార్బీసీ కాలనీ మార్గంలో టిడ్కో గృహాల వెనుక వైపు పేదలకు ఇచ్చిన ఇళ్ల స్థలాల్లో అధికారులు రాళ్లు పాతి ప్లాట్లు కేటాయించారు. వీటిని తొలగించి పంటలు వేశారు. ఆక్రమణలు భారీగా పెరిగిపోవడంతో కుందూ నది తరచూ వరద బారిన పడుతోంది. నీటి పారుదల శాఖ అధికారులు గతంలో ఆక్రమిత భూమిపై సర్వే చేయాలని నిర్ణయించినప్పటికీ కార్యరూపం దాల్చలేదు. మరోవైపు ఈ భూముల్లోనే గతంలో రెవెన్యూ శాఖ పట్టాలిచ్చింది. దీని మాటున కొన్ని ప్రాంతాల్లో అక్రమాలు జరిగాయి.

# పేలని.. చూద్దాం



కర్నూలు : జిల్లాలో బాణసంచా వ్యాపారుల అక్రమ నిల్వలు, అనధికార విక్రయాలు ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్నాయి. గతేడాది దీపావళిని పురస్కరించుకుని జిల్లా వ్యాప్తంగా కర్నూలు, ఎమ్మిగనూరు, ఆదోని, పత్తికొండ, ఆలూరులో 130 మందికి బాణసంచా విక్రయించుకునేందుకు కొంత గడువుతో తాత్కాలిక అనుమతులు ఇచ్చారు. అత్యధికంగా కర్నూలు నగరంలో 100 మంది అనుమతులిచ్చారు. కేవలం నాలుగురోజులపాటు మాత్రమే అమ్ముకొని మిగిలిన సరకును తిరిగి హెూల్‌సేల్ దుకాణాలకు అప్పగించాలని ఆంక్షలు విధించారు. వ్యాపారులు ఇవేవీ పట్టించుకోవడం లేదు.

**దృష్టి సారిస్తే మేలు**

ఆయా తయారీదారులు శుభకార్యాలకు, పండగల సందర్భంగా ఆర్డర్ ఇస్తే తయారు చేసి విక్రయిస్తున్నారు. మండల కేంద్రాలు, పల్లెల్లో చట్టవిరుద్ధంగా తయారయ్యే టపాసులే ఎక్కువగా వినియోగిస్తున్నారు. బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాయవరంలో బాణసంచా తయారీ కేంద్రంలో భారీ పేలుడు సంభవించటంతో ఏడుగురు మృతి చెందిన నేపథ్యంలో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. దీపావళి పండగ సమీపిస్తున్న నేపథ్యంలో మూడు ప్రభుత్వశాఖల అధికారులు బాణసంచా అక్రమ నిల్వలపై దృష్టి సారించి ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాల్సిన ఆవశ్యకత ఉంది.

**గుట్టుగా దాచారు**

వ్యాపారులు ప్రొద్దుటూరు, హైదరాబాద్‌లో హెూల్‌సేల్ దుకాణాల నుంచి తెప్పించుకొన్నారు. మిగిలిపోయిన సరకును అక్రమంగా రహస్య ప్రదేశాల్లో నిల్వ ఉంచుకున్నారు. వినాయక చవితి పండగ సందర్భంగా భారీ మొత్తంలో టపాసులను విక్రయించారు. కర్నూలులో వినాయక నిమజ్జన ఊరేగింపులో విగ్రహ నిర్వాహకులు, భక్తులు పెద్దఎత్తున టపాసులు కాల్చారు. అదంతా స్థానిక వ్యాపారులు అక్రమంగా నిల్వ ఉంచుకున్నవే అని సమాచారం.

రెవెన్యూ, పోలీసు, అగ్నిమాపకశాఖల అధికారులు అక్రమ నిల్వలు, విక్రయాలపైన దృష్టి సారించలేదు. ఎక్కడా తనిఖీలు చేపట్టిన దాఖలాలు లేవు. అగ్నిప్రమాదం జరిగితే చూద్దాం అన్నట్లుగా అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలున్నాయి.

# ఇష్టమొచ్చినట్లు వేస్తాం.. ఇష్టారాజ్యంగా అమ్మేస్తాం



చిత్తూరు : వ్యవసాయ భూమిలో లేఅవుట్ వేయాలంటే భూ మార్పిడి రుసుం చెల్లించాలి. తర్వాత ఇంటి స్థలాలుగా మార్చాలంటే 30 అడుగుల రహదారులు, తాగునీరు, విద్యుత్తు సౌకర్యం కల్పించాలి. 10 శాతం కాలువలకు, 10 శాతం రోడ్లకు, 10 శాతం సామాజిక అవసరాలకు వదలాలి. ఇవేమీ లేకుండా లేఅవుట్లు వేసి అమాయకులకు అంటగడుతున్నారు స్థిరాస్తి వ్యాపారులు.

జిల్లాలో చుడా, తుడా, పీకేఎం ఉడా పరిధిలో 86 లేఅవుట్లకే అనుమతులు ఉన్నాయి. 286 అనధికారికంగా ఉన్నట్లు అధికారులు గుర్తించారు. వాటిలో ఇప్పటి వరకు క్రమబద్ధీకరణకు 23 లేఅవుట్లకు మాత్రమే దరఖాస్తు చేశారు. మిగిలిన వాటిపై కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించినా, వారికున్న పలుకుబడితో ముందుకు రావడం లేదు.నిబంధనలకు విరుద్ధంగా వేసిన అక్రమ వెంచర్లతో గత రెండేళ్లలో ప్రభుత్వం రూ.25 కోట్ల ఆదాయం కోల్పోయినట్లు అధికారుల అంచనా. **ఇక్కడే ఎక్కువ...** బైరెడ్డిపల్లి, బంగారుపాళ్యం, గంగవరం, చిత్తూరు, జీడీనెల్లూరు, గుడిపాల, ఐరాల, కార్వేటినగరం, నింద్ర, నగరి, పలమనేరు, పెనుమూరు, పులిచర్ల, పూతలపట్టు, పుంగనూరు, రామకుప్పం, రొంపిచర్ల, శాంతిపురం, సదుం, తవణంపల్లి, వి.కోట, విజయపురం మండలాల్లో అనధికార లేఅవుట్లు ఎక్కువ ఉన్నట్లు అధికారులు గుర్తించారు.

**పంచాయతీల వాటా అందడం లేదు** లేఅవుట్ల క్రమబద్ధీకరణ రుసుంలో పంచాయతీలకు వాటా అందాలి. ఇటీవల కాలంలో ఆ మొత్తం రావడం లేదు. ఇక నుంచి స్వర్ణ పంచాయతీ యాప్ ద్వారా జమ చేసేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అక్రమ లేఅవుట్ల ద్వారా పుర, నగరపాలక సంస్థలతో పాటు గ్రామ పంచాయతీలకూ నష్టం.

# చట్టం.. ఆ అధికారులకు చుట్టం!

నెల్లూరు: 'నవరత్నాలు- పేదలందరికీ ఇళ్లు' పేరుతో వైకాపా ప్రభుత్వంలో జిల్లాలో జరిగిన దోపిడీ అంతా ఇంతా కాదు. మొత్తం 97,465 ఇళ్లు మంజూరు కాగా- ఆప్షన్-3 పేరుతో 28,826ను గుత్తేదారులకు అప్పగించారు. ఇప్పటి వరకు మొత్తంగా 39,985 పూర్తయినట్లు లెక్కలు చెబుతున్నా.. వాటిలో ఆప్షన్-3లో నిర్మించినవి 6,388 మాత్రమే. మిగిలినవి వివిధ దశల్లో ఉండగా- అత్యంత నాసిరకంగా కట్టిన గుత్తేదారులకు.. అప్పటి కొందరు అధికారులు సహకరించారు. లబ్ధిదారులకు కేటాయించిన స్టీలు, సిమెంట్, ఇసుక పక్కదారి పట్టించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే దీనిపై విచారణ చేయించగా.. రూ. 120 కోట్ల అక్రమాలు జరిగినట్లు గుర్తించారు. ఆ తర్వాత అంత మొత్తం జరిగలేదని చెప్పడమూ విమర్శలకు తావిచ్చింది. లబ్ధిదారులకు ఇవ్వాల్సిన సామగ్రిని బయటకు పంపినట్లు తేలినా.. నాణ్యతకు తిలోదకాలు ఇచ్చినా.. కనీసం చర్యలు తీసుకోలేదు. ఎక్కడైనా ప్రజాప్రతినిధులు గట్టిగా అడిగితే.. ఏదో నామమాత్రపు కారణం చూపి సస్పెండ్ చేస్తుండటం గమనార్హం.

**దుష్టాంతాలివిగో...**

నెల్లూరు నగరంలో కీలక స్థాయిలో పనిచేస్తున్న ఓ అధికారికి.. వెంకటాచలంలో అవే బాధ్యతలు అప్పగించడంతో పాటు జిల్లా కార్యాలయంలోనూ మరో పోస్టు కేటాయించారు. ఈయనపై పెద్దఎత్తున అవినీతి ఆరోపణలు ఉండటం గమనార్హం. వరిగొండలో నాసిరకం ఇళ్లు నిర్మించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని కూటమి నాయకులు పట్టుబడితే.. కేవలం 190 సిమెంట్ బస్తాలు గడ్డ కట్టినట్లు చూపి సస్పెండ్ చేశారు. ఈ వ్యవహారంలో ఇద్దరు ఏఈల పాత్ర ఉన్నట్లు నివేదికలో పేర్కొన్నా.. ఒకరిపై చర్యలు తీసుకుని.. మరొక ఏఈపై ఎండీకి లేఖ రాయడంతో సరిపెట్టారు.

నాడు కావలిలో కీలకంగా వ్యవహరించిన మండల ఇన్‌ఛార్జి(అవుట్ సోర్సింగ్) అర్బన్‌లో నిర్మాణాల నాణ్యతను గాలికి వదిలేయడంలో



కీలకంగా వ్యవహరించారు. ఆ క్రమంలో 5,950 బస్తాల సిమెంట్, 27 టన్నుల స్టీలు కనిపించకుండా పోయినా.. రెండేళ్లుగా చర్యలు తీసుకోలేదు. వెంకటాచలంలో ఓ అధికారిపై భారీగా ఆరోపణలు రావడంతో.. సస్పెండ్ చేశారు. ఆ స్థానంలో ఆయన కుమార్తెకే బాధ్యతలు ఇవ్వడం గృహ నిర్మాణశాఖ అధికారులకే చెల్లింది.

దగదర్తిలో ఉన్న ఓ అవుట్ సోర్సింగ్ సిబ్బందిపై పెద్దఎత్తున ఆరోపణలు ఉండగా.. చర్యలు తీసుకోకపోగా.. ఆయనకే మూడు మండలాల బాధ్యతలు అప్పగించారు.

గృహ నిర్మాణశాఖలో ఇంటి దొంగలపై చర్యలకు ఉన్నతాధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. అలుసో.. అధికారం అండగా ఉందన్న ధీమానో.. గత అక్రమాలను కప్పి పుచ్చుకోవడంతో పాటు కొత్త దోపిడీకి తెరదీస్తున్నారు. ఇప్పటి వరకు 8 మందిపై చర్యలు తీసుకున్నా.. వారిపై నామమాత్రపు కారణాలు చూపడం.. కొందరిపై అసలు చర్యలకు ఉపక్రమించకపోవడం విమర్శలకు తావిస్తోంది.

# భారీ విస్ఫోటనాలు.. భయాందోళనలు!

ఆనందపురం : శుభకార్యాలు, పండగలు, రాజకీయ నాయకుల స్వాగతోత్సవాలకు బాణసంచా వినియోగం విరివిగా పెరిగింది. దీంతో కొంతమంది అనుమతులు లేకుండా విచ్చలవిడిగా మందుగుం డు సామగ్రి తయారీని కుటీర పరిశ్రమగా మార్చుకుంటున్నారు. పైగా విధివిధానాలను పాటించకపోవడంతో భారీ విస్ఫోటనం జరిగి భయానక పరిస్థితులు సంభవిస్తున్నాయి. అధిక సంఖ్యలో ప్రాణాలు కోల్పోతున్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాయవరం లోని బాణసంచా తయారీ కేంద్రంలో భారీ పేలుడు సంభవించి ఎనిమిదిమంది మృతి చెందిన ఘటన కలచివేసింది. నగరంలో పలుచోట్ల అనుమతులు లేకుండా ఇష్టానుసారంగా బాణసంచా తయారీ కేంద్రాలు కొనసాగుతుండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు.

**ఎక్కడికక్కడ ముడిసరకు లభ్యం:** బాణసంచా తయారీకి వినియోగించే ముడిసరకు గన్ పౌడర్, కోల్ పౌడర్, సల్ఫర్, ఐరన్ కోర్, సురేకారం ఎక్కడికక్కడ దుకాణాల్లో దొరుకుతోంది. దీంతో పలువురు వాటిని కొనుగోలు చేసి స్వయంగా తయారీకి సిద్ధమవుతున్నారు. ఇటీవల విజయదశమి వేడుకల సందర్భంగా భీమిలి నియోజకవర్గం వలందపే ట గ్రామంలో మందుగుండు సామగ్రి తయారీకి ప్రయత్నించగా రాత్రివేళ భారీ పేలుడు సంభవించింది. ఈ ఘటనలో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. ఇప్పటికీ వీరు చికిత్స పొందుతున్నారు.



**ఇటీవల పోలీసులు దాడులు చేయగా..:** ఆనందపురం, పద్మనాభం, భీమిలి, భోగాపురం మండలాల్లో బాణసంచా తయారీ కేంద్రాలపై పోలీసులు దాడులు చేసి భారీ మొత్తంలో మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు.

ఆనందపురం మండలంలో శొంఠ్యాం, పెద్దిపాలెం, వెల్లంకి, నేలేర్తు, దిబ్బడిపాలెం గ్రామాల్లో విశాఖ టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు చేయగా ఆరుగురు వ్యక్తులను అరెస్టు చేసి కోర్టులో ప్రవేశపెట్టారు. ఇద్దరికి రిమాండ్ విధించారు.భీమిలి మండలంలో వలందపేటకు చెందిన ముగ్గురిపై.. అలాగే పద్మనాభం మండలంలో అర్చకులవానిపాలెం వద్ద ఇద్దరిపై కేసు నమోదు చేశారు. ఇప్పటి వరకు ఆనందపురం మండలంలోని ముచ్చర్ల, బొడ్డపాలెం, గిడిజాల ప్రాంతాల్లో బాణసంచా తయారీ ప్రమాదంలో ఐదుగురు మృతి చెందారు.భీమిలి, పద్మనాభం, రెడ్డిపల్లి, పాండ్రంగి, కొవ్వాడ, కురపిల్లి, నియోజకవర్గ సరిహద్దు ప్రాంతాలు కవులవాడ, తుడాం, బసవపాలెం గ్రామాల్లోనూ తయారీ కేంద్రాలు ఉన్నట్లు సమాచారం. మరోవైపు పోలీసులు హెచ్చరిస్తున్నా ఏదొక చోట బాణసంచా తయారీ కేంద్రాలు దర్శనమివ్వడంతో భయానక పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ప్రజలు సైతం అప్రమత్తత కాకుంటే భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరిస్తున్నారు. చుట్టుపక్కల ప్రాంతాల్లో రహస్యంగా పేలుడు పదార్థాలను తయారు చేసినట్లయితే వెంటనే పోలీసులకు సమాచారమివ్వాలని సూచిస్తున్నారు.

# చెట్లుంటే దోమలు కుడతాయయంట!

పరిగి : విద్యార్థులకు దోమలు కుడుతున్నాయనే కారణంతో మండలపరిధిలోని కొడిగెనహళ్లి అంధుల ఆశ్రమ పాఠశాలలో పచ్చని చెట్లను ప్రిన్సిపల్ నరికేయించారు. దీనిపై పర్యావరణ ప్రేమికులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. నందమూరి తారకరామారావు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో కొడిగెనహళ్లిలో అంధుల ఆశ్రమ పాఠశాలను 1987 ఏర్పాటు చేశారు. పాఠశాల ప్రారంభంలో పలువురు దాతలు ఇచ్చిన వందలాది మొక్కలను నాటారు. అవి నేడు మహావృక్షాలై పాఠశాలలో ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. పాఠశాల



ఆవరణలో ఐదు వందలకు పైబడి చెట్లు ఉన్నాయి. ఇటీవల దసరా సెలవుల్లో విద్యార్థులు ఉంటున్న వసతిగృహం సమీపం, ఆవరణలో ఉన్న టేకు, నీలగిరి, కానుగ చెట్లను ప్రిన్సిపల్ కొట్టి వేయించారు. 40 ఏళ్ల పాటు నుంచి ఉంటున్న చెట్లను ఒక చిన్న కారణంతో వృక్షాలను తొలగించడంపై ఫిర్యాదులు వెళ్లడంతో పెనుకొండ అటవీ శాఖ అధికారులు పరిశీలించి వెళ్లారు. దీనిపై ప్రిన్సిపల్ రాజేశ్వరిని వివరణ కోరగా దోమలు కుడుతున్నాయనే కారణంతో చెట్లను తొలగించామని ఆమె నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారు. తొలగించిన చెట్లను ఎక్కడికి తరలించిందీ తెలియలేదు. దీనిపై పూర్తి విచారణ చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

# త్రిపురాంతకానికి మహర్దశ వచ్చేనా?

త్రిపురాంతకం : రాష్ట్రంలోని 27 ప్రముఖ ఆలయాలతో పాటు త్రిపురాంతకం క్షేత్రం అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రకటించడంపై భక్తుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. చారిత్రక నేపథ్యమున్న ప్రసిద్ధిగాంచిన ఆలయాల్లో త్రిపురాంతకం ఒకటి. పదో శతాబ్దం నుంచి చోడరాజులు, చోళులు, కాకతీయులు, రెడ్డి రాజులు ఆలయాలను పోషించారు. రాణి రుద్రమదేవి ఇక్కడ నుంచి పరిపాలన సాగించినట్లు చరిత్రకారులు చెబుతున్నారు. ప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న త్రిపురాంతకం క్షేత్రం అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడ వేసిన చందంగా ఉంది. పాలకులు, అధికారులు మారుతున్నా భక్తులకు కనీస వసతుల కల్పనకు నోచుకోకపోవడంపై సర్వత్రా అసంతృప్తి వ్యక్తమవుతోంది. 2014లో తెదేపా ప్రభుత్వ హయాంలో శిద్దా రాఘవరావు మంత్రిగా ఉన్నప్పుడు గ్రామం నుంచి ఆలయాల వరకు రహదారులు నిర్మించడంతో పాటు ఒకరిద్దరి ఈవోల హయాంలో భక్తుల ద్వారా ఆలయాల్లో కొంత మేర సౌకర్యాలు కల్పించడం తప్ప భక్తులు ఒక రాత్రి ఉండాలంటే కనీస వసతి లేదు. ఏడాదికి రూ.కోటి ఆదాయం లభిస్తున్నా మౌలిక వసతులు లేకపోవడంపై భక్తులు పెదవి విరుస్తున్నారు. త్రిపురాంతకం క్షేత్రానికి నాలుగు వైపులా రాజగోపురాల్లో దక్షిణం వైపు గోపుర నిర్మాణం 14 ఏళ్ల నుంచి సాగుతోంది. ఉత్తర, పడమర రాజగోపురాలు శిథిలావస్థలో ఉన్నాయి.

శాసనాలకు ఖిల్లా త్రిపురాంతకం క్షేత్రమని చెబుతారు. దాదాపు 100 వరకు శాసనాలుండడం విశేషం. త్రిపురాంతకేశ్వరస్వామి ఆలయ ముఖద్వారం సమీపంలో పడిపోయిన గోళకీ మఠాన్ని కాకతీయుల కాలంలో గణపతి దేవుడు గురువు విశ్వేశ్వర శివదేశికాచార్యులు నిర్మించగా ప్రస్తుతం శిథిలావస్థలో ఉంది. రుద్రమదేవి యువరాణిగా ఉన్నప్పుడు మూడు సార్లు త్రిపురాంతకంలో పర్యటించినట్లు చరిత్రకారులు చెబుతున్నారు. కాకతీయులు త్రిపురాంతకాన్ని తొలి పరిపాలనా కేంద్రంగా వరంగల్లు రెండో కేంద్రంగా పరిపాలన సాగించినట్లు త్రిపురాంతకానికి చెందిన ప్రముఖ చారిత్ర పరిశోధకులు తురిమెళ్ల శ్రీనివాస ప్రసాద్ పరిశోధనలో తేలినట్లు తెలంగాణ ప్రభుత్వం కూడా ధ్రువీకరించింది. అమ్మదేవుడు, రుద్రమదేవి మధ్య ఇక్కడే యుద్ధం జరిగిందని కథనం. రుద్రమదేవి విగ్రహం త్రిపురాంతకంలో బయటపడింది. ఈ క్రమంలో ఆలయంలోని శాసనాలను పురావస్తుశాఖ అధికారులు రక్షిస్తే భావితరాలకు ఆనవాళ్లుగా నిలుస్తాయి. కూతవేటు దూరంలో సాగర్ కాలువ నుంచి పైపులైను వేసి త్రిపురాంతకం చెరువును నీటితో నింపి పర్యాటక ప్రదేశంగా తీర్చిదిద్దాలని భక్తులు కోరుతున్నారు. అభివృద్ధికి ప్రణాళికలు పంపాం: త్రిపురాంతకేశ్వరస్వామి, బాలాత్రిపురసుందరీదేవి ఆలయాల అభివృద్ధికి రూ.2.30 కోట్లతో ప్రతిపాదనలు పంపించాం,. నిధులు మంజూరైన వెంటనే పనులు ప్రారంభిస్తాం. డి.అనిల్‌కుమార్, ఈవో, త్రిపురాంతకం దేవస్థానం

# దాచేందుకే కొంటున్నారు!

మొగల్తూరు : బులియన్ మార్కెట్లో ముడి వెండి, బంగారానికి భారీగా డిమాండ్ ఏర్పడింది. జిల్లాలో గతంలో సుమారు రోజుకు రూ.2 కోట్లు పైగా వ్యాపారం జరిగితే వాటిలో ఆభరణాలు 80 శాతం, ముడి బంగారం, వెండి 20 శాతం ఉండేది. ప్రస్తుతం ఆ విధానం తారుమారైందని వ్యాపారులు చెబుతున్నారు. ప్రస్తుతం జిల్లాలో రూ.2.50 కోట్ల నుంచి రూ.3 కోట్ల వరకూ కొనుగోలు జరుగుతోంది. అందులో ముడి బంగారం, వెండి సుమారు 80 శాతం పైడి కొనుగోలు చేస్తున్నారు.

వారం తరువాత సరకు అప్పగింత.. ధరల వ్యత్యాసం, నష్టాల భయంతో వ్యాపారులు ముడి సరకు అధిక మొత్తంలో నిల్వ ఉంచడం లేదు. వీటి నిల్వలు బులియన్ డీలర్ల వద్దే ఉంటుంది. జిల్లాలో బులియన్ డీలర్లు లేరు. దీని ప్రభావంతో వ్యాపారులు కొనుగోలుదారుల నుంచి అడ్వాన్సు తీసుకున్న వారం రోజుల అనంతరం ముడి బంగారం, వెండి అప్పగిస్తున్నారు. వంద గ్రాముల మేలిమి బంగారం (24 క్యారెట్లు) పది రోజుల కిందట రూ.11.80 లక్షలకు విక్రయించారు. గురువారం మధ్యాహ్నానికి అది రూ.12.85 లక్షలకు పెరిగి సాయంత్రానికి రూ.12.60 లక్షలకు తగ్గింది. ఆభరణాల తయారీ బంగారం రూ.10.90 లక్షల నుంచి రూ.11.80 లక్షలకు పెరిగి రూ.11.65 లక్షలకు దిగివచ్చింది. కిలో వెండి రూ.1,39,600 నుంచి రూ.1.80 లక్షలకు.. అక్కడ నుంచి రూ.1.67 లక్షలకు తగ్గింది. నిబంధనల అమలులో భాగంగా కొనుగోలుదారుల నుంచి పాన్‌కార్డు, ఆధార్ కార్డు తీసుకుని వాటి వివరాలు నమోదు చేసిన అనంతరం నగదు ఆర్టీజీఎస్ విధానంలో బదిలీ చేయించుకుని వారం, పది రోజుల కొనుగోలుదారులకు సరఫరా చేస్తున్నామని బులియన్ వ్యాపారుల సంఘ నరసాపురం శాఖ అధ్యక్షుడు వినోద్‌కుమార్ జైన్ తెలిపారు.

# ‘పెన్నా’ను పంచేసుకున్నారు!



అనంతపురం: పామిడికి చెందిన సోదరులు పెన్నా నదిని సొంత ఆస్తిలా పంచేసుకున్నారు. ఏటి గట్టున ఉన్న తమ పొలాలకు సమాంతరంగా నదిని ఆక్రమించి ఇటుకల వ్యాపారం సాగిస్తున్నారు. భారీ షెడ్లు నిర్మించి చిన్నపాటి పరిశ్రమ నడిపిస్తున్నారు. ట్రాక్టర్లలో టన్నుల కొద్దీ మట్టిని తీసుకొచ్చి నది గర్భంలో ఇటుకలు తయారు చేస్తున్నారు. నిరంతరం జేసీబీలు, ట్రాక్టర్లు పని చేస్తూనే ఉన్నాయి. హైదరాబాద్–బెంగళూరు జాతీయ రహదారికి ఆనుకుని ఇదంతా జరుగుతుండటం గమనార్హం. వైకాపా ప్రభుత్వంలో మొదలైన కబ్జాపర్వం ఇప్పటికీ కొనసాగుతోంది. అధికార పార్టీ స్థానిక నాయకులు కబ్జాదారులకు సహకరిస్తుండటంతో అధికారులు సైతం అటువైపు కన్నెత్తి చూడటం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

**ఇష్టారాజ్యంగా..**

సోదరుల్లో ఒకరు ప్రతిపక్ష పార్టీ కాగా మరొకరు అధికార పార్టీలో కొనసాగుతున్నారు. వారికి పెన్నానదిని ఆనుకుని పొలాలు ఉన్నాయి. రాజకీయ పార్టీల అండతో నదిని ఆక్రమించి ఇటుక బట్టీలు ఏర్పాటు చేశారు. 15 ఎకరాల మేర కబ్జాచేసి శాశ్వతంగా షెడ్లు, ఇతర నిర్మాణాలు చేపట్టారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత స్థానిక ప్రజాప్రతినిధి అండతో మరింత రెచ్చిపోతున్నారు. ఇటుక బట్టీలను విస్తరించి వ్యాపారాన్ని పెంచుకున్నారు. సోదరుల కనుసన్నల్లోనే ట్రాక్టర్ల ద్వారా నిరంతరం ఇసుక అక్రమ రవాణా సాగుతోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎవరు అధికారంలో ఉన్నా తమ జోలికి రాకుండా ఒక్కొక్కరు ఒక పార్టీలో కొనసాగుతూ అక్రమంగా సొమ్ము చేసుకుంటున్నారు.

**సర్వే చేసి వదిలేశారు** పామిడి సమీపంలో పెన్నానది ఆక్రమణలపై ఫిర్యాదులు రావడంతో గతేడాది కలెక్టర్ ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు సర్వే నిర్వహించారు. వందలాది ఎకరాల్లో నది కబ్జాకు గురైనట్లు తేల్చారు. ఆక్రమణలను తొలగిస్తామని స్పష్టం చేసిన అధికారులు తర్వాత పట్టించుకోలేదు. రాజకీయ ఒత్తిళ్ల కారణంగానే స్థానిక అధికారులు చర్యలు తీసుకోలేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నది ఆక్రమణలపై జిల్లా కలెక్టర్ ఆనంద్ వివరణ కోరగా.. విషయం తన దృష్టికి రాలేదన్నారు. తహసీల్దార్ ద్వారా విచారణ జరిపించి తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

# పసిప్రాయంలోనే ప్రసవ వేదనలా?



అనంతపురం : గడిచిన ఐదు నెలల్లో గుమ్మఘట్ట పీహెచ్‌సీ పరిధిలో 583 సాధారణ ప్రసవాలు జరగ్గా ఇందులో 124 టీనేజీ (18 ఏళ్లలోపు) ప్రసవాలే. అవులుగట్ట పీహెచ్‌సీ పరిధిలో 495 సాధారణ ప్రసవాల్లో 87.., ఎర్రగుంట పీహెచ్‌సీ పరిధిలో 421 ప్రసవాల్లో 79.., కురుగుంట పీహెచ్‌సీ పరిధిలో 1246 ప్రసవాల్లో 122 టీనేజ్ ప్రసవాలున్నాయంటే ఎంతమంది పరిణతి లేని వయసులోనే ప్రసవవేదన భరిస్తున్నారో అర్థం అవుతోంది. కొన్ని పీహెచ్‌సీల పరిధిలో ఆందోళనకర రీతిలో 18 ఏళ్లలోపే ప్రసవాలు జరుగుతున్నా అధికారులు మొద్దు నిద్ర వీడటం లేదు.

కొంతమంది తల్లిదండ్రులు బాల్యవివాహాలు చేస్తుండటంతో తీవ్ర ఇబ్బందులు పడాల్సిన పరిస్థితులు వస్తున్నాయి. బాలికలకు ప్రసవం తరువాత ఆరోగ్య సమస్యలు చుట్టుముడుతుండటం ఆందోళన కల్గించే అంశం. బాల్య వివాహాలను అరికట్టేందుకు క్షేత్రస్థాయిలో పలు కార్యక్రమాలున్నా ఆశించిన ఫలితాలు రాలేదు. ఐసీడీఎస్ విభాగం మిగిలిన ప్రభుత్వశాఖలతో సమన్వయంతో పనిచేస్తున్నా ఆశించిన పురోగతి లేదు.

**అర్థం చేసుకునేవారేరీ?**

ప్రస్తుతం ఆడపిల్లలు అన్ని రంగాల్లో రాణించేందుకు ప్రభుత్వం ఎన్నో అవకాశాలు కల్పిస్తోంది. అయినప్పటికీ కొంతమంది తల్లిదండ్రుల్లో మార్పు రావడం లేదు. చిన్న వయసులో పెళ్లిల్లు చేయటం ద్వారా ప్రసవ సమయంలో ఇబ్బందిపడి తల్లి లేదా పురిటి బిడ్డ చనిపోయే ఆస్కారాలు ఎక్కువ. ప్రసవ సమయంలో పరిస్థితి విషమిస్తే ఇద్దరూ చనిపోయే పరిస్థితులూ ఉంటాయి. కొంతమంది బాలికలు ఆకర్షణకు గురై తప్పటడుగులు వేసి గర్భం దాలుస్తుండటం కూడా ఆందోళనకర అంశమే. ఆర్ఎంపీలు, వైద్యులు కాసుల కోసం కక్కుర్తి పడి ఇలాంటి కేసుల్లో అబార్షన్లు చేస్తూ ప్రాణాలను గాల్లో కలిపేస్తున్నారు.

**సమన్వయంతో పనిచేస్తాం..డాక్టర్ ఈ.బి.దేవి, జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారిణి, అనంతపురం**

వైద్య ఆరోగ్యశాఖ, ఐసీడీఎస్, ఎన్‌జీవో సంస్థలు కలిసి పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసి తెలియజేస్తున్నాం. టీనేజీ ప్రసవాలు అధికంగా జరిగిన ప్రాంతాలను గుర్తించి అక్కడ తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నాం. అనధికారికంగా ఎక్కడైనా టీనేజీ పిల్లలకు ప్రసవాలు చేసినట్లు ఫిర్యాదులు అందటం లేదు. నిబంధనలు అతిక్రమించి ఎవరైనా ప్రసవాలు చేస్తే బాధ్యులపై కచ్చితంగా చర్యలు తీసుకుంటాం.

# బాటల్లో మలుపు.. బతుకుల్లో కుదుపు



చిత్తూరు : జిల్లాలో మొగిలిఘాట్, తిరుపతి జిల్లా చంద్రగిరి మండలం భాకరాపేట కనుమ రహదారి ప్రమాదాల నిలయంగా మారింది. తరచూ ఏదో ఒకచోట ప్రమాదాలు జరుగుతున్నా నియంత్రణ చర్యలు ఆశించిన ఫలితాలు ఇవ్వడం లేదు. 2019లో రెండు వరుసలుగా ఉన్న పాత మొగిలి ఘాట్ రోడ్డును 4 వరుసలుగా మార్చారు. అయినా ప్రమాదాలకు అడ్డుకట్టపడలేదు. తరచూ జరుగుతూనే ఉన్నాయి. దీనిపై అధ్యయనం చేయడానికి కేంద్రం ఎన్‌హెచ్ఐటీ విభాగానికి చెందిన ఒక బృందాన్ని నియమించింది. మలుపులు తొలగించి నేరుగా రోడ్డు వేయాలని సూచించారు. కొందరైతే ఈ రోడ్డు డిజైన్‌లోనే లోపముందని తేల్చేశారు.

**ప్రణాళికలు చేసినా..** తిరుపతి, అనంతపురం జాతీయ రహదారిలో తిరుపతి పీలేరు మార్గమధ్యలోని కల్యాణి డ్యాం నుంచి భాకరాపేట వరకు సుమారు 12 కిలోమీటర్లు రహదారి ఉంది. ఈ మార్గంలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నా నివారణ చర్యలు పూర్తిస్థాయిలో తీసుకోవడం లేదు.

ప్రమాదాల నివారణకు ఆర్ అండ్ బీ, జాతీయ రహదారి అధికారుల బృందాలు ప్రణాళికలు రూపొందించి అమలు చేసినా పూర్తి స్థాయిలో ప్రమాదాలకు అడ్డుకట్ట వేయలేకపోయారు.

వేగంగా వాహనాలు నడపడం, మార్గంపై అవగాహన లేకపోవడం, మద్యం మత్తు తదితర కారణాలతో ప్రమాదాలు జరుగుతున్నాయి. దొనకోటి గంగమ్మ మలుపు వద్ద ఉన్న లోయలో మూడు లారీలు, దెయ్యాలకోన వద్ద లోయలో ఓ కారు పడిపోయింది. వాటిని బయటకు తీయలేక అలాగే వదిలేశారు.

**అధికారులు ఏమన్నారంటే..?**

పనులు చేయాలంటే అటవీ శాఖ అనుమతులు కావాలి. అడవి జంతువుల స్వేచ్ఛకు భంగం కలగకుండా, అటవీ సంరక్షణ చట్టాలకు లోబడి ప్రమాదాలు జరగకుండా రహదారి నిర్మించాలని ఎన్‌హెచ్ఏఐ అధికారులు తెలిపారు.

**తీసుకున్న చర్యలు**

కి.మీ. దూరానికి స్పీడు బ్రేకర్లు ఏర్పాటు చేశారు
రోడ్డుమధ్యలోసౌర దీపాలు
రోడ్డుపొడవునా బ్లింకర్లు
ఇరువైపులా ఇనుప బీమ్స్‌లతో బారికేడ్లు
ప్రతి 10 అడుగులకు ఎల్లో రేడియం స్ట్రిప్స్

**ఎక్స్‌ప్రెస్ హైవేతో అడ్డుకట్ట**

డిజైన్ రూపొందించడంలో పొరపాటు ఉన్న విషయాన్ని గుర్తించాం. ఇప్పుడు దాన్ని మార్చడం అధిక శ్రమ, ఖర్చుతో కూడుకున్నది. దీనికి పక్కనే ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణం వేగంగా సాగుతోంది. అది పూర్తయితే ప్రమాదాలు తగ్గుతాయని అనుకుంటున్నాం. ఇప్పటికే చాలా జాగ్రత్తలు తీసుకున్నాం.

వెంకటేశ్వర్లు, పీడీ, జాతీయ రహదారులశాఖ తిరుపతి విభాగం

ఎక్కడ: కల్యాణి డ్యాం నుంచి అటవీ శాఖ నర్సరీ వరకు
మలుపులు 08
ప్రమాదాల సంఖ్య 08
మృతులు 03
క్షతగాత్రులు 08మంది
ఏడాదిలో జరిగిన ప్రమాదాలు
ప్రమాదాలు 110
మృతులు 18
ఘాట్ ఎక్కడ: చెన్నై, బెంగళూరు మార్గం
దూరం: 01 కి.మీ. మొగిలి నుంచి పలమనేరు వైపు
మలుపులు: 02 (దొరచెరువు, మొగిలి)
ప్రమాదాలకు గురవుతున్న వాహనాల్లో కంటైనర్ల సంఖ్యే ఎక్కువ
ప్రమాదాల్లో నష్టం అంచనా: సుమారు రూ.20 కోట్లు
నివారణకు చేసిన ఖర్చు: రూ.7 కోట్లు (గతేడాది సెప్టెంబరు నుంచి ఇప్పటివరకు)

# మేం తగ్గం.. తగ్గించం!

ఏలూరు : ఏలూరు బోధనాసుపత్రికి సమీపంగా ఉండే ఓ హోల్‌సేల్ దుకాణంలో అసలు బిల్లు ఇవ్వటం లేదు. బిల్లు అడిగిన వారికి ట్రేడింగ్‌పై ఇచ్చే డిస్కౌంట్ ఇవ్వలేమని చెప్పి దాటవేస్తున్నారు. నగరంలో ఎక్కడా లభ్యం కాని మందులన్నీ ఇక్కడ ఉంటాయి. ఈ కీలక షాపులోనే బిల్లులు ఇవ్వటం లేదు. ఆర్ఆర్‌పేటలోని ఓ ప్రధాన ఆసుపత్రికి అనుబంధంగా ఉన్న ఔషధ దుకాణంలో ఎన్యూరిజం కిట్లు తీసుకుంటే వారికి ఏమాత్రం పన్ను తగ్గించ లేదు.

జంగారెడ్డిగూడెం– ఏలూరు ప్రధాన రహదారిలో ఓ మందుల దుకాణంలో బిల్లు అడిగితే తెల్లపేపరు మీద రాసిచ్చారు. అందులో కనీసం మందుల వివరాలు రాయలేదు.

అకస్మాత్తుగా కాళ్లు, చేతులు చచ్చుబడిపోయి స్ట్రోక్‌కు గురైనవారు, గుండెపోటు వచ్చినవారికి, పాము కాటుకు గురైనవారికి, ఏదైనా రహదారి ప్రమాదంలో చిక్కుకుని రక్తనాళాలు చిట్లిపోయినవారికి అత్యవసర మందులిస్తారు. వీటిపై తాజాగా కేంద్రం జీఎస్టీ బాగా తగ్గించింది. అంతేకాదు కొన్ని సర్జికల్స్ సామగ్రిపై పన్నులు తగ్గాయి. ఈ తగ్గిన జీఎస్టీ ఫలాలు ప్రజలకు అందటం లేదు.

జీఎస్టీ 2.0 అమల్లోకి వచ్చి పక్షం రోజులు గడిచిపోయినా ఉమ్మడి పశ్చిమగోదావరి వ్యాప్తంగా చాలా ప్రైవేటు ఆసుపత్రులు, మందుల దుకాణాల్లో కంప్యూటర్ బిల్లులే ఇవ్వటం లేదు. అదేమని ప్రశ్నిస్తే మారిన శ్లాబ్‌ల ప్రకారం సాఫ్ట్‌వేర్ తయారుచేయిస్తున్నామని, కంప్యూటర్



పనిచేయటం లేదని సాకులు చెబుతూ ప్రజలపై యథావిధిగా పన్నుల భారం మోపుతున్నారు.

ఔషధ దుకాణాల్లో రసీదులు ఇవ్వటం లేదని తమకు ఏ మందుపై ఎంత పన్ను తగ్గిందో తెలియటం లేదని చాలా మంది ఏలూరు జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. హై యాంటీబయాటిక్స్, స్టంట్లు, హీమో స్టాట్స్, కొన్ని రకాల ఇంప్లాంట్స్, ఎన్యూరిజమ్ కిట్లు, కొన్ని కాయిల్స్ వంటి సర్జికల్స్‌పై పన్ను శాతం తగ్గటంతో ఆమేరకు ఆసుపత్రుల్లో బిల్లులు తగ్గుతాయని ఆశిస్తున్న వారికి చివరకు నిరాశే మిగులుతోంది. గతనెల 22 నుంచి జీఎస్టీ 2.0 అమల్లోకి వచ్చింది. ఇంతకు ముందు ఔషధాలు, సర్జికల్స్‌పై 12, 18 శాతం ఉండే పన్ను 5 శాతానికి తగ్గించారు.

**అప్రమత్తం చేశాం :** ‘తగ్గించిన పన్ను రేట్లు అమలయ్యేలా చర్యలు తీసుకుంటాం. ఫార్మసీ, ల్యాబ్ అసోసియేషన్ ముఖ్య నాయకులను పిలిచి ఇకపై ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలని, కచ్చితంగా బిల్లులు ఇవ్వాలని ఆదేశించాం. రూ.200కు పైబడి మందులు కొనుగోలు చేస్తే కచ్చితంగా బిల్లు అడిగి తీసుకోవాలి’ అని ఎస్‌జీఎస్టీ సంయుక్త కమిషనర్ నాగార్జునరావు తెలిపారు.

# పుస్తకాలు.. విస్తుబోతున్నాయ్!

పాలకొల్లు : మండల కేంద్రమైన యలమంచిలిలో శాఖా గ్రంథాలయం ఇది. ఏడాది కిందట ఇక్కడి లైబ్రేరియన్‌ను డిప్యుటేషన్‌పై భీమవరం పట్టణానికి పంపారు. అప్పటి నుంచి పుస్తకాలు, నవలలు ఉండే గది మూతపడింది. వాటిలో పుస్తకాల ఎలా ఉన్నాయో తెలియని పరిస్థితి. ఏటా నవంబరులో నిర్వహించే గ్రంథాలయ వారోత్సవాలను సైతం నిర్వహించడం మానేశారంటే ఇక్కడి దుస్థితిని అర్థం చేసుకోవచ్చు. మొగలూర్తులో శాఖా గ్రంథాలయానిది మరో సమస్య. ఇక్కడ గ్రంథాలయాధికారి ఎప్పుడొస్తారో.. ఎప్పుడు వెళ్తారో తెలియదు.

యువతకు విజ్ఞానమందించే ఆలయాలుగా భావించే శాఖా గ్రంథాలయాలు క్రమంగా ఉనికి కోల్పోతున్నాయి. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే యువత నుంచి నవలలు, ఆధ్యాత్మిక గ్రంథాలు చదివేవారి



వరకు సంబంధిత పుస్తకాలు అందుబాటులో లేక ఇబ్బంది పడుతున్నారు. ఉదయం 3 గంటలు, సాయంత్రం 3 గంటల పాటు కూడా గ్రంథాలయాలను తెరవకపోవడంతో పాఠకులు వాటికి క్రమంగా దూరమవుతున్నారు.

**సగం మంది కూడా లేరు..** ఉమ్మడి జిల్లా పరిధిలో 74 శాఖా గ్రంథాలయాలకు పర్యవేక్షణాధికారులు 30 మంది కూడా లేరు. జిల్లా కేంద్రమైన భీమవరంతో పాటు కొన్ని పట్టణాల్లో సరిపడా సిబ్బంది లేక గ్రామీణ ప్రాంతాల్లో లైబ్రేరియన్లను డిప్యుటేషన్‌పై నియమిస్తున్నారు. పెనుగొండలో గ్రంథాలయానికి పెరవలి నుంచి లైబ్రేరియన్ ప్రతి మంగళవారం వచ్చి వెళ్తున్నారు. మిగిలిన రోజుల్లో ఏ పుస్తకాలూ అందుబాటులో ఉండటం లేదు. అధికశాతం గ్రామీణ గ్రంథాలయాల్లో దినపత్రికలను మాత్రమే అందుబాటులో ఉంచుతున్నారు.

**కమిటీల నియామకానికి ఆదేశం..** నిర్వహణ మొక్కుబడి తంతుగా మారిన గ్రంథాలయాలకు పాఠకుల కమిటీలను ఈ నెలాఖరు లోపు వేయాలని ఆ శాఖ ఇటీవల ఉత్తర్వులు జారీచేసింది. సిబ్బంది లేక. పుస్తకాలు అందుబాటులో లేని పరిస్థితుల్లో కమిటీలెందుకనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీనిపై జిల్లా గ్రంథాలయ కార్యదర్శి శేఖర్‌బాబును సంప్రదించగా పాత పద్ధతి ప్రకారం కమిటీలు వేయాలని ఉత్తర్వులు వచ్చినట్లు చెప్పారు.ఉండి, యండగండి, కాళ్ల తదితర ప్రాంతాల్లో పత్రికల పఠనం కోసమే గ్రంథాలయాలను తెరుస్తున్నారు. విద్య, ఉద్యోగ, ఉపాధి పోటీ పరీక్షలతో పాటు ఇతర విలువైన పుస్తకాలున్న గదులకు వారానికి ఆర్రోజులు తాళాలు వేసేస్తున్నారు. మంగళవారమే తెరుస్తున్నారు. దీంతో గ్రంథాలయాలకొచ్చే పాఠకుల సంఖ్య నామమాత్రమైపోతోంది.

**ఉమ్మడి జిల్లాలో గ్రంథాలయాలు ఇలా..**

శాఖా 74 గ్రామీణ 37 పుస్తక నిక్షిప్త కేంద్రాలు 165

# కదలని వరద.. వదలని బురద

పత్తికొండ : గుంతకల్లు-గుంటూరు రైల్వే లైను వెంట ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఎల్‌సీ గేట్లు తొలగించారు. వాటి స్థానంలో అండర్ పాస్‌లు నిర్మించారు. గుత్తేదారులు నిబంధనలు పాటించలేదు. వరద నీరు వెళ్లడానికి కాల్వలు సరిగా నిర్మించలేదు. దీంతో పెద్ద ఎత్తున నీరు నిలుస్తోంది.. ఏటా ఎనిమిది నెలలపాటు రాకపోకలు నిలిచిపోతున్నాయి. విధిలేక రైతులు వరద నీటిలోనే వెళ్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని వాహనదారులు విన్నవిస్తున్నారు.

మద్దికెర- చిప్పగిరి గ్రామాల మధ్య రైతులు పొలాలకు వెళ్లేందుకు రూ.2 కోట్లు వెచ్చించి అండర్‌పాస్ నిర్మించారు. చిప్పగిరి, కుందనగుర్తి, ఆలూరు, నేమకల్లు తదితర గ్రామాలకు దగ్గరి దారి కావడంతో వెళుతుంటారు. చిన్నపాటి వర్షం కురిసినా నీరు నిలుస్తోంది.

**ఎక్కడ ఎలా ఉందంటే**

చిప్పగిరి మండలం గుమ్మనూరు-దేగులహాల్ గ్రామాల మధ్య అండర్ పాస్ (లోలెవల్ వంతెన) నిర్మించారు.. పనులు అస్తవ్యస్తంగా ఉండటంతో చిన్నపాటి వర్షం వచ్చినా నీరు నిల్వ ఉంటోంది..

మద్దికెర వద్ద రెండు అడుగుల ఎత్తులో నిర్మించడంతో నీరు వెళ్లడం లేదు.. మద్దికెర వద్ద రెండుచోట్ల, అగ్రహారం వద్ద 2, యడవలి, పెరవలి, హంప తదితర గ్రామాల వద్ద ఇదే పరిస్థితి నెలకొంది.

మద్దికెర-చిప్పగిరి ప్రధాన రహదారిలో నిర్మించిన వంతెనలో వర్షం కురిసిన సమయంలో 4 మీటర్ల మేర నీరు నిలుస్తోంది. దీంతో ఎడ్లబండ్లు, ట్రాక్టర్లు వెళ్లే అవకాశమే లేకుండా పోయింది.

**80 కి.మీ. రూ.100 కోట్లు**

ఒక్కోదానికి పొడవు, వెడల్పు ఆధారంగా రూ.కోటి నుంచి రూ.1.50 కోట్లు వెచ్చించారు. మొత్తం నిర్మాణాలకు రూ.100 కోట్ల వరకు ఖర్చు చేశారు. మద్దికెర- డోన్ మధ్య ఐవో డబ్ల్యూ, ఐవోడబ్ల్యూ పరిధిలో 25 శాశ్వత అండర్‌పాస్‌లున్నాయి. 80 కి.మీ. మేర రైల్వే ట్రాక్



వెంట నిర్మించిన భూగర్భ వంతెనల్లో నీరు నిలుస్తోంది.

అండర్ పాస్‌లు 6 మీటర్ల ఎత్తు, 5 మీటర్ల వెడల్పు చొప్పున నిర్మించారు. వర్షపు నీరు వెళ్లడానికి వీలుగా సమాంతరంగా కాల్వలు తవ్వాలి. వరద నీరు ప్రధాన కాల్వ వరకు వెళ్లేలా మార్గం సుగమం చేయాలి. చాలాచోట్ల కొంత వరకు తవ్వి వదిలేశారు.. 20-30 మీటర్ల వరకు సమాంతర కాల్వ తవ్వి అక్కడ చిన్నపాటి గుంత తీశారు. నీరు ముందుకెళ్లని పరిస్థితి నెలకొంది.

**వంతెన దాటాలంటే కష్టమే**

కిష్టన్న, రైతు, మద్దికెర

నాకున్న మూడెకరాల పొలంలో వాము పంట సాగు చేశా. 20 రోజులుగా పొలానికి వెళ్లే మార్గంలోని రైల్వే వంతెనలో నీరు నిలుస్తోంది. అండర్‌పాస్‌లో నీరు తగ్గిందని వెళ్తే ద్విచక్ర వాహనం నిలిచిపోయింది. సైలెన్సర్‌లోకి నీరు చేరడంతో బండి స్టార్ట్ కావడం లేదు. దీంతో వెనక్కు తోసుకుంటూ వచ్చా. వేలాది మంది రైతులు ఇలాంటి పరిస్థితులనే ఎదుర్కొంటున్నారు.

# వసతి పర్యవే'క్షీణం'

కర్నూలు : డోన్ బాలుర కళాశాల వసతిగృహంలో ఈనెల 7న ఓ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆ సమయంలో వసతిగృహ అధికారిణి అక్కడ లేరు. ఆమె గతేడాది వరకు ప్రీమెట్రిక్ వసతిగృహానికి ఇన్‌ఛార్జిగా పనిచేశారు. అక్కడ రెగ్యులర్ అధికారిని నియమించారు. ప్రస్తుతం చూస్తున్నది ఒక హాస్టల్ బాధ్యతలే అయినాసరే సరిగా పర్యవేక్షణ చేయడం లేదన్న విమర్శలున్నాయి.

బీసీ వసతిగృహాల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 52 వసతి గృహాల్లో 9,729 మంది విద్యార్థులు చదువుకొంటున్నారు. 38 చోట్ల సంక్షేమాధికారుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఒక్కో అధికారి రెండు వసతిగృహాల బాధ్యతలు చూడాల్సి వస్తోంది. దీన్ని అవకాశంగా తీసుకొని నిధులు బొక్కేస్తున్నారు.

**నిబంధనలు ఏం చెబుతున్నాయి**

నిబంధనల ప్రకారం సమీపంలోని వసతిగృహ అధికారికి ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించాలి. లేదా సమీపంలోని ఎస్సీ వసతిగృహ అధికారికీ ఇవ్వొచ్చు. ఎవరూ అందుబాటులో లేకుంటే తప్పనిసరి పరిస్థితుల్లో దూర ప్రాంతంలోని వారికి ఇన్‌ఛార్జి బాధ్యతలు ఇవ్వాల్సి ఉంటుంది. సస్పెన్షన్‌కు గురై తిరిగి విధుల్లో చేరిన వారికి ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించకూడదు. వసతిగృహ అధికారులు రెగ్యులర్‌గా పనిచేస్తున్న చోట ఉదయం, ఇన్‌ఛార్జిగా వ్యవహరిస్తున్న హాస్టల్‌లో సాయంత్రం వేళ ఎఫ్‌ఆర్‌ఎస్ వేయాల్సి ఉంటుంది. ఇవేవీ పట్టించుకోవడం లేదు. 30 నుంచి 40 కి.మీ దూరంలోని వసతిగృహాలకు ఇన్‌ఛార్జి బాధ్యతలు ఇవ్వడంతో పర్యవేక్షణ భారంగా మారుతోంది. అంతదూరం వెళ్లలేక పనిచేసే సిబ్బందిపైనే నిర్వహణ భారం మోపి చేతులు దులిపేసుకుంటున్నారు. విద్యార్థులకు సరైన మెనూ అమలుకావడం లేదు.

**వసూళ్ల పర్వం**

ఆలూరు కళాశాల వసతిగృహంలో ఒక్కో విద్యార్థి నుంచి రూ.50 వసూలు చేశారంటూ తహసీల్దారుకు విద్యార్థులు ఫిర్యాదు చేశారు. కర్నూలులోని బాలికల కళాశాల వసతిగృహ అధికారిణిగా పనిచేస్తున్న రాజేశ్వరి అక్రమాలకు పాల్పడటంతో సస్పెన్షన్‌కు గురయ్యారు. ఆరు నెలల తర్వాత నందికొట్కూరు బాలికల కళాశాల వసతిగృహ అధికారిణిగా పోస్టింగ్ ఇచ్చారు. కొంత కాలానికే ఆమెకు బ్రాహ్మణకొట్కూరు ప్రీమెట్రిక్ వసతిగృహ ఇన్‌ఛార్జిగా బాధ్యతలు కట్టబెట్టారు.

ఆదోని కళాశాల వసతిగృహ అధికారిగా పనిచేస్తున్న అజీంకు మంత్రాలయం ప్రీమెట్రిక్ వసతిగృహ ఇన్‌ఛార్జి బాధ్యతలు ఇచ్చారు. ఆదోని నుంచి మంత్రాలయానికి సుమారు 40 కిలోమీటర్ల దూరం ఉంటుంది. అంతదూరం వెళ్లి పర్యవేక్షించాలంటే కష్టమైనా అధికారులు దృష్టి సారించడం లేదు.

పత్తికొండ కళాశాల వసతిగృహ అధికారికి మద్దికెర ప్రీమెట్రిక్ వసతిగృహ అధికారిగా ఇన్‌ఛార్జి బాధ్యతలు ఇచ్చారు. ఈయన కర్నూలు కళాశాల వసతిగృహ అధికారిగా పనిచేసిన సమయంలో అక్రమాలకు పాల్పడి సస్పెండయ్యారు. ఇలాంటి వారికి ఇన్‌ఛార్జి బాధ్యతలు ఇవ్వకూడదన్న నిబంధనలు చెబుతున్నాయి.

# స్వస్థ్ నారీ.. సుస్తీ పరారీ..!



గాజువాక : మహిళలకు మెరుగైన వైద్యసేవలు, ఆరోగ్య పరిరక్షణ లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొత్తగా స్వస్థ్ నారీ-సశక్త్ పరివార్ అభియాన్ (ఆరోగ్యవంతమైన మహిళ-శక్తిమంతమైన కుటుంబం) తలపెట్టాయి. ఈనెల 17 నుంచి వచ్చేనెల 2 వరకూ సమగ్ర ఆరోగ్యప్రచార, సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నాయి. విశాఖ జిల్లాలో నిర్దేశిత ప్రాంతాల్లో ప్రత్యేక వైద్యశిబిరాలు కొనసాగుతాయి. ఇప్పటికే పీహెచ్‌సీల వారీగా వైద్య సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు విస్తృత ప్రచారం చేపట్టారు.

**ఉద్దేశం ఇదీ..**

మహిళలకు ఆరోగ్యంపై అవగాహన పెంచడం, పోషకాహార ఆవశ్యకత వివరించడం.. కుటుంబాలను స్వశక్తిగా బలపేతం చేయడం.

తల్లీబిడ్డల ఆరోగ్యం ప్రధాన లక్ష్యంగా వైద్యబృందాలు రంగంలోకి దిగుతున్నాయి. ఒక్కో నియోజకవర్గంలో కనీసం 10 వరకూ శిబిరాలు ఏర్పాటు చేస్తారు. వైద్య నిపుణులు, పారామెడికల్ సిబ్బంది అందుబాటులో ఉంటారు.

**శిబిరాల్లో వైద్యసేవలివీ..**

మహిళల్లో గుండెజబ్బులు, మధుమేహం, నోటి క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్‌లను గుర్తించి తగిన పరీక్షలు నిర్వహిస్తారు.

మహిళలు, కిశోరబాలికల్లో రక్తహీనత గుర్తించటం, క్షయవ్యాధి స్క్రీనింగ్, మానసిక వైద్యసేవలు, వయోవృద్ధులకు ఆరోగ్య పరీక్షలు చేస్తారు.

గర్భిణులకు మదర్ అండ్ చైల్డ్ ప్రొటెక్షన్ (ఎంసీపీ) కార్డులిస్తారు. పోషకాహారంపై తగిన అవగాహన, కౌన్సెలింగ్ చేస్తారు. పిల్లల్లో సికిల్‌సెల్ ఎనీమియా ఉంటే గుర్తిస్తారు.

చిన్నారులు, గర్భిణులకు వ్యాధి నిరోధక టీకాలు వేస్తారు. యుక్తవయసు బాలికలకు శుభ్రత గురించి వివరిస్తారు. అయుష్మాన్ భారత్ ఆరోగ్య కార్డులిస్తారు.

ప్రతీ పీహెచ్‌సీకి వైద్యశిబిరాల నిర్వహణకు ఒక్కో నోడల్ అధికారి ఉంటారు. పిల్లల వైద్య నిపుణులు, గైనకాలజిస్టులు, చర్మవ్యాధి నిపుణులు, జనరల్ మెడికల్ ఆఫీసర్లు ఇందులో పాల్గొంటారు.

గాజువాక నియోజకవర్గంలో తొలిరోజు 65వ వార్డు గంగవరం యూపీహెచ్‌సీ వద్ద వైద్యశిబిరాన్ని తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ప్రారంభిస్తారని స్వస్థ్ నారీ-సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం నోడల్ ఆఫీసర్, గాజువాక పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రీనివాస్ తెలిపారు.

సమయం: ఉదయం 9 నుంచి సాయంత్రం 5 వరకు శిబిరాలు కొనసాగుతాయి.

**జిల్లాలో ఇలా..**

మొత్తం పీహెచ్‌సీలు: 9

యూపీహెచ్‌సీలు: 65

# కుమ్మక్కవుదాం.. సొమ్ములు నొక్కేద్దాం!!



విశాఖపట్నం : ఈ చిత్రం 26వ వార్డు అక్కయ్యపాలెం ఎన్‌జీజీవోఎస్ కాలనీలోనిది. 200 చదరపు గజాల్లో ఏకంగా నాలుగు అంతస్తుల భవనం నిర్మిస్తున్నారు. ఓ మాజీ కార్పొరేటర్ సహకారంతో దర్జాగా నిర్మాణం సాగిస్తున్నారు. నగరంలో కొన్ని ప్రాంతాల్లో నిర్మాణాల్లో ఉన్న భారీ భవంతుల చుట్టూ పరదాలు కప్పేస్తున్నారు. ఇదేదో జాగ్రత్తకోసం కాదు. వాటి మాటున జరుగుతున్న అక్రమాలు బయటకు కనిపించకుండా సాగిస్తున్న తతంగం ఏమిటో తెలిస్తే ముక్కున వేలేసుకోవాల్సిందే. నిర్మాణదారులతో కొందరు అధికారులు కుమ్మక్కై రెండు చేతులా సంపాదించుకుంటున్నట్లు సమాచారం.

ఈ భవనం పీఎంపాలెం 7వవార్డులోనిది. జీం2కి అనుమతి గతంలో పొందారు. నిబంధనల ప్రకారం నిర్మాణం జరిగింది. అందులో కొన్ని కుటుంబాలు ఏడాదిగా జీవనం చేస్తున్నాయి. తాజాగా ఎలాంటి అనుమతుల్లేకుండా అదనంగా మరో అంతస్తు నిర్మిస్తున్నారు. ఈ క్రమంలో టీడీఆర్ కొనుగోలు చేయకుండానే నిర్మాణం తుది దశకు తెచ్చారు.

6వ వార్డులో ఓ చోట జీం2కు ప్లాన్ అనుమతులు పొందారు. అదనంగా పెంట్‌హౌస్ పేరుతో 60 శాతం స్లాబ్ పూర్తి చేశారు. అధికారులు తెలిసినా అడ్డుకోలేకపోతున్నారు. ఇవే కాదు...ఈ ప్రాంతంలో ఇలాంటివి ఎన్నో ఉన్నాయి. టీడీఆర్ ఉపయోగించకుండా: నిర్మాణ సమయంలో టీడీఆర్‌తో ప్లాన్‌కు వెళితే ఫ్లోర్ ఎత్తు, సెట్‌బ్యాక్‌లు నిబంధనల ప్రకారం అనుమతి ఉన్నంత వరకే నిర్మించాలి. కొందరు ఈ నిబంధనలు ఉల్లంఘించేందుకు ... టీడీఆర్ కొనుగోలు చేయకుండా, గుట్టు చప్పుడు కాకుండా అక్రమ అంతస్తులు కట్టేస్తున్నారు. ఫలితంగా రహదారుల విస్తరణలో స్థలాలు, ఇళ్లు కోల్పోయి టీడీఆర్‌లు పొందిన బాధితులు అవి అమ్ముడుపోక నష్టపోతున్నారు. చివరకు తక్కువ ధరకే ఇచ్చేస్తున్న పరిస్థితి.

ఇదే అవకాశంగా: ఎలా కట్టిన నిర్మాణమైనా బీపీఎస్‌లో క్రమబద్ధీకరణ చేసి, అనధికార నిర్మాణాలను పన్ను పరిధిలోకి తీసుకురావాలన్నది ప్రభుత్వ ఆలోచన. రుసుంలు ఎంత వసూలు చేస్తారనే అంశంపై ఇంకా కసరత్తు సాగుతోంది. దీంతో కొందరు నిర్మాణదారులు రాత్రికిరాత్రే స్లాబ్ వేసి తెల్ల సున్నం వేసేస్తున్నారు. ఇవన్నీ ఆగస్టు 31లోపు జరిగినట్లు చూపించడానికి పలు చోట్ల పట్టణ ప్రణాళిక అధికారులతో బేరాలు మాట్లాడుకుంటున్నట్లు తెలుస్తోంది.

**భద్రత ప్రశ్నార్థకం..**పాత భవనాలపై అదనంగా అంతస్తులు వేయడం వల్ల భద్రత ప్రశ్నార్థకంగా మారుతోంది. ఇటీవల వన్‌టౌన్ ప్రాంతంలో ఓ అపార్ట్‌మెంట్ పక్కకు ఒరిగిపోయిన తీరు కలకలం రేపింది. అదనపు అంతస్తులపై ఎవరైనా అర్జీలిచ్చి జిల్లా ఉన్నతాధికారులు స్పందిస్తే... వారి చర్యల నుంచి ఎలా తప్పించుకోవాలో ముందుగా పట్టణ ప్రణాళిక విభాగంలో కొందరు అక్రమ నిర్మాణదారులకు ఉచిత సలహాలిస్తున్నట్లు విమర్శలొస్తున్నాయి.

# ఆస్తులపై అధికారం.. ఇదిగో అవకాశం



పాయకరావుపేట : రియల్టర్ల మాయాజాలంలో చిక్కుకుని అక్రమ లేఅవుట్లలో స్థలాలు కొనుగోలు చేసిన వారికి ఊరటనిచ్చే అవకాశం వచ్చింది. అనుమతి లేకుండా కొనుగోలు చేసిన స్థలాల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం పథకాన్ని తీసుకువచ్చింది. ఉమ్మడి విశాఖ జిల్లాలో అక్రమ లే అవుట్లు 400కు పైగా గుర్తించగా జిల్లా పరిధిలో 200 వరకు ఉన్నాయి. పాయకరావుపేట, నక్కపల్లి, ఎస్.రాయవరం మండలాల్లో 50కి పైగా అనధికార లేఅవుట్లుగా తేల్చారు. వీటిల్లో స్థలాలు కొనుగోలు చేసిన వారికి బ్యాంకు రుణాలు పొందాలంటే వీలుండటం లేదు. అంతేగాక ఇంటి నిర్మాణానికి అనుమతులు తెచ్చుకోవడం తలకు మించిన భారమే అవుతోంది.

నిబంధనల ప్రకారం పంచాయతీల పరిధిలో జీం2 వరకు భవనాలకు అనుమతి ఇస్తారు. దానికి విరుద్ధంగా కొన్నిచోట్ల జీం5 భవంతులు నిర్మించేశారు. పాయకరావుపేట, ఎస్.రాయవరం తదితర ప్రాంతాల్లోనే ఇలా 60కి పైగా బహుళ అంతస్తుల భవనాలు వీఎంఆర్‌డీఏ అనుమతి తీసుకోకుండా నిర్మించేశారు. జీం2 దాటిన పై అంతస్తుల్లోని అపార్ట్‌మెంట్లకు పన్నులు వేయడం లేదు. బ్యాంకులు రుణాలు ఇవ్వడం లేదు. **దరఖాస్తు ఇలా:** ప్రజల ఇబ్బందులు గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం ఎల్‌ఆర్‌ఎస్ (భూమి క్రమబద్ధీకరణ పథకం) అందుబాటులోకి తెచ్చింది. ఈ ఏడాది ఏప్రిల్ నాటికి ఉన్న అన్ని అనధికారిక లేఅవుట్లలోని స్థలాలను క్రమబద్ధీకరించుకునేందుకు అవకాశం కల్పించింది. మార్కెట్ విలువ మేరకు 10 శాతం అపరాధ రుసుంగా చెల్లించి భూమి దస్తావేజులతో ఆన్‌లైన్ వీఎంఆర్‌డీఏకు దరఖాస్తు చేసుకోవాలి. నిర్దేశిత ఛార్జీలు చెల్లించాక అధికారుల పరిశీలన అనంతరం అనుమతులు ఇవ్వనున్నారు.

**అర్హత ఇదీ :** ఈ ఏడాది జూన్ 30లోగా లేఅవుట్లు, ప్లాట్ రిజిస్ట్రేషన్ చేసుకున్న వారంతా ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చు. వివరాలకు మున్సిపాలిటీ సహా గ్రామాల్లోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో సంప్రదించవచ్చు.

**చేయాల్సింది ఇదీ:** ఇప్పుడు అవకాశం వినియోగించుకోవాలనుకునే వారు అక్టోబర్ 23వ తేదీలోగా %https://dtcp.ap.gov.in/lrs% వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి. రిజిస్టర్ విక్రయ దస్తావేజు, లింకు డాక్యుమెంటు, సైట్ ప్లాన్‌ను దరఖాస్తు జత చేయాలి. సబ్ రిజిస్ట్రార్ నిర్ధారించిన ఈసీ, మార్కెట్ విలువ, భూమార్పిడి ధ్రువపత్రాలు అప్‌లోడ్ చేయాలి. క్రమబద్ధీకరణకు ముందుకు వచ్చే వారికి ప్రోత్సాహకాలు ప్రకటించారు. నోటిఫికేషన్ తేదీ నుంచి 45 రోజుల్లోపు దరఖాస్తుదారులు పూర్తి రుసుం చెల్లిస్తే 10 శాతం రాయితీ, 90 రోజుల్లోగా చెల్లిస్తే 5 శాతం రాయితీ వర్తిస్తుంది. 14 శాతం ఓపెన్ స్పేస్ ఛార్జీలపై 50 శాతం రాయితీ ఉంటుంది.

**అవగాహన కల్పిస్తున్నాం**ఎల్‌ఆర్‌ఎస్, బీఆర్‌ఎస్‌లపై గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నాం. దీన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలి. భవిష్యత్తులో ఇబ్బందులు లేకుండా ఉంటుంది. దీనిపై అధికారులతో సమావేశాలు నిర్వహిస్తున్నాం. ఇ.సందీప్, జిల్లా పంచాయతీ అధికారి

# కమీషన్ల 'కాటా'.. మామూళ్ల వేట

కర్నూలు : కర్నూలు వ్యవసాయ మార్కెట్‌లో రైతులు నిలువు దోపిడీకి గురవుతున్నారు. సరకు తీసుకొచ్చినప్పటి నుంచి ఇంటికెళ్లే వరకు అడుగడుగునా మోసపోతున్నారు. వీటికి అడ్డుకట్ట వేసి రైతులకు అండగా ఉండాల్సిన అధికారులు దోపిడీలో పాలుపంచుకుంటున్నారు.

**పీడిస్తున్న హమాలీలు**

ఒక సంచిని వాహనం నుంచి కిందకు దింపినందుకు రైతులు హమాలీ ఛార్జీ రూ.5.04 చెల్లించాలి. లైసెన్స్‌డ్ హమాలీలు వాహనం నుంచి సరకు కిందకు దింపాలి. కానీ మార్కెట్‌లో లైసెన్స్‌డ్ హమాలీలకు బినామీలుగా చలామణి అవుతున కార్మికులు సరకును కిందకు దింపుతున్నారు. ఛార్జీలకు అదనంగా డ్రైవర్ మామూళ్లు, హమాలీలు రూ.300 నుంచి రూ.500 వరకు, అదే లారీలో సరకు తీసుకొస్తే రూ.వెయ్యి వరకు వసూలు చేస్తున్నారు.

**రూ.2 కోట్లకుపైగా వసూలు**

విపణికి నిత్యం చిన్న, పెద్ద వాహనాలు 500 వరకు వస్తుంటాయి. ప్రస్తుతం ఉల్లి వాహనాలే 300 వరకు ఉన్నాయి. మామూళ్ల పేరుతో



రైతుల నుంచి వసూలు చేసే అదనపు మొత్తమే రూ.1.50 లక్షల వరకు ఉంటుంది. సీజన్‌లో 6 నెలల వ్యవధిలోనే రూ.2 కోట్ల నుంచి రూ.3 కోట్ల వరకు రైతుల నుంచి పిండుకుంటున్నారు.

**పచ్చి సరకు పేరుతో..**

క్వింటాకు రూ.2 చొప్పున రైతులు కమీషన్ ఛార్జీలు చెల్లించాల్సి ఉంది. ఉల్లి పంటకు మాత్రం క్వింటా రూ.4 చొప్పున కమీషన్ ఛార్జీలు చెల్లించాల్సి వస్తోంది.

ఉల్లి పచ్చి సరకని గతంలో మార్కెట్ కమిటీ ఈ మేరకు ఛార్జీలను నిర్ణయించింది. ఈ కారణంగా అన్నదాతలు తీవ్రంగా నష్టపోతున్నారు.

**తూకాల్లోనూ మోసాలు**

మార్కెట్ యార్డులో తూకాల్లో మోసాలకు అడ్డూఅదుపు లేకుండాపోయింది. ఎలక్ట్రానిక్ వేయింగ్ యంత్రాలకు ఈ-పోస్ యంత్రాలతో అనుసంధానం చేయడం లేదు. ఫలితంగా మోసాలు జరుగుతున్నాయి. కొందరు కమీషన్ ఏజెంట్లు ఎలక్ట్రానిక్ వేయింగ్ యంత్రాల్లో ముందస్తుగానే క్వింటాకు 2 నుంచి 4 కిలోల వరకు మైనస్‌లో పెట్టేస్తున్నారు.

బయట తూకం వేసే క్రమంలో అంతా సరిగానే ఉన్నట్లు కనిపిస్తుండటంతో రైతులు మోసాలను పసిగట్టలేకపోతున్నారు.

ఎలక్ట్రానిక్ వేయింగ్ యంత్రాలకు ఈ-పోస్ పరికరాలను అనుసంధానం చేస్తే ఈ-నామ్‌లో కచ్చితమైన తూకం ఉంటుంది. మార్కెట్‌లో మాత్రం ఇది అమలు కావడం లేదు.

**ఈ-పోస్.. ఉష్**

కర్నూలు వ్యవసాయ మార్కెట్‌కు ఏటా రూ.6 కోట్ల నుంచి రూ.7 కోట్లకుపైగా ఆదాయం సమకూరుతుంది. ఇంత ఆదాయం ఉన్నా ఈ-పోస్ యంత్రాలను సమకూర్చుకోవడంపై అధికారులు దృష్టిపెట్టడం లేదు. రూ.2- 3 లక్షలు వెచ్చిస్తే పాడైన ఈ-పోస్ యంత్రాలకు మరమ్మతులు చేయించొచ్చు. లేదా కొత్తవి కొనుగోలు చేయొచ్చు.

ఈ-నామ్ అమలైనప్పటి నుంచి ఇక్కడ ఈ-పోస్ యంత్రాలతో తూకాలు వేసిన దాఖలాలు లేవు. ఇవి అందుబాటులో ఉంటే మార్కెట్ కమిటీ అధికారులు, కమీషన్ ఏజెంట్లు, వ్యాపారులు, కాటాదారుల దోపిడీకి అవకాశం ఉండదు. ఇవి లేకుంటేనే రోజువారీగా ముడుపులు ముడుతుంటాయి. అందుకే ఈ-పోస్ యంత్రాలతో తూకాలు వేసే పద్ధతిని పక్కన పెట్టేశారు.

# గనుల దారుల్లో ఘోరీలు

డోన్ : ఖనిజ గ్రామాల్లో 'దారి'ణంగా మారాయి. వాహనాలు అధిక బరువుతో ఖనిజాలు తీసుకెళ్తుండటంతో రోడ్లు దెబ్బతింటున్నాయి. మోకాలి లోతు గుంతలు, రహదారులపై కడ్డీలు తేలి పరిస్థితి ఇబ్బందికరంగా ఉంది. డోన్, బనగానపల్లి నియోజకవర్గాల పరిధిలో గనులెక్కువ. జిల్లా పరిధిలో వెయ్యి వరకు క్వారీలు ఉన్నాయి. ప్రత్యేకించి నాపరాళ్లు, ఇనుప ఖనిజం, సిలికా, క్వార్ట్జ్, డోలమైట్ గనులు ఉన్నాయి. ఇక్కడ ముడి ఖనిజాన్ని తీసి పరిశ్రమలకు తరలిస్తారు. పౌడర్, సిమెంటు పరిశ్రమలకు కావాల్సిన ముడిసరకును వివిధ రాష్ట్రాల నుంచి ఇక్కడికి తీసుకొస్తారు. ఇక్కడ తయారైన సిమెంటు, పౌడర్‌తోపాటు నాపరాయి, పాలిష్ బండలను దేశంలోని వివిధ ప్రాంతాలకు ఎగుమతి చేస్తుంటారు. ప్యాపిలి నుంచి బనగానపల్లి మార్గంలో ఓ సిమెంటు పరిశ్రమకు సంబంధించి నిత్యం వంద వరకు లారీలు రాకపోకలు సాగిస్తుంటాయి. 52 కి.మీ. మేర దూరం ఉన్న ఈ రహదారి ప్యాపిలి నుంచి గార్లదిన్నె వరకు చాలాచోట్ల దెబ్బతింది. ఈ రోడ్డుపై 35 నుంచి 40 టన్నుల బరువుతోనే వాహనాలు వెళ్లాలి.. కానీ 55 నుంచి 65 టన్నుల వరకు తీసుకెళ్తున్నారు. దీంతో రహదారి మొత్తం అధ్వానంగా మారింది.

**నిధులు మళ్లించిన వైకాపా**

గనుల తవ్వకాలతో ప్రత్యక్షంగా, పరోక్షంగా ప్రభావితమయ్యే 10-25 కిలోమీటర్ల పరిధిలోని గ్రామాల్లో అభివృద్ధి పనులకు డీఎంఎఫ్ నిధులు వినియోగించుకోవాలని జీవో నంబరు 36 చెబుతోంది. మంచినీరు, విద్య, వైద్య సేవలు, రోడ్లు తదితర పనులకు వినియోగించుకోవాలి. గత వైకాపా ప్రభుత్వంలో డీఎంఎఫ్ నిధుల వినియోగానికి అవరోధాలు ఎదురయ్యాయి. డబ్బుల వినియోగంపై ఆంక్షలు పెట్టడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. నిధులు మంజూరైనా అప్పటి ప్రజాప్రతినిధులు ఇతర ప్రాంతాలకు మళ్లించారు. 'కూటమి' ప్రభుత్వం చక్కదిద్దాలని వాహనదారులు విన్నవిస్తున్నారు.

**ఎక్కడెక్కడ ఎలా ఉందంటే**కోవెలకుంట్ల-మయలూరు మార్గంలో చెన్నైకు సిమెంట్ లారీలు వెళ్తుంటారు. అధిక సామర్థ్యంతో ముడిసరకును తీసుకెళ్తుండటంతో రహదారి బాగా దెబ్బతింది. ప్యాపిలి-బనగానపల్లి మార్గంలో గార్లదిన్నె వద్ద అధ్వానంగా మారింది. వెంగళాంపల్లె గ్రామ సమీపంలో గుంతలు పడి కంకర తేలింది. వెంకటాపల్లె, ఎన్.రంగాపురం వద్ద రహదారిపై కడ్డీలు తేలాయి. పసుపల గ్రామ సమీపంలోనూ రహదారి పలుచోట్ల గుంతలు పడింది. యాగంటిపల్లె, పాతపాడు సమీపంలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. బేతంచెర్ల నుంచి సిమెంటునగర్ మీదుగా తమ్మరాజుపల్లెకు వెళ్లే రహదారిలో 6.5 కి.మీల దారి పలుచోట్ల దెబ్బతింది. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది.

# వ్యసనాలకు బా'నిషా'!

అనకాపల్లి : అనకాపల్లి మండలం సుబ్రహ్మణ్య కాలనీకి చెందిన ముగ్గురు యువకులు విలాసాలకు అలవాటు పడ్డారు. ఖర్చుకు డబ్బులు లేకపోవడంతో ఇటీవల పొలాల్లో విద్యుత్తు తీగలను దొంగతనం చేశారు. వాటిని కాల్చి లోపల రాగిని వేరుచేసి ఎలమంచిలి తుక్కు దుకాణంలో అమ్మేందుకు తీసుకెళ్తుండగా పోలీసులకు చిక్కారు. మాడుగులకు చెందిన ఓ యువకుడు వ్యసనాలకు బానిసగా మారాడు. ఇటీవల మాడుగులలో రెండిళ్లలో చోరీ చేసి.. బంగారం, వెండి వస్తువులను కాజేశాడు. వాటిని అమ్ముతుండగా పోలీసులు పక్కా వ్యూహంతో అతడిని అరెస్టు చేశారు.

విలాసాలకు, వ్యసనాలకు అలవాటు పడిన యువత పక్కదారి పడుతున్నారు. ఇటీవల కాలంలో ఇళ్లల్లో, ఆలయాల్లో, పొలాల్లో చోరీలకు పాల్పడిన నిందితుల్లో యువకుల నేపథ్యాన్ని గమనిస్తే వారంతా జల్సాల కోసమే తప్పుడు మార్గాన్ని ఎంచుకున్నట్లు తెలుస్తోంది. గత ప్రభుత్వంలో గంజాయి విచ్చలవిడిగా దొరికేది. కొంతమంది యువత సరకు రవాణాకు ఎస్కార్టుగా వ్యవహరించేవారు. మరికొంత మంది చిన్నచిన్న పొట్లాలుగా చుట్టి అమ్మేవారు. దాంతో వచ్చిన సొమ్ముతో జల్సాలు చేసుకునేవారు. కూటమి ప్రభుత్వం వచ్చాక.. దాన్ని కట్టడి చేస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గంజాయి రవాణాపై నిఘా పెంచి, మాదకద్రవ్య నిరోధక చట్టాన్ని కట్టుదిట్టంగా అమలు చేస్తోంది. దీనికితోడు శివారు ప్రాంతాలు, ఖాళీ స్థలాల్లో డ్రోన్ల తనిఖీలు ముమ్మరం చేశారు. దీంతో ఏళ్లగా విలాసాలకు అలవాటుపడిన యువకులు ప్రస్తుతం చోరీల



బాటపట్టారు. ఇటీవల ముగ్గురు స్నేహితులు దర్జీనగర్‌లో వరుసగా దొంగతనాలు చేశారు. అపహరించిన వస్తువులను ఓ ఇంట్లో ఉంచి.. అమ్ముతుండగా పోలీసులు పట్టుకున్నారు. వీరంతా యువకులే. తాళాలేసిన ఇళ్లే లక్ష్యంగా చోరీలకు పాల్పడుతున్నట్లు పోలీసుల విచారణలో తేలింది. దీంతోపాటు అనకాపల్లి పట్టణంలోని తుమ్మపాల రైల్వేబ్రిడ్జి దగ్గర అర్ధరాత్రి సమయాల్లో కొంతమంది గంజాయి తాగి.. దారిదోపిడీలకు పాల్పడుతున్నారు.

**అంతటా నిఘా..:** పోలీస్‌స్టేషన్ పరిధిలో నిఘా కట్టుదిట్టం చేశాం. గతంలో గంజాయితో పట్టుబడిన కేసుల్లో ఉన్నవారిపై నిఘా పెట్టాం. ప్రస్తుతం విలాసాలకు అలవాటుపడి యువత ఇళ్లు, విద్యుత్తు వైర్లు దొంగతనానికి పాల్పడుతున్నారు. ఇటువంటివారిని గుర్తించి కేసులు పెట్టి అరెస్టు చేస్తున్నాం.అశోక్ కుమార్, అనకాపల్లి రూరల్, సీఐ

# ఆహారం నిండుగా.. ఆరోగ్యం మెండుగా

నర్సీపట్నం : మన జీవన శైలిలో మారిన ఆహారపు అలవాట్లు రోగాలకు కారణమవుతున్నాయి. గర్భిణులు, బాలింతల సహా అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులను సైతం వ్యాధులు వెంటాడుతున్నాయి. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అందుతున్న పోషకాహారాన్ని పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోలేకపోతున్నారు. దీంతో రక్తహీనత తదితర ఆరోగ్య సమస్యలు తలెత్తున్నాయి. ఈ పరిస్థితిని అధిగమించేందుకు ప్రారంభమైన పోషకాహార మాసోత్సవాల్లో భాగంగా బలవర్ధక ఆహార పదార్థాల తయారీపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.మాతా శిశు మరణాలకు పోషకాహార లోపం సైతం ఒక కారణంగా గుర్తించారు. దీనిపై ఏటా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషకాహార మాసోత్సవాలను చేపడుతున్నారు. సంపూర్ణ ఆహారం ప్రాధాన్యాన్ని తెలియజేయడంతో పాటు స్వయంగా విలువలతో కూడిన పదార్థాలను తయారుచేసి చూపించాలని ప్రభుత్వ నుంచి ఆదేశాలు జారీ అయ్యాయి. జిల్లాలోని 1049 అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈ కార్యక్రమాలు చేపట్టనున్నారు.

అన్ని కేంద్రాల్లోనూ వచ్చే అక్టోబర్ నెల 16 వరకు బలాన్నిచ్చే వంటకాల తయారీ, తక్కువ ధరలకే లభించే పండ్లుపై విస్తృతంగా అందరికీ అవగాహన కల్పించనున్నారు. అవసరమైన వారి ఇళ్లకే వెళ్లి కార్యకర్తలు



వీటి గురించి వివరిస్తారు. జామ, బొప్పాయి, అరటి పండ్లు తినేలా అవగాహన కల్పిస్తున్నారు.

రాగులు, సజ్జలు, జొన్నలు అరికెలు, ఊదలు తదితర తృణధాన్యాలతో వంటకాల తయారీ విధానం గురించి వివరించాలన్నారు. జంక్ ఫుడ్‌తో కలిగే నష్టాలు, ఊబకాయం, మధుమేహం తదితర వ్యాధులకు ఆహారపు అలవాట్లులోని కారణాలను తెలియజేస్తారు. ఎప్పుడు ఏ వయస్సు వారు ఎంత మోతాదులో ఏఏ ఆహార పదార్థాలు తీసుకోవాలనే దానిపై పూర్తి అవగాహన కల్పిస్తారు.

పోషక విలువుల నష్టపోకుండా ఆహారాన్ని అందరితో తయారు చేయించి అవగాహన కల్పించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని జిల్లా ఐసీడీఎస్ పీడీ సూర్యలక్ష్మి తెలిపారు. కేంద్రాల్లోనూ గ్రామాల్లోని బహిరంగ ప్రాంతాల్లో న్యూట్రిషన్లతో పౌష్టికాహార వంటకాలను చేయించే డిమాన్‌స్ట్రేషన్లను ఏర్పాటు చేయనున్నాం.ఈ ఆహారం తయారీపై పోటీలు నిర్వహిస్తాం. ఎదిగే అయిదేళ్ల లోపు పిల్లల ఏఏ వయస్సులో ఎన్ని కప్పుల ఆహారాన్ని తీసుకోవాలో వివరిస్తారు. ఆకుకూరులు, కాయగూరలను ముందుగా నీళ్లతో బాగా కడిగిన తరువాతే కత్తిరిస్తే అవి పోషకాలను కోల్పోకుండా ఉంటాయని ఐసీడీఎస్ పీడీ సూర్యలక్ష్మి వివరించారు.

# బృహత్తర లక్ష్యానికి చెదలు



గుత్తి : గుంతకల్లు, తాడిపత్రి, శింగనమల నియోజకవర్గాల్లో జల్‌జీవన్ మిషన్ కింద రెండేళ్ల కిందట మంజూరైన పనులు ఇప్పటికీ పూర్తి కాలేదు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా పథకాల నిర్మాణాలకు నిధులను భరించాల్సి ఉంది. కేంద్రం నిధులు ఇచ్చినా అప్పటి వైకాపా రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వలేకపోయింది. ఈకారణంగానే పనులు పడకేశాయి. మూడు నియోజకవర్గాల్లో రూ.156.55 కోట్లతో రెండో విడతలో వైకాపా ప్రభుత్వం నీటి పథకాల పనులను మంజూరు చేసింది. గ్రామీణ నీటి సరఫరా విభాగం ఇంజినీర్లు పనులను పర్యవేక్షించారు. తొలి, మలి విడతల్లో మంజూరు చేసిన పనులను ఇప్పటికీ పూర్తి చేయలేకపోయారు. రాష్ట్ర ప్రభుత్వం తన వాటా నిధులు ఇవ్వలేకపోవడంతోనే పనులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. ఇంజినీర్లు గ్రామాల్లోని తాగునీటి పథకాలకు అదనంగా బోర్లు వేశారు. కుళాయి కనెక్షన్లు ఇస్తూ వచ్చారు.

**నిధులురాక.. పనులు సాగక!**

ప్రభుత్వం మారిపోవడంతో మొదలు కాని పనులను కూటమి ప్రభుత్వం రద్దు చేసింది. మూడు నియోజకవర్గాల్లో 763 పనులకు గాను 114 పనులు పూర్తి చేశారు. అన్నీ పూర్తయితే గ్రామీణులకు తాగునీటి సమస్య తీరి రక్షిత నీరు అందుతుంది. ప్రస్తుతం అవసరాలకు అనుగుణంగా బోర్ల నుంచి నీరు రావడం లేదు. మూడేళ్ల కిందటి వరకు వేసవిలో అధికారులు ట్యాంకర్లతో ప్రజలకు తాగునీరు అందించేవారు. తర్వాత ఆ తరహా సాంత్వన చర్యలు ఏవీ లేకుండా పోయాయని ప్రజలు ఆరోపిస్తున్నారు.

**డీపీఆర్‌లో మార్పులు చేసినా..**

పథకాలకు అదనంగా నీటి వనరులను కల్పించేందుకు బోర్లు వేయడం వల్ల పెద్దగా ప్రయోజనం ఉండదని ఇప్పటి ప్రభుత్వం డీపీఆర్‌లో మార్పులు చేసింది. బోర్లలో నీరు భవిష్యత్తులో ఇంకిపోయే ప్రమాదం ఉందని గుంతకల్లు, శింగనమల నియోజకవర్గాలకు ఎంపీఆర్ డ్యామ్ నుంచి నీరు ఇవ్వాలని నిర్ణయించింది. తాడిపత్రి నియోజకవర్గానికి గండికోట నుంచి నీరు ఇవ్వాలని ఇంజినీర్లు తీర్మానించారు. ఉరవకొండ, రాప్తాడు, అనంతపురం, కళ్యాణదుర్గం, రాయదుర్గానికి పీఏబీఆర్ నుంచి నీరు ఇవ్వాలనుకున్నారు. ఈమేరకు డీపీఆర్‌లను ప్రభుత్వం తీసుకుంది. అయితే పనులను కొత్తగా మంజూరు చేసి నిధులు ఇవ్వలేకపోతోంది. రద్దు చేసిన పనులు కొత్త అంచనాలతో ఇంకా ప్రభుత్వం మంజూరు చేయలేదని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ సురేశ్ తెలిపారు.

# అక్కడ కూరగాయలు కిలో 25 పైసలే!



పుట్టపర్తి: బుక్కపట్నం బాలికల పాఠశాలను వసతుల లేమి కారణంగా పుట్టపర్తి సమీపంలోని బీడుపల్లి రోడ్డులో నిర్వహిస్తున్నారు. ఇక్కడ పచ్చిమిరపకాయలు నాసిరకంగా ఉన్నాయి. మొత్తం 291 విద్యార్థినులకుగాను 247 మంది హాజరయ్యారు. ఈ విషయాన్ని ప్రిన్సిపల్‌ను అడగగా కొందరు జ్వరంతో బాధపడుతున్నారు, మరికొందరు ఆధార్ నమోదు కోసం వెళ్లగా.. మరికొందరు గైర్హాజరయ్యారని తెలిపారు. కూరగాయలు, పండ్లు.. వీటిలో ఏవి కావాలన్నా.. నచ్చిన ధరకు కాదు కాదు.. మీరు ఆశ్చర్యపోయే ధరకు లభిస్తాయి. ఎక్కడో తెలుసా.. శ్రీసత్యసాయి జిల్లాలోని మహాత్మా జ్యోతిబాపులే పాఠశాలలు, కళాశాలలకు కూరగాయలు, పండ్లు సఫరా చేసే గుత్తేదారుల వద్ద.. అవును మరి కొన్ని నెలలుగా వారు సరకులను సరఫరా చేస్తున్నారు. జిల్లాలోని బుక్కపట్నం, రాంపురం, రొద్దం, రేగాటిపల్లి, నసనకోటలో మహాత్మాజ్యోతిబా ఫులే ఉన్నత పాఠశాలలు, టేకులోడు, లేపాక్షి, గుడిబండ, గుండుమలలో పాఠశాలలతోపాటు జూనియర్ కళాశాలలు ఉన్నాయి. విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా పౌష్టికాహారం అందిస్తుంది. కూటమి సర్కారు వచ్చాక సన్న బియ్యం సరఫరా చేస్తోంది. మరింత శ్రద్ధ తీసుకుని మెనూ అమలు చేస్తోంది. ఈక్రమంలో కొందరు అక్రమార్కులు ప్రభుత్వ లక్ష్యాన్ని నీరుగార్చేందుకు ప్రయత్నం చేస్తున్నారు.

ఎలా సాధ్యం? దోసకాయ, మునక్కాయ, దొండకాయ, గుమ్మడికాయ, క్యాలీఫ్లవర్, గోరుచిక్కుడు, ఎర్రముల్లంగి, బెంగళూరు మిరపకాయ, పుదీన, కొత్తిమీర, కరివేపాకు ఇవన్నీ కిలో 25 పైసలకే సరఫరా చేస్తామన్నారు.ప్రస్తుతం ఇవన్నీ మార్కెట్లో కిలో రూ.20 నుంచి 50 వరకు పలుకుతున్నాయి. అంత తక్కువ ధరకు ఎలా సాధ్యమవుతుందన్న విషయాన్ని అధికారులు ఆలోచించకపోవడం గమనార్హం.

**విద్యార్థుల సంఖ్య.. హాజరుకు పొంతనేదీ..**

విద్యార్థుల సంఖ్యకు, హాజరైనవారి మధ్య పొంతన కుదరడం లేదు. ఉదాహరణకు ప్రతి విద్యార్థికి 100 ఎంఎల్ చొప్పున పాలు ఇవ్వాల్సి ఉంటుంది. అంటే 300 మంది విద్యార్థులుంటే.. 30 లీటర్ల పాలు సరఫరా చేయాలి. వారు ఎన్ని ప్యాకెట్లు ఇస్తున్నారన్నది ప్రిన్సిపల్, గుత్తేదారుకు తప్ప ఇతరులకు తెలియదు. పాలను తప్పనిసరిగా ప్యాకెట్ల రూపంలోనే సరఫరా చేయాలి. కొన్నిచోట్ల విడిగా పంపిణీ చేస్తున్నారు. కూరగాయల నాణ్యత, పరిమాణంలో తేడాలు ఉంటున్నాయి.

జిల్లా: శ్రీసత్యసాయి

మహాత్మా జ్యోతిబాపులె విద్యాలయాలు: 13

మొత్తం విద్యార్థులు: 7,218

నిబంధనల మేరకే బిల్లులిస్తాం..: జమునాబాయ్, ఎంజేపీ విద్యాలయాల కన్వీనర్

గుత్తేదారులు టెండరు సమయంలో ఎంత పేర్కొన్నారో అంతే బిల్లులు చేస్తాం. నాణ్యత, పరిమాణంలో తేడాలుంటే సరకు వెనక్కి పంపుతాం. కొన్నిచోట్ల పాలు విడిగా ఇచ్చినట్లు ఫిర్యాదులు వచ్చాయి. ఎక్కడైనా అవకతవకలుంటే విచారించి చర్యలు తీసుకుంటాం.

# కాలుష్యం ముంగిట కౌండిన్య



పలమనేరు : కౌండిన్య నదిలో నీరు ప్రమాదకరంగా మారుతోంది. పట్టణంలోని మురుగు మొత్తం నదిలో చేరి కలుషితమవుతోంది. ఇటీవల వర్షాలకు కొంత వరకు నీరు నదిలోకి వచ్చింది. పూర్తిస్థాయిలో వస్తే తరువాత దాన్ని ప్రజలకు అందివ్వాలనే ఆలోచనలో అధికారులు ఉన్నారు. మురుగును దారి మళ్లిస్తే తప్పా ఈ నీరు తాగడానికి పనికిరాదు. ఏం జరుగుతోంది పట్టణంలోని మురుగు మొత్తం పెద్దచెరువులోకి చేరుతుంది. అక్కడి నుంచి ఆ నీరు మరవ ద్వారా బొమ్మదొడ్డి చెరువుకు చేరి అక్కడి నుంచి కౌండిన్య నదిలోకి ప్రవహిస్తుంది. ఇటీవల కురిసిన వర్షాలకు నదిలోకి కొంత నీరు చేరింది. వర్షపు నీటితో పాటు మురుగు నదిలో కలిసిపోయింది. వర్షపు నీరు తక్కువ కావడంతో మురుగు ప్రస్తుతం నీటిపైన నిలిచింది. ఏటా భారీ వర్షాల కారణంగా ప్రాజెక్టు నిండి అదనపు నీరు తమిళనాడు రాష్ట్రంలోని అడవిలోకి చేరేది. అప్పుడు అదనపు వరద నీటితో పాటు మురుగు మొత్తం ప్రాజెక్టును దాటుకుని అవతలికి కొట్టుకుపోయేది. ఇప్పుడు నీరు తక్కువగా ఉండటంతో మురుగు ఇక్కడే నిలిచిపోయింది.

**స్థలాన్వేషణ**

మురుగును శుద్ధి చేసే ఎస్‌టీపీ కోసం అధికారులు స్థలాన్వేషణలో ఉన్నారు. ప్రైవేటు భూములను తీసుకోవాలని గతంలో ఆలోచించారు. అయితే ప్రభుత్వం కేవలం ప్రభుత్వ భూమిని మాత్రమే ఇందుకు పరిశీలించాలని ఆదేశించడంతో పట్టణానికి సమీపంలోని పాత కంపోస్టు యార్డు స్థలాన్ని ఎంపిక చేశారు. ప్రజలు కూడా ఈ ప్రతిపాదనపై సమ్మతి వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ మురుగును శుద్ధి చేస్తే తాగునీటిలో మురుగు కలిసే ప్రమాదం ఉండదు.

పట్టణ జనాభా: 50వేలు

వార్డులు : 26

నీటి వనరులు : క్యాటిల్‌ఫారం వద్ద సంప్, కౌండిన్య నదిలోని ప్రాజెక్టు, బోర్ల ద్వారా భూగర్భజలాలు, వేసవిలో ట్యాంకర్ల ద్వారా

సమస్య పరిష్కరిస్తాం ఎస్‌టీపీ కోసం స్థలాన్ని ఎంపిక చేసే పనిలో ఉన్నాం. త్వరలోనే మురుగు సమస్య తీరుస్తాం. వర్షాకాలంలో కూడా శుద్ధి చేసిన నీటినే ఇస్తున్నాం.ఎన్వీరమణారెడ్డి, కమిషనర్, పలమనేరు.

# రాయితీ సవరణ.. సంఘాలకు ఆదరణ

చిత్తూరు : గత ప్రభుత్వం స్వయం సహాయక సంఘాలకు సున్నా, పావలా వడ్డీ పేరుతో కొంతమేర మాత్రమే ఉపశమనం ఇచ్చేది. కూటమి ప్రభుత్వం రుణం మొత్తానికి రాయితీ వర్తించేలా చేయడంతో సంఘాల సభ్యులకు వడ్డీలో ఊరట లభించనుంది. గతంలో బ్యాంకు లింకేజీ రుణంపై 13 శాతం, స్త్రీనిధి రుణంపై 12 శాతం వడ్డీలు ఉండేవి. కూటమి ప్రభుత్వం వడ్డీ రేట్లను సవరించింది.సంఘంలోని సభ్యులు రుణం తీసుకుంటే రూపాయి వడ్డీతో వాయిదా పద్ధతిలో చెల్లించేవారు. ఈ భారాన్ని కూటమి ప్రభుత్వం 95 పైసలకు తగ్గించింది. ఇప్పుడు ఎంత రుణం తీసుకున్నా రెండు శాతం వడ్డీ రాయితీ అందిస్తోంది. అత్యవసర పరిస్థితుల్లో సభ్యులు తీసుకునే స్త్రీనిధి, బ్యాంకు రుణాలపై వడ్డీ భారం తగ్గడంతో ఉపశమనం లభించనుంది. సభ్యులు చేయాల్సిందల్లా ప్రతి నెలా పదో తేదీలోగా వాయిదాలు చెల్లించాలంతే.

# వసతిగృహ విద్యార్థులకు తీపికబురు

పాయకరావుపేట : జిల్లాలోని సాంఘిక సంక్షేమ శాఖ వసతిగృహ విద్యార్థులకు ప్రభుత్వం తీపి కబురు అందించింది. వసతిగృహాల్లో ఉండి చదువుకుంటున్న వారికి నగదు అందించనున్నారు. టూత్ పేస్టులు, కొబ్బరి నూనె, షాంపూలు, సబ్బులు తదితర వస్తువుల కొనుగోలుకు నెలకు కొద్ది మొత్తాన్ని ప్రభుత్వం చెల్లిస్తుంది. జిల్లాలోని పాయకరావుపేట, నక్కపల్లి, ఎలమంచిలి, నర్సీపట్నం, అనకాపల్లి తదితర ప్రాంతాల్లో సాంఘిక సంక్షేమ శాఖ పరిధిలో 30 వసతిగృహాలు నిర్వహిస్తున్నారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలు, కళాశాలల్లో చదువుతున్న వారికి ప్రవేశాలు కల్పిస్తున్నారు. ప్రస్తుతం 3,569 మంది విద్యార్థులు వసతిగృహాల్లో ఉంటున్నారు. బాల, బాలికల అవసరాలకు అనుగుణంగా తరగతుల వారీగా రూ.125 నుంచి రూ.255 వరకు నెలవారీ కాస్మెటిక్ ఛార్జీలు చెల్లిస్తారు. దీనిలో హెయిర్ కటింగుకు రూ. 50 చెల్లిస్తారు.

ప్రస్తుతం అలంకరణ సామగ్రి కొనుగోలు ఖర్చుల నిమిత్తం ప్రభుత్వం



మొదటి విడతలో రూ.23 లక్షలు, రెండో విడతగా రూ.16 లక్షలు మంజూరు చేసింది.మూడు నుంచి ఆరు తరగతులు చదివే బాలురకు రూ. 125, బాలికలకు రూ. 130, ఏడు నుంచి 10 చదివే బాలురకు రూ. 150, బాలికలకు రూ. 200 నగదు చొప్పున నెలకు చెల్లిస్తారు. ఇంటర్ ఆపై చదువుతున్న బాలురకు రూ. 200 నుంచి రూ. 265 వరకు చెల్లించనున్నారు.

**తల్లుల ఖాతాల్లో జమ...:** కాస్మోటిక్ ఛార్జీల నగదును విద్యార్థుల తల్లుల ఖాతాల్లోనే జమ చేస్తాం. దీనికి సంబంధించి అన్ని ఏర్పాట్లు చేశాం. వసతిగృహ విద్యార్థులకు ఛార్జీలు సకాలంలోనే చెల్లిస్తున్నాం. వసతిగృహాల్లో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నాం.బి. రామనాథం, సాంఘిక సంక్షేమశాఖ ఉప సంచాలకులు

# గుట్టుగా ఆక్రమిం'కేసీ'

నంద్యాల : భగత్‌సింగ్ కాలనీలో కేసీ పంట కాల్వపై కల్వర్టు నిర్మించారు. స్థిరాస్తి వ్యాపారులు దీన్ని పూడ్చి సమాంతరంగా మరో ప్రదేశంలో తవ్వారు. కాల్వ ఆరు మీటర్లకు బదులు మూడు మీటర్లు ఉండేలా నిర్మించడంతో నీటి ప్రవాహానికి ఆటంకంగా మారింది.

జిల్లా కేంద్రమైన నంద్యాల పట్టణంలో 16 కి.మీ. మేర ప్రవహించే కర్నూలు-కడప (కేసీ) పంట కాల్వలను స్థిరాస్తి వ్యాపారులు పూడ్చేస్తున్నారు. పట్టణంలో నూతన కాలనీలు వెలుస్తున్నాయి. బహుళ అంతస్తుల భవన నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. స్థలాల విలువ అమాంతం పెరిగిపోయింది. ఈ నేపథ్యంలో ఎక్కడ ఖాళీ స్థలం కనిపించినా అక్కడ వాలిపోతున్నారు.

**కానరాని 'పరిరక్షణ**

గత వైకాపా ప్రభుత్వ హయాంలో కేసీ కాల్వ సాగునీటి సంఘం ఆధ్వర్యంలో పెద్దఎత్తున అక్రమాలు జరిగాయి. పలు ప్రాంతాల్లో ధ్వంసం చేశారు. అనధికార అనుమతులతో ఇష్టారాజ్యంగా వ్యవహరించి ఆనవాళ్లు లేకుండా చేశారు. పంట కాల్వ గట్లను అటూఇటూ



కలిపేసుకొని ప్లాట్లుగా మార్చారు. కాల్వ పరిరక్షణకు హద్దుల నిర్ణయించాలని గతంలో చర్చించారు. సర్వే చేసి శిఖం భూములను గుర్తించాలనే ప్రయత్నాలు జరిగాయి. కానీ అడుగులు పడటం లేదు. ఇదే సమయంలో ఆక్రమణలు ఆగడం లేదు. సెంటు స్థలం రూ.లక్షలు పలుకుతున్న ప్రాంతంలో కనీస చర్యలు లేకపోవడంతో ఆక్రమణలకు అంతే లేకుండా పోయింది.

**పెద్ద చెరువు నుంచి మొదలై**

నంద్యాల పెద్ద చెరువు సమీపంలోని ఎస్బీఐ కాలనీ వద్ద కేసీ ప్రధాన కాలువ ప్రారంభమవుతుంది. అక్కడినుంచి ఫరూక్‌నగర్, బాలాజీ కాంప్లెక్స్, ఎన్జీవో కాలనీ, నూనెపల్లె, రైతునగరం, కాంతినగర్, కానాల, చాపిరేవుల గ్రామ శివారు మీదుగా పంట కాల్వలు వెళ్తాయి.

ఏటా కాల్వ శిఖం భూమిని పూడ్చేస్తున్నారు. స్థిరాస్తి వ్యాపారులు పంట కాల్వలను పూడ్చి వెంచర్లలో కలిపేస్తున్నారు. నూనెపల్లె నుంచి కానాల, నూనెపల్లె నుంచి రైతునగరం మీదుగా కాంతినగర్ వరకు పదుల సంఖ్యలో వేసిన వెంచర్లతో కేసీ కాల్వ చిక్కుకుంది.

# మండపం.. కాలక్షేపానికే పనికొస్తోంది!

విజయనగరం : విజయనగరంలోని సంతపేట జగన్నాథస్వామి ఆలయానికి చెందిన పురాణ కాలక్షేప మండపం నిరుపయోగంగా దర్శనమిస్తోంది. రూ.80 లక్షల నిధులతో దేవాలయ స్థలంలో నాలుగేళ్ల కిందట దీనిని నిర్మించారు. అప్పటి నుంచి కార్యకలాపాలు ముందుకు సాగడం లేదు. ప్రహరీ లేని కారణంగా వినియోగించడం లేదు. ఇక్కడ ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టాలి. అవసరం మేరకు లీజుకు ఇచ్చేందుకు సైతం దేవాదాయశాఖ భావిస్తోంది. ఆ చర్యలేవీ లేకపోవడంతో జూదానికి కేంద్రంగా మారింది. సాయంత్రం వేళల్లో మందుబాబులు, గంజాయి తాగేవారు తిష్ఠ వేస్తున్నారు. మరికొన్ని పనులు ఉన్నాయని, పూర్తి చేసి, లీజుకు కేటాయిస్తామని సహాయ కమిషనర్ శిరీష తెలిపారు.

## వారసుడి కుమారుడితో బేబమ్మ కంబ్యాక్!

ముంబై బ్యూటీ కృతిశెట్టి కెరీర్ నత్తనడకన సాగుతోంది. ఏ భాషలో అవకాశం వస్తే అక్కడ పని చేయడం తప్ప! స్థిరంగా ఓ భాషలో అవకాశాలు అందుకోలేకపోతుంది. ఇప్పటికే హిందీ, తెలుగు , తమిళం అంటూ మూడు భాషల్ని టచ్ చేసింది. కానీ ఎక్కడా నిలదొక్కుకోలేకపోయింది. ఏడాదిన్నర కాలంగా కోలీవుడ్ లోనే సినిమాలు చేస్తోంది. ప్రస్తుతం ఓ రెండు సినిమాలు అక్కడే చేస్తోంది. ఈ నేపథ్యంలో అమ్మడు మళ్లీ బాలీవుడ్ లో కంబ్యాక్ కి రెడీ అయింది. బాలీవుడ్ స్టార్ గోవిందా కుమారడైన యశ్వర్ధన్ అహుజా హీరోగా సాజిద్ ఖాన్ ఓ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాడు.

**బాలీవుడ్ లో రెండవ చిత్రం:** సౌత్ లో విజయం సాధించిన ఓ సినిమాకు రీమేక్ ఇది. బాలీవుడ్ లో ఈ చిత్రాన్ని ఓ ప్రముఖ నిర్మాణ సంస్థ నిర్మిస్తుంది. ఇందులో హీరోయిన్ గా కృతిశెట్టి ఎంపికైనట్లు సమాచారం. పలువురు బాలీవుడ్ హీరోయిన్లను పరిశీలించినా? సాజిద్ ఖాన్ రాసిన పాత్రకు పర్ఫెక్ట్ గా కృతిశెట్టి సెట్ అవ్వడంతో టెస్ట్ షూట్ నిర్వహించి ఫైనల్చేసారట. దీనికి సంబంధించి అధికారిక ప్రకటన త్వరలోనే రానుందని సమాచారం. కృతికి బాలీవుడ్ లో రెండవ చిత్రం. తొలుత అమ్మడి కెరీర్ బాలీవుడ్ లోనూ సూపర్ 30



తో ప్రారంభమైన సంగతి తెలిసిందే.

**తొలి సినిమాతోనే గ్రాండ్ విక్టరీ:** హృతిక్ రోషన్ కథానయాకుడిగా వికాస్ భాల్ దర్శకత్వం వహించిన సినిమా పెద్ద విజయం సాధించింది. 60 కోట్ల బడ్జెట్లోనే నిర్మించిన సినిమా 200కోట్లకు పైగా వసూళ్లను సాధించింది. ఇందులో కృతిశెట్టి ఎక్స్ లెన్స్ స్టూడెంట్ పాత్రలో నటించింది. పాత్ర చిన్నది కావడంతో పెద్దగా హైలైట్ అవ్వలేదు. అటుపై రెండేళ్లకు ఉప్పెనలో హీరో యిన్ అవకాశం వచ్చింది. అలా టాలీవుడ్ లో అమ్మడు లాంచ్ అయింది. తొలి సినిమాతోనే ఇక్కడ కూడా బ్లాక్ బస్టర్ కొట్టింది. నటిగా మంచి ఫేమస్ అయింది. బోల్డ్ పెర్ఫార్మెన్స్ తో యువతను ఆకట్టుకుంది.

**కంబ్యాక్ తోకైనా క్లిక్ అవుతుందా:** ఇంత ట్యాలెంటెడ్ బ్యూటీ స్టార్ హీరోయిన్ అవుతుందని అంతా ఆశించారు. కానీ అలా జరగలేదు. అన్ని ఉన్నా అదృష్టం కలిసి రాకపోవడంతో స్టార్ గా నిలదొక్కుకోలేకపోతుంది. నిరూపించుకునే అవకాశాలు వచ్చినా? వైఫల్యా లు అంతకంతకు వెనక్కి నెట్టుతున్నాయి. తెలుగు, తమిళ్ లో ఇలాగే కెరీర్ కొనసాగింది. మరి బాలీవుడ్ కంబ్యాక్ తో నైనా నిలదొక్కుకుంటుందేమో చూడాలి.

## 60కోట్లు చెల్లిస్తేనే.. స్టార్ కపుల్ ఆర్థిక మోసం కేసులో ట్విస్టు!

శిల్పాశెట్టి- రాజ్ కుంద్రా జంట ఇటీవల కోర్టు కేసుల కారణంగా నిరంతరం మీడియా హెడ్ లైన్స్ లోకొస్తున్న సంగతి తెలిసిందే. సెలబ్రిటీ కపుల్ మోసాలు, ఆర్థిక నేరాలపై విచారణ జరుపుతున్న అధికారులు రోజుకో కొత్త నిజాన్ని బయటపెడుతున్నారు. దీపక్ కొఠారి అనే వ్యాపారిని దాదాపు రూ. 60 కోట్ల మేర ముంచిన కేసులో ప్రస్తుతం దర్యాప్తు సాగుతోంది. ఇప్పటికే ఈ జంటపై లుకౌట్ నోటీస్ జారీ అయింది. ఈ సర్క్యులర్ కారణంగా ముందస్తుగా ప్లాన్ చేసిన వెకేషన్ షెడ్యూళ్లను కూడా క్యాన్సిల్ చేయాల్సి వచ్చింది. ఇటీవల తాము విదేశీ విహారయాత్ర కోసం ముందే కొనుక్కున్న టికెట్లను చూపించి కోర్టులో వాదనలు వినిపించగా, ఆర్థిక మోసం కేసు విచారణ పూర్తి కాకుండా విదేశాలకు వెళ్లేందుకు అనుమతించేది లేదని కోర్టు తీర్పు వెలువరించింది. తదుపరి వాయిదా విచారణలో ఈ దంపతులకు



కోర్టు ఒక ఆప్షన్ కూడా కల్పించింది. ఒకవేళ విదేశాలకు విహారయాత్రకు వెళ్లాలని అనుకుంటే రూ.60 కోట్ల డిపాజిట్ చేయాలని బాంబే హైకోర్టు తీర్పు వెలువరించింది. ముంబై పోలీసుల ఆర్థిక నేరాల విభాగం (ఈవోడబ్ల్యూ) ప్రస్తుతం ఈ కేసును దర్యాప్తు చేస్తోంది. లోటస్ క్యాపిటల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ డైరెక్టర్గా పనిచేస్తున్న దీపక్ కొఠారి .. కుంద్రాతో కలిసి వ్యాపారం చేయాలని నిర్ణయించుకోగా అతడి వ్యాపారాల్లో భాగస్వామిగా మారాడు. అప్పు రూపంలో డబ్బు ఇవ్వడమే గాక భాగస్వామ్య ఒప్పందాలు ఉన్నాయి. కానీ అతడి డబ్బును దుర్వినియోగం చేసినట్టు పోలీసులు కనుగొన్నారు. దీని తర్వాత శిల్పా శెట్టి, కుంద్రా సహా మరొక సహచరుడిపై భారత శిక్షాస్మృతిలోని సెక్షన్లు 403 (నిజాయితీగా ఆస్తి దుర్వినియోగం), 406 (నేరపూరిత నమ్మక ద్రోహం), 34 (సాధారణ ఉద్దేశ్యం) కింద ఎఫ్ఐఆర్ నమోదు చేసారు.





## ఒకే ప్లేస్ లో ఇద్దరు స్టార్ హీరోస్.. ఎక్కడ, ఎందుకో తెలుసా?



అప్పుడప్పుడు కొన్ని విషయాలు యాదృచ్ఛికంగా అలా జరిగిపోతూ ఉంటాయి. అలా ప్రస్తుతం సినిమా ఇండస్ట్రీలో కూడా ఓ ఇద్దరి స్టార్లు యాదృచ్ఛికంగా ఒకే దగ్గర షూటింగ్ జరుపుకుంటున్నారు. వాళ్లే తమిళ నటుడు సూర్య, టాలీవుడ్ నటుడు ప్రభాస్.. ఈ ఇద్దరు హీరోల సినిమా షూటింగ్స్ ప్రస్తుతం ఒకే దగ్గర జరుగుతుండడంతో వీరి సినిమా షూటింగ్లకు సంబంధించి ఈ విషయం వైరల్ గా మారింది. ప్రభాస్ ప్రస్తుతం 'ది రాజా సాబ్' సినిమా షూటింగ్ కోసం ఈ మధ్యనే యూరప్ వెళ్ళినట్టు చిత్ర యూనిట్ అఫీషియల్ గా ఓ పోస్ట్ చేసిన సంగతి మనకు తెలిసిందే. యూరప్ లో ప్రభాస్,నిధి అగర్వాల్, మాళవిక మోహనన్ లతో రెండు రొమాంటిక్ సాంగ్స్ చిత్రీకరించడం కోసం వెళ్లారు. అయితే ఇదే యూరప్ లో తమిళ నటుడు సూర్య సినిమా చిత్రీకరణ కూడా జరుపుకుంటుందట. వెంకీ అట్లూరి డైరెక్షన్లో వస్తున్న సూర్య 46వ మూవీకి సంబంధించిన కొన్ని కీలక సన్నివేశాలను యూరప్ లో చిత్రీకరిస్తున్నట్టు తెలుస్తోంది. అలా తాజాగా ఈ రెండు సినిమా షూటింగ్స్ యూరప్ లో జరగడంతో ఈ విషయం కాస్త ఇండస్ట్రీ వర్గాల్లో వైరల్ గా మారింది. ప్రభాస్ ది రాజా సాబ్ మూవీ విషయానికి వస్తే.. ఇప్పటికే రెండు మూడు సార్లు వాయిదా పడ్డ ది రాజా సాబ్ మూవీని ఫైనల్ గా వచ్చే ఏడాది జనవరి 9న విడుదల చేయాలని చిత్ర యూనిట్ అధికారిక రిలీజ్ డేట్ ని కూడా రిలీజ్ చేసింది. ప్రస్తుతం మారుతి ఈ సినిమా షూటింగ్ ని శరవేగంగా జరుపుతున్నారు. ఈ సినిమాలో ప్రభాస్ చాలా కొత్త లుక్ లో కనిపించబోతున్నట్టు ఇప్పటికే విడుదలైన టీజర్,ట్రైలర్ ద్వారా అర్థమవుతుంది. కామెడీ, హార్రర్,యాక్షన్ వీటన్నింటినీ ది రాజా సాబ్ మూవీలో చూడబోతున్నాం..అలా ప్రభాస్ ఈ సినిమాతో తనలోని కొత్త కోణాన్ని బయట పెట్టబోతున్నారు.. సూర్య 46 వ మూవీ విషయానికి వస్తే.. రీసెంట్ గానే రెట్రో మూవీతో బాక్సాఫీస్ వద్ద బోల్తా పడ్డ ఈ హీరో తన నెక్స్ట్ మూవీ తోనైనా హిట్టు కొట్టాలనే ఆలోచనలో ఉన్నారు.అలా వెంకీ అట్లూరి డైరెక్షన్లో సూర్య తన 46వ సినిమాని చేస్తున్నారు.ఈ సినిమాలో హీరోయిన్ గా మమిత బైజు నటించగా.. సీనియర్ నటీమణులు రాధిక శరత్ కుమార్, రవీనాటాండన్ లు కీ రోల్స్ పోషిస్తున్నారు. అలా భారీ తారాగణంతో తెరకెక్కుతున్న ఈ సినిమాకి సంబంధించిన కీలక సన్నివేశాలు యూరప్ లో షూటింగ్ జరుపుకుంటున్నాయి. ఈ సినిమా ఫ్యామిలీ ఎమోషన్స్ యాక్షన్ నేపథ్యంలో తెరకెక్కుతోంది.. అలా యూరప్ లో ఓ కీలక షెడ్యూల్ తెరకెక్కుతున్నట్టు సమాచారం. సూర్య 46వ సినిమా వచ్చే ఏడాది సమ్మర్లో విడుదల చేయబోతున్నారు. అలా ఇద్దరు బిగ్గెస్ట్ స్టార్స్ సినిమాలు ఒకే దగ్గర షూటింగ్ జరుపుకోవడంతో పాటు వచ్చే ఏడాది అభిమానులను అలరించబోతున్నాయి.

## శ్రీలీల క్యూలో అంతర్జాతీయ బ్రాండ్లు



అంచెలంచెలుగా ఎదగడం, తన ప్రతిభతో ప్రతిసారీ అందరి మన్ననలు పొందడం, ఆశ్చర్యపరచడం ఇలాంటివి చాలా అరుదు. కానీ శ్రీలీల విషయంలో ఇవన్నీ సాధ్యం. అందుకే పోటీలో ఎందరు ఉన్నా తన రేంజ్ ఎంతమాత్రం తగ్గదని నిరూపిస్తోంది. ఈ బ్యూటీ టాలీవుడ్ నుంచి బాలీవుడ్ వరకూ ఎదురే లేకుండా దూసుకెళుతోంది.

క్రేజీగా టాప్ హీరోల సరసన అవకాశాలు అందుకుంటోంది. బాలీవుడ్ లో ఆరంగేట్రమే అగ్ర కథానాయకుడు కార్తీక్ ఆర్యన్ సరసన శ్రీలీల అవకాశం అందుకుంది. అనురాగ్ బసు దర్శకత్వం వహిస్తున్న రొమాంటిక్ మ్యూజికల్ డ్రామాకు తు మేరీ జిందగీ హై అనే అధికారిక టైటిల్‌ను ఫిక్స్ చేసారు. ఆషిఖి తరహాలో అద్భుతమైన మ్యూజికల్ డ్రామా నేపథ్యంలో ప్రేమకథతో ఈ చిత్రాన్ని రూపొందిస్తుండడంతో యువతరంలో ఆసక్తి నెలకొంది. మే 2026లో ఈ చిత్రం థియేటర్లలో విడుదల కానుంది. ఈ చిత్రం ప్రస్తుతం ముంబైలో చిత్రీకరణ జరుపుకుంటోంది. 2025 చివరి నాటికి టాకీ పూర్తవుతుంది. పోస్ట్-ప్రొడక్షన్ పాటల చిత్రీకరణ 2026 ప్రారంభంలో జరుగుతుంది. మే 2026 లో సినిమాని విడుదల చేయాలనేది ప్లాన్. మరోవైపు శ్రీలీల టాలీవుడ్ లోను పలు క్రేజీ ప్రాజెక్టులకు కమిట్ కానుందని సమాచారం. మాస్ జాతర ఇప్పటికే చిత్రీకరణ పూర్తయింది. పరాశక్తి, ఉస్తాద్ భగత్ సింగ్ లాంటి భారీ చిత్రాలకు శ్రీలీల ఇప్పటికే కమిటైంది.

**జర్మన్ బ్రాండ్ కి ప్రచారం:** క్షణం తీరిక లేనంత బిజీ షెడ్యూళ్లతో ఉన్న ఈ బ్యూటీని మరోవైపు బ్రాండ్స్ కూడా వెంబడిస్తున్నాయి. సినిమాల చిత్రీకరణలతో పాటు, అటు కార్పొరెట్ బ్రాండ్ల ప్రచార కాంట్రాక్టులను కుదుర్చుకోవడంలోను శ్రీలీల స్పీడ్ ప్రదర్శిస్తోంది.

తాజాగా లుఫ్తాన్సా ప్రకటనకు సంబంధించిన వీడియో విడుదలైంది. లండన్ కేంద్రంగా పని చేస్తున్న ప్రఖ్యాత జర్మన్ ఏవియేషన్ గ్రూప్ కి చెందిన లుఫ్తాన్సాకు శ్రీలీల ప్రచారం చేస్తోంది. యూత్ హృదయాలను కొల్లగొట్టే ఫోజులతో శ్రీలీల ఫోటోషూట్ లుఫ్తాన్సాకు అదిరిపోయే మైలేజ్ పెంచుతుందనడంలో సందేహం లేదు.

## జాన్వీ కపూర్ లేటెస్ట్ లుక్ చూశారా.. అందాలతోనే మాయ చేస్తోందిగా!

బాలీవుడ్ నటి జాన్వీ కపూర్ ఈ మధ్యనే సన్నీ సంస్కారీకీ తులసీ కుమారి అనే సినిమాతో ప్రేక్షకులను పలకరించింది. ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద డిజాస్టర్ గా నిలిచింది. ప్రస్తుతం ఈ సినిమా థియేటర్లలోనే ఉంది.కానీ కాంతార: చాప్టర్ 1 మూవీ విడుదల కావడంతో ఈ సినిమా కలెక్షన్లకు గండి పడింది. అక్టోబర్ 2న విడుదలైన ఈ సినిమా నాలుగు రోజుల్లో కేవలం రూ.32.12 కోట్ల కలెక్షన్స్ మాత్రమే వసూళ్లు చేసింది. అయితే జాన్వీ కపూర్ సినిమాలతోనే కాకుండా సోషల్ మీడియా అభిమానులతో కూడా టచ్ లో ఉంటుంది. అలా ఎప్పటికప్పుడు తన అద్భుతమైన ఫోటోలను షేర్ చేసత్తా సోషల్ మీడియా అభిమానులతో వహ్వా అనిపించుకుంటుంది. అయితే తాజాగా మరో ఫోటోషూట్ తో ప్రేక్షకులను పలకరించింది. ఇందులో మల్టీకలర్ మినీ స్కర్ట్ ధరించి.. పైన జెర్కిన్ వేసుకొని.. పైగా కూలింగ్ గ్లాస్ తో తన లుక్ ను ఫుల్ ఫిల్ చేసింది. ఈ లుక్ లో చాలా అందంగా ఉంది అంటూ అభిమానులు కామెంట్లు చేస్తున్నారు.. జాన్వీ కపూర్ లేటెస్ట్ లుక్



చూసి అభిమానులు ఫిదా అవుతున్నారు. అటు ఫాలోవర్స్ కూడా చాలా అందంగా ఉంది అంటూ.. క్యూట్ గా ఉంది అంటూ ఎవరికి వారు తమ అభిప్రాయాలను వ్యక్తపరుస్తున్నారు.. ఈమె ప్రొఫెషనల్ కెరియర్ విషయానికి వస్తే.. ఈ ఏడాది పరమ్ సుందరి, హోమ్ బౌండ్, సన్నీ సంస్కరీకి తులసీ కుమారి వంటి సినిమాల్లో అలరించింది.అయితే ఈ 3 సినిమాల్లో జాన్వీ కపూర్ యాక్టింగ్ బాగున్నప్పటికీ కథ బాలేకపోవడంతో సినిమాలు డిజాస్టర్ గా నిలిచాయి. ప్రస్తుతం ఈ ముద్దుగుమ్మ టాలీవుడ్ లో రామ్ చరణ్ తో పెద్ది సినిమాలో నటిస్తోంది. అలాగే నాని ది ప్యారడైజ్ మూవీలో కూడా హీరోయిన్ గా నటిస్తున్నట్టు టాక్ వినిపిస్తోంది. అలాగే %ూూ22శూ%6 కూడా గెస్ట్ రోల్ చేస్తున్నట్టు సామాజిక మాధ్యమాల్లో వార్తలు వినిపిస్తున్నాయి. ఇక బాలీవుడ్ లో తఖ్త్ మూవీలో నటిస్తోంది. ఇకపోతే బాలీవుడ్ లో వరుస సినిమాలు చేసి డిజాస్టర్ ను మూటగట్టుకుంటున్న ఈ ముద్దుగుమ్మకి ఇంకా బాలీవుడ్ లో అవకాశాలు వస్తుండడంతో నెటిజన్స్ సైతం ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఇకపోతే ప్రస్తుతం జాన్వీ కపూర్ ఆశలన్నీ కూడా టాలీవుడ్ సినిమాలపైనే ఉన్నాయి. మరి ఏ మేరకు ఈ టాలీవుడ్ చిత్రాలు ఈమెకు సక్సెస్ అందిస్తాయో చూడాలి. ఇకపోతే జాన్వీ కపూర్ తొలిసారి ఎన్టీఆర్ హీరోగా, కొరటాల శివ దర్శకత్వంలో వచ్చిన దేవర సినిమా ద్వారానే తెలుగు ఇండస్ట్రీకి పరిచయమైంది. ఈ సినిమా మంచి విజయాన్ని అందించింది. అందుకే ఇప్పుడు అమ్మడికి తెలుగులో అవకాశాలు వస్తున్నాయి. మరి ఈ సినిమాలు ఈమె కెరియర్ కు ఎలా దోహదపడతాయో చూడాలి.

## హిట్ కాంబో రిపీట్.. ఆ డైరెక్టర్ తో మెగా డాటర్ మళ్లీ..

గత ఏడాది చిన్న చిత్రంగా విడుదలై మంచి హిట్ అందుకున్న కమిటీ కుర్రోళ్ళు మూవీ కాంబో రిపీట్ కానుంది. ఆ సినిమాతో తన కథనంతో ప్రేక్షకులను ఆకట్టుకున్న యంగ్ అండ్ టాలెంటెడ్ దర్శకుడు యదు వంశీ.. ఇప్పుడు పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ బ్యానర్ అధినేత నిహారిక కొణిదెలతో మరో ప్రాజెక్ట్ కోసం చర్చలు జరుపుతున్నారు. సినీ వర్గాల సమాచారం ప్రకారం యదు వంశీ-నిహారిక కాంబినేషన్ లో రానున్న మరో సినిమా 2026 లో సెట్స్ పైకి వెళ్లనుంది. అయితే కమిటీ కుర్రోళ్ళు మూవీ భారీ విజయం సాధించడంతో.. ఇప్పుడు ఆ కాంబో రిపీట్ అవుతుందని తెలియడంతో అప్పుడే ఆడియన్స్ మంచి అంచనాలు పెట్టుకున్నారు. మరో విజయం అందుకోవాలని ఆకాంక్షిస్తున్నారు. అయితే కమిటీ కుర్రోళ్ళు సంచలన విజయం సాధించిన తర్వాత.. పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ ప్రొడక్షన్ నంబర్ 2 ఇప్పటికే షూటింగ్ లో ఉంది. మానస శర్మ దర్శకత్వం వహిస్తున్న ఆ సినిమాలో సంగీత శోభన్, నయన్ సారిక ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. ఫాంటసీ కామెడీ ఎంటర్టైనర్ గా నిహారిక నిర్మిస్తున్నారు. ఇప్పుడు కమిటీ కుర్రోళ్ళు మూవీ డైరెక్టర్ తో మళ్లీ వర్క్ చేయనున్నారు. కాగా, కమిటీ కుర్రోళ్ళు సినిమాలో అనేక ప్రత్యేక అంశాలు ఉన్నాయి. ఒకేసారి.. 11 మంది హీరోలు, నలుగురు



హీరోయిన్స్ తెలుగు ఇండస్ట్రీకి పరిచయమవ్వడం విశేషం. రూ.9 కోట్ల బడ్జెట్ తో రూపొందిన ఆ సినిమా.. థియేటర్స్ లో రూ.18.5 కోట్ల వసూళ్లను రాబట్టింది. నాన్- థియేట్రికల్ ద్వారా రూ.6 కోట్లను వసూలు చేసింది. తద్వారా మొత్తం కమిటీ కుర్రోళ్ళు మూవీ రూ.24.5 కోట్ల వసూళ్లను సాధించి సూపర్ హిట్ గా నిలిచింది. అదే సమయంలో అవార్డుల విషయంలో కూడా సత్తా చాటింది. సైమా 2025లో నిహారిక కొణిదెల ఉత్తమ తొలి నిర్మాతగా నిలిచారు. అందరి దృష్టిని ఆకర్షించారు. సందీప్ సరోజ్ ఉత్తమ డెబ్యూ యాక్టర్ గా అవార్డు గెలుచుకున్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన గద్దర్ అవార్డుల్లో కమిటీ కుర్రోళ్ళు మూవీ.. రెండు ప్రతిష్టాత్మక గౌరవాలను గెలుచుకుంది. కమిటీ కుర్రోళ్ళు జాతీయ సమైక్యత, మత సామరస్యం, అణగారిన వర్గాల సామాజిక అభ్యున్నతిపై ఉత్తమ ఫీచర్ ఫిల్మ్ గా గుర్తింపు పొందింది. డైరెక్టర్ యదు వంశీ ఉత్తమ డెబ్యూ దర్శకుడిగా అవార్డు అందుకున్నారు. ఇప్పుడు యదు వంశీ, నిహారిక కాంబోలో రానున్న మరో సినిమా ఎలాంటి రికార్డులు క్రియేట్ చేస్తుందో వేచి చూడాలి.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536